www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

పేజీలు: 14 + 20

వెల: రూ. 6.50

సోమవారం | 7-1-2019

సంపుటి: 15
సంచిక: 182

శ్రీవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి ఉ. 9.19 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 8.36 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా. 1.06-2.55; దుర్ముహూర్తం: మ. 12.44-1.28, మ. 2.55-3.39; అమృతఘడియలు: మ. 1.26-3.13; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.50 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai





ప్రమాదంలో గాయపడిన స్వాములను రోడ్డుపైనే పడుకోబెట్టిన దృశ్యం; ఇన్‌సెట్‌లో ప్రమాదానికి కారణమైన లారీ

అయ్యప్ప స్వాముల శబరిమల యాత్ర విషాదాంతమైంది. శబరిమల, ఆ తర్వాత రామేశ్వరంలో దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న టెంపో ట్రావెలర్ వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న కంటెయినర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో 11 మంది దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా మెదక్ జిల్లా నర్సాపూర్ మండలవాసులే!

మరణ ఘోష

తమిళనాట రోడ్డు ప్రమాదం.. శబరిమల యాత్రికుల టెంపోను ఢీకొన్న లారీ



లారీ ఢీకొనడంతో ఇనుపముద్దగా మారిపోయిన టెంపో వాహనం

11 మంది దుర్మరణం

అందరూ మెదక్ జిల్లా వాసులే

శబరిమల నుంచి తిరిగొస్తూ అనంతలోకాలకు

అత్యధికులు పాతికేళ్లలోపు యువకులు

నలుగురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స

సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి.. వైద్య సేవలకు ఆదేశం

పుదుక్కోట, మెదక్ కలెక్టర్లతో మాట్లాడిన హరీశ్

2

● మిషిగన్‌లో పేలిన గన్



నోట్లో తుపాకి పెట్టి కాల్చారు

తెలంగాణ విద్యార్థిపై అమెరికాలో దారుణం

బాధితుడు సాయికృష్ణ పరిస్థితి విషమం

పలు ఆపరేషన్లు అవసరమంటున్న వైద్యులు

బీమా లేక దయనీయ పరిస్థితిలో సాయికృష్ణ

వైద్యానికి ఆన్‌లైన్‌లో ప్రవాసుల ఫండింగ్

మహబూబాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కోటి ఆశలతో అమెరికా గడ్డపై అడుగుపెట్టిన తెలంగాణ వాసి గుర్తు తెలియని దుండగుల దాడిలో తీవ్ర గాయాలపాలై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పూస సాయికృష్ణ ఆగంతకుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. మిషిగన్ రాష్ట్రంలోని డెట్రాయిట్ నగరంలో జనవరి 3వ తేదీ రాత్రి సాయికృష్ణ మీద దాడి జరిగింది. లారెన్స్ టెక్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ పూర్తి చేసిన సాయికృష్ణ డెట్రాయిట్‌లోని ఆటోమోటివ్ కంపెనీలో తాత్కాలిక ఉద్యోగం చేస్తున్నారు. మూడో తేదీ రాత్రి 11.30కి సాయికృష్ణ ఒక్కడే కారులో ఇంటికి వెళ్తూ స్థానిక మెక్సికన్ ఫుడ్‌కోర్టు దగ్గర ఆగారు. ఆయన కారు దిగకముందే కొందరు దుండగులు అనూహ్యంగా కారులో జొరబడ్డారు. సాయికృష్ణను తుపాకీతో బెదిరించి కారులో కొన్ని మైళ్ల దూరం తీసుకువెళ్లారు. ఎవరూ లేని నిర్జన ప్రదేశంలో కారు ఆపి నిలువుదోపిడీ చేశారు. బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, ఐడీ కార్డులు,

మిగతా 2వ పేజీలో...

కాంగ్రెస్ నేతల బాహాబాహీ

ఉత్తమ్, ఖుంటియాను దూషించిన సర్వే

పార్టీ నుంచి కేంద్ర మాజీ మంత్రి సస్పెన్షన్



గాంధీభవన్‌లో సర్వే సత్యనారాయణతో ఇతర నేతల వాగ్వాదం

టికెట్లు అమ్ముకున్నారు.. మీ కాంబినేషన్‌లో పార్టీ గెలవడం కల్ల

అసభ్య పదజాలంతో దూషణ.. వారించిన కిషన్, మహేశ్ గౌడ్

పరస్పరం ముష్టిఘాతాలు.. ఓటమిపై పార్టీ సమీక్ష రసాభాస

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నీళ్ల బాటిళ్లు విసురుకున్నారు! చొక్కాలు చింపుకొన్నారు! ఒకరిపై మరొకరు ముష్టిఘాతాలు కురిపించుకున్నారు! అసభ్య పదజాలంతో దూషించుకున్నారు! గాంధీ భవన్ సాక్షిగా.. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఖుంటియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులు బోసురాజు, సలీం అహ్మద్, శ్రీనివాసన్ కృష్ణన్ సమక్షంలో కాంగ్రెస్ నేతలు బాహాబాహీకి దిగిన దృశ్యమిది. గాంధీ భవన్ రణరంగమైంది. దాంతో, ఇందుకు కారణమైన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణను

మిగతా 12వ పేజీలో...

సస్పెండ్ చేయడానికి

ఉత్తమ్ ఎవరు?

నేను ఏఐసీసీ నేతను

ఆ ఇద్దరికీ బాధ్యతలు దొంగ చేతికి తాళాలే

ఉత్తమ్‌ను మార్చకుంటే పార్టీ ఇంకా నాశనం

సత్యనారాయణ ఫైర్

12



12

నా పేరిట సేనలు వద్దు

వాటికి గుర్తింపు లేదు

ఉంటే రద్దు చేసుకోండి

శ్రేణులకు కేటీఆర్ పిలుపు



20 నిమిషాల ముందే

రైల్వే స్టేషన్‌లో ఉండాలి

తనిఖీ చేశాకే రైలెక్కాలి

విమానాశ్రయాల తరహాలో భద్రతా వ్యవస్థ ఏర్పాటు

202 స్టేషన్లలో అమలు

11

పంచాయతీ నామినేషన్లు

నేటి నుంచి!

3 రోజుల పాటు దాఖలుకు అవకాశం



తొలి విడత ఎన్నికల సంబరం షురూ

సర్పంచ్‌లు 4,480, వార్డులు 39,382

2 వార్డులకు ఒక్కరే పోటీ చేయొద్దు

సర్పంచ్‌కు, వార్డుకు పోటీ చేయొచ్చు

జడ్పీటీసీ, ఎంపీటీసీలూ పోటీకి అర్హులే

పాత బ్యాంకు ఖాతాలకూ అనుమతి

రాత్రిళ్లూ పనిచేసే ఫిర్యాదుల విభాగం

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సమరం నేటి నుంచి ప్రారంభం అవుతోంది. తొలి విడత ఎన్నికలు జరగనున్న పంచాయతీల్లో నామినేషన్‌లను సోమవారం నుంచే స్వీకరిస్తారు. రాష్ట్రంలో 12732 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం జనవరి ఒకటిన షెడ్యూల్ జారీ చేసింది. తొలి విడతగా 197 మండలాల్లో 4480 పంచాయతీల్లోని సర్పంచ్ పదవులు, వీటి పరిధిలోని 39,382 వార్డు పదవులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు నామినేషన్‌లను స్వీకరిస్తారు. నామినేషన్‌ల స్వీకరణ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారులను నియమించారు. 3-4 పంచాయతీలకు కలిపి ఒకచోట నామినేషన్లను స్వీకరిస్తున్నారు. రెండు లక్షలకు పైగా నామినేషన్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రత్యేక కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారితో పాటు సిబ్బందిని నియమించారు. తొలి విడతలో 50 లక్షల మంది ఓటర్లున్నారు. తొలి విడత నామినేషన్‌లు స్వీకరించే మూడు రోజులూ శుభదినాలుగానే భావిస్తున్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో

మిగతా 14వ పేజీలో...

B.A. Engineering

బీఏ ఇంజనీరింగ్!

ఇంజనీరింగ్ కాలేజీల్లో ఆర్ట్స్, సైన్స్

కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి

బీఏ, బీకాం, బీఎస్సీలకు అవకాశం

ఆర్ట్స్, క్రాఫ్ట్ కాలేజీలు, డీమ్డ్ వర్సిటీలకు అనుమతి తప్పనిసరి

ఇప్పటి వరకూ లేకపోతే కొత్త కాలేజీగా దరఖాస్తు చేయాలి

14 నుంచి కొత్త కాలేజీ దరఖాస్తులు

అక్రిడేటెడ్ కాలేజీల్లోనూ నాణ్యత కరవే



హైదరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సీట్లు భర్తీకాక మూసివేత దిశగా వెళుతున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) గొప్ప ఊరటనిచ్చింది. ఆ కాలేజీల ప్రాంగణంలో టెక్నికల్ కోర్సులతో పాటు బీఏ, బీకాం, బీఎస్సీ, ఎమ్మెస్సీ లాంటి ఆర్ట్స్ అండ్ సైన్స్ కోర్సులు కూడా అందించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ

మిగతా 2వ పేజీలో...



పరంజ్యోతి

పాలకులకు ఆదర్శం శ్రీరాముడే



సత్యేన లోకాన్ జయతి, దీనాన్ దానేన రాఘవః
గురూన్ శుశ్రూషయా వీరో ధనుషాయుధి శాత్రవాన్

శ్రీరామ చంద్రుడు ఆదర్శ ప్రభువు. ప్రజలను పాలించే వారికి ఉండాల్సిన అన్ని మంచి లక్షణాలూ మూర్తీభవించిన మహనీయుడు. సత్యనిష్ఠతో ప్రజలను, దానగుణంతో దీనులను, సేవాభావంతో గురువులను, ధనురాది ఆయుధాల సాయంతో శత్రువులను వశపరుచుకోగలిగినవాడుగా వాల్మీకి మహర్షి ఆ రాముణ్ని అభివర్ణించారు. ఏ పరిపాలకునికైనా ఉండవలసిన అసలైన గుణాలు ఇవే. ప్రజలు తమ ఏలికను విశ్వసించడానికి సత్యనిష్ఠ ఒక్కటే సరియైన మార్గము. ఇచ్చిన మాటను నిలబెట్టుకోగలిగిన వాడే నిజమైన పరిపాలకుడు. అంతేగాక దీనజన రక్షణ కూడా అతని ప్రధాన కార్యక్రమాల్లో ఒకటి కావాలి. పెద్దలను, వారి మాటలను గౌరవించే గుణం ఉండాలి. పాలకుడి వీరత్వం రాజ్యాన్ని శత్రువుల నుండి రక్షిస్తుంది. ఈ ఉత్తమ లక్షణాలన్నీ ఉండేవాడే పరిపాలనార్హుడు. అన్ని కాలాల్లోనూ వర్తించే ఈ సత్యాన్ని రామచంద్రుని ద్వారా లోకానికి మహర్షి వాల్మీకి అందించారు. రాముని ఘనతను శత్రువర్గంలోని వాడైన మారీచుడు సైతం.. 'రామో విగ్రహవాన్ ధర్మః' అని కీర్తిస్తే.. 'శ్రీమాన్ శత్రునిబర్హణః' అని అకంపనుడు శ్లాఘించాడు. అతడు రాముని గురించి రావణునితో చెబుతూ.. 'వృత్తాయత మహాభుజుడు, వృషస్కంధుడు, వీరుడు, పృథుయశస్సుడు, శ్రీమంతుడు, శత్రునిబర్హణుడు' అనే ఉత్తమ లక్షణాలు ఉన్నవానిగా పేర్కొన్నాడు. ఒక పరిపాలకునిలో ఈ ఆరు లక్షణాలు ఉన్నప్పుడతడు ఉత్తమ పాలకునిగా కీర్తిగడిస్తాడు. ఆ రాజ్యం రామరాజ్యమై అలరిస్తుంది. రాముడి గురించి వాల్మీకి మహర్షి ఇంకా ఎలా వర్ణించాడంటే.. ఆయన శాంతచిత్తుడు, తనకు ఎదురైన వారితో ముందుగానే మాట్లాడేవాడు, ఎవరైనా కఠినంగా మాట్లాడినా విని మరచిపోయేవాడని చెప్పారు. తానే ఎవరితోనైనా ముందుగా తియ్యని మాటలతో పలకరించడం, తానెంత బలశాలియైనా ఆ బలగర్వం ఏ మాత్రం లేకపోవడం ఒక గొప్పలక్షణం. రాముని వంటి ఏ పాలకునికైనా ఈ సత్ లక్షణాలు అవసరమేనన్నది మహర్షి అంతరంగం. పుత్రధర్మ నిర్వహణలోనూ, మిత్ర ధర్మ నిర్వహణలోనూ, సోదర ధర్మానుష్ఠానంలోనూ రామచంద్రుడు నిబద్ధుడు కావడమే ఆయనను ఆదర్శ ప్రభువును చేసింది. "స్వదోష పరదోష విత్."- తనలోని దోషాలను పరుల దోషాలను తెలిసినవాడు, జితేంద్రియుడు అయిన రామచంద్రుడు లోకానికి ఆదర్శవంతుడైన ప్రజాపాలకుడు. అందుకే.. ధర్మజ్ఞుడు, గురువుల శిక్షణలో ఇంద్రియ నిగ్రహాన్ని సాధించినవాడు, కొంచెము ఉపకారం చేసిన వానినైనా ప్రశంసించేవాడు, అసత్యాన్ని ఎప్పుడూ పలకనివాడు, దశరథుని జ్యేష్ఠపుత్రుడు అయిన రాముడిని యువరాజుగా పట్టాభిషేకానికి అర్హుడని నిర్ణయించాడు వాల్మీకి మహర్షి తన రామగాథా కావ్యంలో. ఎక్కడ శ్రీరాముని విషయం చెప్పినా.. ఆయనలోని ఉత్తమ పరిపాలకుని లక్షణాలను వివరించి పాలకులకు ఏయే ఉత్తమ గుణాలు అవసరమో తెలుపుతూ యావద్విశ్వంలోని సమాజాలకూ ఒక ఆదర్శ ప్రభువును కళ్ళెదుట నిలబెట్టారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

- గన్నమరాజు గిరిజామనోహరబాబు



పాల్వంచలో జరిగిన పోటీలో ప్రథమ బహుమతి విజేత మల్లేశ్వరి



వరంగల్‌లో జరిగిన ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

ముత్యమల్లే మెరిసిపోయే ముగ్గులంటా!



భువనగిరిలో జరిగిన పోటీల్లో యువతుల సెల్ఫీ ముచ్చట

కన్నుల పండుగగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలు

తెలుగు రాష్ట్రాలు సహా కర్ణాటక, తమిళనాడులో నిర్వహణ

మొత్తంగా 83కేంద్రాల్లో 12వేలమంది మహిళల సందడి

కేంద్రాలవారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలు

మొగులు మీది చుక్కలే నేల మీద చుక్కల ముగ్గులయ్యాయా? ఆ రంగవల్లుల్లో లేలేత సూర్య కిరణాలు రంగులుగా ఒదిగిపోయాయా? ఆ ముగ్గుల మీద గొబ్బెమ్మలు, చెరుకు ముక్కలు, జీడిపండ్లు, రేగుపండ్లు, కుసుమ, సజ్జ దంట్ల రూపంలో ప్రకృతి కాంత కొలువుదీరి తనను తాను మరింతగా సింగారించుకుందా? అన్నట్లుగా.. నేలమ్మ తీరొక్క రంగులున్న చీర కట్టిందా? అన్నట్లుగా ఆ ముగ్గులు ఎంత ముచ్చటగున్నాయో! బాలికలు, యువతులు, మహిళలు పోటీ పడి ముగ్గులు పేర్చుతుంటే సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్లనిపించింది. 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ గోల్డ్ సోప్ ముత్యాల ముగ్గుల పోటీలు (టేస్ట్ పార్టనర్ గోల్డ్‌డ్రాప్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్, హెల్త్ పార్టనర్ అమృతబిందు) రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటకల్లోని 83 కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో పాల్గొని తమ రంగవల్లులతో సంక్రాంతి శోభను ఇనుమడింపజేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ బహుమతి రూ.5,000, ద్వితీయ బహుమతి రూ.3,000, తృతీయ బహుమతి రూ.2,000తోపాటు అనేక కన్సొలేషన్ బహుమతుల్ని మహిళలు గెల్చుకున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మన సంస్కృతి, సంప్రదాయల పరిరక్షణకు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' కృషి అభినందనీయమని ప్రశంసించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన పోటీలో 115మంది మహిళలలు ముగ్గులు వేశారు. భోగి మంటలు వేసి అలకరించారు. బహుమతి ప్రదాన కార్యక్రమానికి కొత్తగూడెం జిల్లా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరయ్యారు. కాగజ్‌నగర్‌లో 93మంది.. మంచిర్యాల జిల్లా మందమర్రిలో 136మంది.. సిరిసిల్లలో 40మంది పాల్గొన్నారు. వరంగల్‌లో నిర్వహించిన పోటీలను మాజీ మేయర్ స్వర్ణ ప్రారంభించారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లో 186మంది పోటీల్లో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన పోటీల్లో 84మంది పాల్గొనగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ బహుమతులు అందజేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన ముగ్గుల పోటీకి ఎమ్మెల్యే ఇంద్రకరణ్ రెడ్డి.. ఆదిలాబాద్‌లో జరిగిన పోటీలకు జేసీ సంధ్యారాణి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పోటీలను కలెక్టర్ శివలింగయ్య హాజరై ప్రారంభించారు. జనగామలో జరిగిన పోటీల్లో 103మంది మహిళలు పాల్గొనగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి బహుమతులు అందజేశారు. హైదరాబాద్‌లోని 10 కేంద్రాల్లో పోటీలను నిర్వహించారు.

9న హైదరాబాద్‌లో ఫైనల్స్

తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి ఎంపికైన పదిమంది మహిళలకు ఈ నెల 9న హైదరాబాద్‌లో ఫైనల్ పోటీలు జరుగుతాయి. అలాగే ఏపీలోని 13 జిల్లాలు, తమిళనాడు, కర్ణాటకల నుంచి ఒక్కొక్కరు... మొత్తం 15 మందికి ఈ నెల 11న విజయవాడలో ఫైనల్స్ జరుగుతాయి. ఫైనలిస్టులకు రూ.1,70,000 కు పైగా బహుమతులు, అనేక గిఫ్ట్ హ్యాంపర్లు లభిస్తాయి.

బీఏ ఇంజనీరింగ్!

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయాన్ని 2019-20 విద్యా సంవత్సరం నుంచి అమలు చేసుకోవచ్చని 'అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్‌బుక్'లో పేర్కొంది. ఇందుకు ప్రత్యేక భవనాలు, వ్యవస్థ ఉండాలని, ఇంజనీరింగ్ కాలేజీలతో సంబంధం లేకుండా చూడాలని స్పష్టం చేసింది. స్థానిక యూనివర్సిటీలు, బోర్డుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించింది. వాస్తవానికి ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఎప్పటి నుంచో ఈ డిమాండ్ వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా ఇంజనీరింగ్ సీట్లు కూడా పూర్తిస్థాయిలో భర్తీ కాకపోవడంతో ఆయా కాలేజీలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. యాజమాన్యాలు కాలేజీలను మూసివేయడమో లేక ఇంజనీరింగ్ కోర్సులను రద్దు చేసి స్కూల్స్ ఏర్పాటు చేయడమో చేశాయి. ఏఐసీటీఈ తాజా నిర్ణయంతో చాలా ఇంజనీరింగ్ కాలేజీలు ముందుకొచ్చి పీజీ, యూజీలో డిమాండ్ ఉన్న కోర్సులు అందించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఎన్‌బీఏ, న్యాక్ గుర్తింపుపొందిన అక్రిడేటెడ్, అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీలు తాము రూపొందించిన ప్రమాణాలకు మించి పాటించాలని ఏఐసీటీఈ స్పష్టం చేసింది.

డీమ్డ్, ఆర్ట్స్ ఏదైనా...

అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్‌బుక్‌లో ఏఐసీటీఈ మరో కీలక విషయాన్ని ప్రస్తావించింది. పోస్ట్ డిప్లొమా సర్టిఫికెట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి తప్పనిసరి అని పేర్కొంది. ఇప్పటి వరకు అనుమతి లేకుంటే కొత్త కాలేజీగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, ఇంజనీరింగ్‌తో పాటు పలు సాంకేతిక కోర్సులతో నూతన కాలేజీల ఏర్పాటుకు ఈ నెల 14 నుంచి ఫిబ్రవరి 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏఐసీటీఈ పేర్కొంది. కొనసాగుతున్న కాలేజీలు రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

నోట్లో తుపాకీ పెట్టి కాల్చారు

(మొదటిపేజీ తరువాయి)

క్రెడిట్‌కార్డులు, డెబిట్ కార్డులు లాక్కున్నారు. ప్యాంటు కూడా విప్పించారు. ఆ తర్వాత సాయికృష్ణ నోట్లో తుపాకి పెట్టి కాల్చారు. కుడి భుజం మీదా కాల్పులు జరిపారు. రక్తమోడుతున్న సాయికృష్ణను నడిరోడ్డు మీద వదిలేసి ఆయన కారులోనే పరారయ్యారు. ఎముకలు కొరికే చలిలో గంటకు పైగా నడిరోడ్డుపై గాయాలతో పడి ఉన్న సాయికృష్ణను కొందరు మహిళలు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. సాయికృష్ణకు ఆరోగ్య బీమా లేదు. అతని ఆస్పత్రి ఖర్చులకు ప్రవాస భారతీయులు ఆన్‌లైన్‌లో ఫండ్ రైజింగ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 1.15 లక్షల డాలర్లను పోగు చేశారు. ఆదివారం మొదటి శస్త్రచికిత్స జరగ్గా, సోమవారం మరో శస్త్రచికిత్స చేస్తారు. మరికొన్ని సర్జరీలు చేయాల్సి ఉందని చెబుతున్నారు.

మరణ ఘోష!



యాత్రకు వెళ్లే ముందు అయ్యప్ప భక్తులు దిగిన సెల్ఫీ

చెన్నై, మెదక్, నర్సాపూర్, నర్సాపూర్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లారు. ఇరుముడులు సమర్పించారు. అయ్యప్పను దర్శించుకున్నారు. అటు నుంచి అటే రామేశ్వరం వెళ్లారు. 'దైవ దర్శనం బాగా జరిగింది. రెండు రోజుల్లో ఇంటికి వస్తున్నాం' అని కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి చెప్పారు. రామేశ్వరం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. అయ్యప్ప భజనలతో ఆనందంగా యాత్ర సాగుతోంది. అంతలోనే.. కంటైనర్ లారీ రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. జాతీయ రహదారి 226లో రామేశ్వరం నుంచి హైదరాబాద్ వెళుతున్న టెంపో ట్రావెలర్ వ్యాన్‌ను రామేశ్వరం వైపు వెళుతున్న లారీ బలంగా ఢీకొంది. ఆ వేగానికి వ్యాన్ నుజ్జునుజ్జయింది. తమిళనాడులోని పుదుక్కోట జిల్లాలోని తిరుమయం వద్ద ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదమిది. ఈ ప్రమాదంలో 11 మంది మరణించారు. మరో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. మృతులంతా మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఖాజీపేట, రెడ్డిపల్లి, మంతూర్, చిన్న చింతకుంట గ్రామాలకు చెందిన వారే. వారిలో ఏడుగురు అయ్యప్ప స్వాములు కాగా.. ముగ్గురు మాల వేసుకోకుండా సాధారణంగా వెళ్లినవారు. మరొకరు వ్యాన్ డ్రైవర్. ప్రమాద స్థలిలోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ముగ్గురు, చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు.

డివైడర్ లేక...

మెదక్ జిల్లా నర్సాపూర్, హత్నూర మండలాలకు చెందిన 15 మంది భక్తులు ఈ నెల 2న హైదరాబాద్‌లో వాహనాన్ని అద్దెకు తీసుకుని శబరిమలకు వెళ్లారు. వాహనంలో డ్రైవర్‌తోపాటు 16 మంది ఉన్నారు. శనివారం ఇరుముడులు సమర్పించి, అయ్యప్ప దర్శనం చేసుకున్నారు. తిరుగు ప్రయాణంలో రామేశ్వరం వెళ్లి రాత్రి అక్కడే బస చేశారు. ఆదివారం ఉదయం రామేశ్వరం నుంచి బయల్దేరారు. తిరుమయం వద్ద ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై రోడ్డు డివైడర్ లేకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణం. కంటైనర్ లారీ డ్రైవర్ అతి వేగంగా నడపడంతోపాటు వేగంగా దూసుకొచ్చి ఎడమ వైపున వెళ్తున్న అయ్యప్ప భక్తుల వ్యాన్‌ని బలంగా ఢీకొట్టాడు. వెంటనే, కంటైనర్ డ్రైవర్ అక్కడి నుండి పరారయ్యాడు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పుదుక్కోట జిల్లా కలెక్టర్ గణేశ్, ఎస్పీ సెల్వరాజ్ తమ బృందంతో హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రులు నరేశ్, భూమాగౌడ్, రాజు, వెంకటేశ్, సాయిలను పుదుక్కోట మెడికల్ ఆస్పత్రికి తరలించారు. వారికి మెరుగైన చికిత్సలు అందించి, పూర్తిగా కోలుకున్న అనంతరం స్వస్థలాలకు పంపిస్తామని అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న మెదక్ కలెక్టర్ ధర్మారెడ్డి పుదుక్కోట కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మృతదేహాలను తిరుమయం ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం స్వస్థలాలకు పంపించే ఏర్పాట్లు చేపట్టారు. తమిళనాడు ఆరోగ్య మంత్రి విజయభాస్కర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బంధువులకు తెలియజేయండి సార్..!

భాష తెలియని చోట నిర్జీవంగా పడి ఉన్న అయ్యప్ప భక్తుల ఆచూకీ తెలుసుకునేందుకు తిరుమయం తాలూకా పోలీసులు కొంచెం ఇబ్బందిపడ్డారు. మృతులు తెలుగు వారని తెలిసింది గానీ, ప్రమాదం జరిగిన దాదాపు రెండు గంటల వరకు మృతుల స్వస్థలాల వివరాలు తెలియలేదు. దీంతో, ప్రమాదం గురించి తెలుసుకునేందుకు తిరుమయం పోలీసులను సంప్రదించిన 'ఆంధ్రజ్యోతి'తో.. "భక్తులను చూస్తుంటే హృదయం ద్రవించిపోతోంది. వీలైతే వెంటనే బంధువులకు తెలియజేయండి సార్" అని కోరారు. మృతుల్లో ఒకరు మినహా మిగిలినవారు 35 ఏళ్లలోపువారే. వారిలోనూ పాతికేళ్లలోపు యువకులే ఎక్కువ.

సీఎం దిగ్భ్రాంతి

తిరుమయం ప్రమాదంపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. కాగా, మృతుల కుటుంబ సభ్యులకు కేటీఆర్ సానుభూతి తెలిపారు. తిరుమయం రోడ్డు ప్రమాదంలో 11 మంది అయ్యప్ప భక్తులు మరణించడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పుదుక్కోట, మెదక్ కలెక్టర్లతో మాట్లాడానని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరానని తెలిపారు.

మృతులు వీరే

1. నాగరాజు గౌడ్ (35), 2. కుమార్ (23), 3. మహేశ్ (28), 4. సాయి (22), ఖాజీపేట
5. శివప్రసాద్ (22), మంతూర్,
6. శ్యామ్ సుందర్ గౌడ్ (23), మంతూర్
7. అంబర్‌పేట కృష్ణ గౌడ్ (35). రెడ్డిపల్లి
8. నక్క ఆంజనేయులు (42), రెడ్డిపల్లి
9. ప్యాట ప్రవీణ్ గౌడ్ (23), చిన్న చింతకుంట
10. జనుముల సురేశ్ (22), చిన్న చింతకుంట
11. రాజేశ్ గౌడ్ (డ్రైవర్, బోయిన్‌పల్లి)

క్షతగాత్రులు వీరే: శ్రీశైలం, ఎం.రాజు (మంతూర్), భూమాగౌడ్ (ఖాజీపేట), వెంకటేశ్ (మంగాపూర్).

సర్పంచ్‌గా పోటీ చేస్తానని చెప్పి..



సర్పంచ్‌గా పోటీచేయాలనే ఆసక్తికి తోడు రిజర్వేషన్ కూడా కలిసిరావడంతో రెడ్డిపల్లికి చెందిన కృష్ణ ఆనందం అంతా ఇంతాకాదు. మాల విరమణ చేసి వచ్చి పోటీ చేస్తానంటూ అందరికీ చెప్పి వెళ్లాడు. శబరిమల నుంచి రాగానే ప్రచారానికి శ్రీకారం చుట్టాలని భావించాడు. శనివారం తన బావ రాజుకు ఫోన్ చేసి గ్రామంలో రాజకీయాలపైనా ఆరా తీశాడు. విధి చిన్నచూపు చూడడంతో తన కల నెరవేరకుండానే తిరిగిరాని లోకాలకు చేరాడు. కృష్ణకు తల్లి లక్ష్మి, భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పెళ్లయిన 6నెలలకే..



నర్సాపూర్ మండలం ఖాజీపేటకు చెందిన మహేశ్‌కు ఆరు నెలల క్రితమే పెళ్లయింది. స్థానికంగా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అయ్యప్ప మాల ధరించి శబరిమల వెళ్లి తిరిగివస్తూ ప్రమాదంలో మృత్యుఒడికి చేరాడు. భర్త మరణ వార్త తెలియడంతో భార్య అనూష, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారి రోదన స్థానికులను కలిచివేస్తోంది.


లోకం తీరు



నా పని నేను చేశాను... ఇక మీదే బాధ్యత!!

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
రామగుండం	13.4	28.4
ఆదిలాబాద్	13.8	31.3
హైదరాబాద్	15.0	28.8
వరంగల్	16.0	28.0
నల్లగొండ	16.2	29.0



ఆధార్ ఒక గేమ్ చేంజర్

"ఆధార్ వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందుతున్నాయి. ఆధార్‌ను అమలు చేయడం వల్ల అనవసర వ్యయం తగ్గి ఇప్పటివరకు రూ.90వేల కోట్ల వరకు ఆదా అయింది. ఈ సొమ్ముతో ఆయుష్మాన్ భారత్ వంటి భారీ సంక్షేమ పథకాలు మూడింటిని అమలు చేయగలుగుతున్నాం. నిజంగా ఆధార్ ఒక గేమ్ చేంజర్."

- అరుణ్ జైట్లీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి



విద్యా ప్రమాణాలపై రాష్ట్రాలకు గ్రేడ్లు

ఇకపై విద్యా ప్రమాణాలకు సంబంధించి అన్ని రాష్ట్రాలకు గ్రేడ్లు ఇస్తాం. ఇందుకోసం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో 70 పరామితులను పరిగణనలోకి తీసుకుంటాం. దీనివల్ల ఆయా రాష్ట్రాల్లో విద్యా ప్రమాణాలు, నాణ్యత మెరుగుపడుతాయి.

- ప్రకాశ్ జావడేకర్, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.72.44	పాత ధర 67.57
కొత్త ధర రూ.72.67	కొత్త ధర 67.66
పెరిగింది 23పైసలు	పెరిగింది 9పైసలు



గుడ్డుతో మధుమేహం దూరం!

లండన్, జనవరి 6: గుడ్డు ఆరోగ్యానికి చాలా మంచిదన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే.. ఆహారంలో రోజూ ఒక గుడ్డు తీసుకుంటే టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుందని తాజా అధ్యయనంలో తేలింది. యూనివర్సిటీ ఆఫ్ ఈస్టర్న్ ఫిన్లాండ్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఇతరులతో పోలిస్తే రోజూ ఒక గుడ్డు తినే వారికి మధుమేహం ముప్పు తక్కువగా ఉంటుందని గుర్తించారు. పరిశోధనల్లో భాగంగా 296 మంది రక్త నమూనాలు పరిశీలించారు. వారానికి రెండు గుడ్లు తినేవారితో పోలిస్తే.. రోజూ ఒక గుడ్డు తినేవారికి టైప్-2 మధుమేహం వచ్చే అవకాశాలు తక్కువని వారు కనుగొన్నారు. అలాగే రక్తంలో ఎమినో యాసిడ్ల స్థాయి ఎక్కువగా ఉండడం వలన కూడా టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని పరిశోధకులు గుర్తించారు.

సూది లేకుండా షుగర్ టెస్ట్!

లండన్, జనవరి 6: కనీసం సూదిపోటు నొప్పి కూడా లేకుండా షుగర్ పరీక్ష చేసుకునే ఒక సరికొత్త పరికరాన్ని స్వీడన్‌లోని కేటీహెచ్ రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు రూపొందించారు. వారు అభివృద్ధి చేసిన మైక్రోనీడిల్ ప్యాచ్‌తో రక్తంలో చక్కెర స్థాయిలను పర్యవేక్షించవచ్చు. శరీరానికి ప్యాచ్ వేసినట్టు కనిపించే ఈ పరికరం అందుబాటులోకి వస్తే రక్త నమూనా కోసం రోజులో అనేక సార్లు సూదితో పొడిపించుకునే బాధ తప్పుతుందని పరిశోధకులు చెబుతున్నారు. ఈ నమూనా పరికరాన్ని మనుషులపై ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ప్రస్తుతం క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం షుగర్ టెస్టు కోసం కనీసం 7ఎంఎం సూదిని వినియోగిస్తున్నారు. అయితే దానికి 50 రెట్లు చిన్నదైన మైక్రోనీడిల్ ప్యాచ్‌తో తాజా పరికరాన్ని రూపొందించామని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

చిత్తూరు జిల్లాలో తమిళనాడుకు సమీపాన ఒక కుగ్రామంలో జన్మించి, ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి బి.కాం. పట్టావరకు జిల్లాలో అభ్యసించి తను అనుకొన్నది సాధించాలనే ధృడసంకల్పంతో 1973లో బెంగళూరు నగరానికి వచ్చిన డాక్టర్ పి.శ్యామరాజు ఇంతింతై వటుడింతై అన్నట్టు చిన్న కంట్రాక్టర్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోనే కాక ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో కూడా దివ్యశ్రీ సంస్థలను విస్తరించి మౌలిక సదుపాయాల రంగంలో రాణించారు. 2004లో శ్యామరాజు సతీమణి రుక్మిణి ఆకస్మిక మరణంతో కలత చెంది ఆమె ఆశయ సాధన కోసం అదే సంవత్సరం ప్రారంభించిన రేవా విద్యాసంస్థలు అనతి కాలంలోనే కాలేజీ స్థాయి నుంచి యూనివర్సిటీగా రూపాంతరం గావించింది. 15 వేల మంది విద్యార్థులు రేవా యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్నారంటే రేవాపై విద్యార్థుల నమ్మకానికి మచ్చుతునక. విద్యాసంస్థలను తన సతీమణి రుక్మిణి ద్యాలయంగా భావిస్తానని శ్యామరాజు అంటారు. ఆ భావనతోనే పవిత్రంగా భావించాలని తన అధ్యాపక బృందానికి నిరంతరం చెబుతుంటారు. - బెంగళూరు.

ప్రమాణాలే ప్రాధాన్యంగా రేవా యూనివర్సిటీ

బెంగళూరు



ఇదీ రేవా ప్రస్థానం...

విద్యాసంస్థలను ప్రారంభించాలనే ఆలోచన వచ్చిందే తడవుగా బెంగళూరులోని యలహంక ప్రాంతంలో 50 ఎకరాల సువిశాల ప్రదేశాన్ని ఎంచుకొని అత్యుత్తమ ఇంజనీరింగ్ కళాశాలకు నాంది పలికారు. మౌలిక వసతుల రంగంలో తనకున్న అపార పరిజ్ఞానంతో పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ ఆహ్లాదకరమైన ప్రాంగణానికి రూపునిచ్చారు. ఇంజనీరింగ్ కళాశాలకు అవసరమైన దానికంటే మరింత ఎక్కువ సదుపాయాలను కల్పించారు. మొదటి సంవత్సరం నుంచే కళాశాలకు విద్యార్థుల వెల్లువ మొదలైంది. అప్పటికే బెంగళూరు నగరంలో అనేక కళాశాలలున్నా రేవాను ఎంపిక చేసుకోవటం, ప్రాంగణంలోని మౌలిక సదుపాయాల కల్పన, ఆధునాతన ల్యాబ్‌లు, ఎంపిక చేసిన అధ్యాపక బృందం కారణంగా చెప్పవచ్చు.

యూనివర్సిటీగా రూపాంతరం...

రేవా కళాశాల నుంచి అనతికాలంలోనే యూనివర్సిటీగా రూపాంతరం చెందటం శ్యామరాజు కృషికి నిదర్శనం. 2013లో రేవా యూనివర్సిటీగా రూపుదాల్చింది. ప్రపంచంలో అనేక ప్రముఖ యూనివర్సిటీలను సందర్శించి వాటికి దీటుగా రేవా యూనివర్సిటీని రూపొందించాలనే ధృడసంకల్పంతో అన్ని అనుమతులతో రేవా యూనివర్సిటీని స్థాపించామన్నారు ఛాన్సలర్ డాక్టర్ పి.శ్యామరాజు.

అంతర్జాతీయ ప్రమాణాలతో...

రేవా యూనివర్సిటీని ఒక సారి సందర్శిస్తే విద్యార్థి గాని, తల్లిదండ్రులు గాని మరో ఎంపిక ఉండదని పూర్తి సంతృప్తి వ్యక్తపరుస్తారని ఛాన్సలర్ అంటారు. రేవా యూనివర్సిటీ

ఇంటర్ నుండి పిహెచ్‌డి వరకు....

ఇంటర్‌మీడియట్ స్థాయి నుంచి పిహెచ్‌డి స్థాయి వరకు వివిధ కోర్సులను నిర్వహిస్తూ, ఇంజనీరింగ్‌లో కంప్యూటర్, ఇన్ఫర్‌మేషన్, మెకానికల్, సివిల్ వంటి అనేక రంగాలతో పాటు డిగ్రీ స్థాయిలో 5 సంవత్సరాల లా కోర్సు, బి.కాం., బి.ఎ.లో వైవిధ్యమైన ఉపాధి అవకాశాలు గల కోర్సులను ప్రవేశ పెట్టారు.

అవార్డులు, రివార్డులు...

తాను చేయాలనుకొన్న పని, త్రికరణ శుద్ధితో నిరంతరం శ్రమిస్తూ నిర్మాణ రంగంలోనూ విద్యారంగంలోనూ అనేక ప్రమాణాలను నెలకొల్పిన శ్యామరాజు అవార్డు, రివార్డులు తోడయ్యాయి. ఇంజనీరింగ్ కళాశాలలో చేసిన కృషిని గుర్తించిన విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను

గర్వకారణం. రేవా యూనివర్సిటీలో కూడా వేల సంఖ్యలో తెలుగు విద్యార్థులు విద్యనభ్యసిస్తూ క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా దేశ విదేశాల్లో అనేక ప్రతిష్ఠాత్మకమైన ఉద్యోగాలు పొందటం అత్యంత సంతృప్తినిచ్చే విషయంగా శ్యామరాజు అంటుంటారు. తనకు తన విద్యార్థులే అతి పెద్ద అవార్డుగా, విద్యార్థుల గుర్తింపే తనకు రివార్డుగా పేర్కొన్నారు.

సమాజ సేవలోనూ...

తనకు అన్నీ ఇచ్చిన సమాజానికి తనవంతు సహకారాన్ని అందించాలనే సదుద్దేశంతో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని పదిహేను రోజులు

రేవా ఫౌండర్స్ డేను ఒక పండుగలా జరపడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అనేక రంగాలలోని ప్రముఖులను సన్మానించి జీవన సాఫల్య పురస్కారాన్ని ఇవ్వడం ద్వారా సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందనేది డా.శ్యామరాజు అభిప్రాయం. గతంలో జేసుదాసు, రమేశ్ అరవింద్, శేఖర్ గుప్త (ఎన్‌డిటివి), కిరణ్‌కుమార్ (అప్పటి ఇస్రో ఛైర్మన్) వంటి ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలను అందించారు. 2019 సంవత్సరానికిగాను ప్రముఖ దర్శకులు, పద్మశ్రీ కె.విశ్వనాథ్‌కు, ప్రముఖ సంగీత దర్శకులు హంసలేఖ, పద్మభూషణ్ మంజుశర్మలను జీవన సాఫల్య పురస్కారాలను అందించారు.



రేవా యూనివర్సిటీ జీవన సాఫల్య పురస్కారాన్ని ఛాన్సలర్ డా. పి. శ్యామరాజు చేతుల మీదుగా అందుకున్న దర్శకులు కె.విశ్వనాథ్







60 శాతం పచ్చదనం, అధునాతన హాస్టళ్ళు

సువిశాల ప్రాంగణంలో 60 శాతం పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. దీంతో పాటు ఆధునిక వసతి సౌకర్యం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అత్యంత సంతృప్తినిచ్చే అంశం. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా హాస్టళ్ళతో పాటు అనుసంధానంగా అధ్యాపక బృందానికి నివాస సదుపాయాలు ఏర్పాటు చేశారు. వీరందరికి ఛాన్సలర్ శ్యామరాజు నిరంతరం అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు చిన్న సమస్యలను కూడా పరిష్కరించడం విద్యార్థులకు అత్యంత సంతృప్తినిచ్చే అంశం. రేవాలో ప్రవేశించే విద్యార్థినీ విద్యార్థులు వంద శాతం సంతృప్తి వ్యక్తం చేయాలన్నదే తమ ధ్యేయమన్నారు.

ప్రమాణాలలో అంతర్జాతీయ స్థాయిలో ఉండటంతో విదేశీ విద్యార్థులు కూడా విరివిగా విద్యనభ్యసిస్తుంటారు. ప్రపంచంలో వివిధ దేశాల నుంచి విద్యార్థులు రేవాకు రావటం గర్వకారణం. మన దేశం నుంచి అనేక మంది విద్యార్థులు అమెరికా, కెనడా, యుకెలకు ఉన్నత విద్యకై వెళ్తుండటం ఆనవాయితీ. అలాంటి స్థాయి యూనివర్సిటీని మన దేశంలో ఉండాలనే ఉద్దేశంతో రేవా యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో రూపొందించామని శ్యామరాజు అన్నారు. యూనివర్సిటీలోని పాఠ్యాంశాలు కూడా అంతర్జాతీయ స్థాయిలో ఉంటాయని వీటికి తగ్గట్టుగా డిజిటల్ తరగతి గదులు రూపొందించారు. విద్యా ప్రమాణాలు, ఉద్యోగ అవకాశాలతో పాటు పరిసరాలకు కూడా అత్యంత ప్రాధాన్యం రేవా యూనివర్సిటీ ప్రత్యేకత.

ప్రదానం చేసింది. ఇటీవల ఎంహెచ్‌ఆర్‌డి జాతీయ స్థాయిలో ప్రకటించిన 'స్వచ్ క్యాంపస్ అవార్డు 2018' రేవా యూనివర్సిటీకి 6వ స్థానం సాధించింది. ఐపిఎస్‌వి జెనీవాతో పాటు రేవా యూనివర్సిటీ మోస్ట్ ప్రామిసింగ్ యూనివర్సిటీ బై గ్లోబల్ ఇండియా ఎడ్యుకేషన్ ఫోరం 2018 అందుకొంది. సిఎస్ఆర్ బిజినెస్ స్కూల్ అవార్డులో 3వ ర్యాంక్ సాధించింది. సింగపూర్ లోని ప్రతిష్ఠాత్మకమైన ఏసియుఎన్ ప్రకటించిన ఏషియా గ్రేటెస్ట్ బ్రాండ్ లీడర్స్ 2017-18 అవార్డుకు శ్యామరాజు ఎంపికయ్యారు. వీటితో పాటు కర్ణాటక రాష్ట్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించే కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారాన్ని 2017లో విద్యారంగంలో పి.శ్యామరాజు చేసిన కృషికి అందించారు. అచ్చతెలుగువారైన శ్యామరాజు కర్ణాటకలో ఇంతటివారు కావడం తెలుగు వారందరికీ

బెంగళూరు నగరంలోని బ్యాటరాయనపుర నియోజకవర్గంలో విద్యార్థులు జాగృతి పేరున అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా 'డు నాట్ డ్రింక్ అండ్ డ్రైవ్' పేరిట మద్యపానం సేవించి వాహనాలు నడుపరాదని యువతకు తెలియజేస్తూ అవగాహన జాతాను నిర్వహించారు. బెంగళూరు గ్రామీణ జిల్లా శెట్టిగెరె గ్రామాన్ని దత్తత తీసుకొని ప్రజలకున్న అవసరాలు, యువత ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధిని సాధించాలనే ఉద్దేశంతో ఉమెన్ ఎంపవర్‌మెంట్ పేరున శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నారు. యూనివర్సిటీ గురించి వివరాలకు రిజిస్ట్రార్ డా. ధనుంజయను ఫోన్ 99451 85445 ద్వారా సంప్రదించవచ్చు. www.reva.edu.in

---



అశ్వారావుపేట టీఆర్ఎస్ సమావేశంలో కార్యకర్తల వాగ్వాదం

టార్గెట్ పొంగులేటి!

- ఖమ్మం టీఆర్ఎస్‌లో భగ్గుమన్న విభేదాలు
- నియోజకవర్గ సమావేశాల్లో విమర్శలు

హైదరాబాద్/అశ్వారావుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించినప్పటికీ టీఆర్ఎస్ పార్టీలో నాయకుల మధ్య విభేదాలు తలెత్తాయి. పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో ఇవి బహిర్గతమవుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏకంగా సిట్టింగ్ ఎంపీని బహిష్కరించాలన్న డిమాండ్ వచ్చింది. ధర్మపురి నియోజకవర్గంలో తనను ఓడించేందుకు ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి మాజీ ఎంపీ వివేక్ రూ.3 కోట్లు ఇచ్చారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోనూ బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన తన సోదరుడు వినోద్‌కు వివేక్ సహకరించడంతో పార్టీ అభ్యర్థికి ఇబ్బందులు ఎదురైనట్లు విమర్శలొచ్చాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ సీటు మాత్రమే సాధించడంతో ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి టార్గెట్ అయ్యారు. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఓడిపోయిన టీఆర్ఎస్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం జరిగిన అశ్వారావుపేట టీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో పొంగులేటి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వర్గీయుల మధ్య ఘర్షణ, తోపులాట జరిగింది. మూడు రోజుల క్రితం పాలేరులోనూ తుమ్మల ఓటమికి పొంగులేటి కారకుడంటూ నాయకులు విరుచుకుపడ్డారు. సత్తుపల్లి, కొత్తగూడెం నియోజకవర్గాల్లోనూ పొంగులేటి టార్గెట్ అయ్యారు. కాగా, పార్టీలో ఎవరినైనా సస్పెండ్ చేసే అధికారం స్థానిక నేతలకు లేదని, క్రమశిక్షణ చర్యలపై అధిష్ఠానానిదే తుది నిర్ణయమని టీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి, టీఎస్ఐడీసీ ఛైర్మన్ గాదరి బాలమల్లు అన్నారు.

చిరుత చిక్కేనా!



అధికారులు ఏర్పాటు చేసిన బోను

యాచారం, జనవరి 6: చిరుత పులి ఎక్కడ.. ఎప్పుడు దాడి చేస్తుందేమోనని రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధి కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం ఐదింటికే శివార్ల నుంచి ఇంటికి చేరుకుంటున్నారు. చిరుతను బంధించేందుకు అటవీశాఖ అధికారులు రెండు బోన్లను ఏర్పాటు చేశారు. కొత్తపల్లి అటవీ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి చిరుత సంచరించినట్లుగా గుర్తించారు. వెంకటేశ్వరగుట్ట నుంచి కిందికి దిగిన చిరుతను చూసి కుక్కలు అరవడంతో అది తిగి గుట్టవైపు వెళ్లినట్లుగా చెబుతున్నారు. అయితే అధికారులు ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాల్లో చిరుత జాడ కనిపించలేదు. శనివారం రాత్రి రైతులతో పాటు అధికారులు అక్కడే నిద్రించి పరిస్థితిని సమీక్షించారు. చిరుత గుట్ట పైనుంచి రెండుమార్గాల్లో దిగడం.. వెళ్లడం చేసిందని దాని పాదాల గుర్తుల ఆధారంగా తేల్చారు. కాగా, గుట్టలో భారీ లోయలున్నాయని.. వాటిల్లోకి వెళితే మళ్లీ రావడం గగనమేనని రైతులు వెంకటయ్య, యాదయ్య, మల్లేశ్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. చిరుతను బంధించేందుకు అధికారులు ఆదివారం 2 బోన్లు తెచ్చి వేర్వేరు మార్గాల్లో ఏర్పాటు చేశారు.

గోవాకు మరింత తొందరగా..

ఇక తగ్గనున్న 102 కిలోమీటర్ల దూరం

- కర్ణాటకలోని హుబ్బళ్లికి కూడా..
- వేగంగా రైల్వే లైన్ నిర్మాణ పనులు
- మహబూబ్‌నగర్-మునీరాబాద్ మధ్య కొత్తలైను

హైదరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి గోవాకు దూరం తగ్గనుంది. ప్రస్తుతం రైల్వే మార్గంలో ఈ రెండు నగరాల మధ్య దూరం 791 కి.మీ.గా ఉండగా.. ప్రయాణ సమయం సికింద్రాబాద్ నుంచి 19.5 గంటలు, కాచిగూడ నుంచి 17 గంటలుగా ఉంది. కొత్తగా నిర్మిస్తున్న మహబూబ్‌నగర్-మునీరాబాద్ రైల్వేలైన్‌తో.. ఆ దూరం 102 కి.మీ. తగ్గి, 689కి.మీ.కు చేరుకోవడమే కాకుండా.. ప్రయాణ సమయం కూడా భారీగా ఆదా కానుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి వెళ్లే రెండు రైళ్లు కర్నూలు, గుంతకల్ జంక్షన్, కర్ణాటకలోని హుబ్బళ్లి మీదుగా గోవా సమీపంలోని మడ్‌గావ్ జంక్షన్‌కు వెళ్తున్నాయి. చుట్టూ తిరగడం.. స్టేషన్ల సంఖ్య ఎక్కువ వంటి కారణాలతో ప్రయాణ సమయం ఎక్కువగా ఉంది. మహబూబ్‌నగర్-మునీరాబాద్ మార్గం పూర్తయితే.. సమయం, దూరం కలిసివస్తాయని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్-హుబ్బళ్ళికి కూడా దూరం తగ్గుతుందని, వచ్చే ఏడాదికి ఈ మార్గం అందుబాటులోకి వస్తుందని అంచనా.

ప్రాజెక్టు ముఖచిత్రం

ప్రాజెక్టు మంజూరైన సంవత్సరం: 1997-98
అంచనా వ్యయం: రూ. 1,723 కోట్లు
మహబూబ్‌నగర్-మునీరాబాద్ మధ్య దూరం: 274కి.మీ.
దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని దూరం: 66కి.మీ.
మిగతాది: నైరుతి రైల్వే పరిధి
పురోగతి: దేవరకద్ర-జక్లేర్ మధ్య 29కి.మీ. మేర రైలు మార్గం పనులు 2017లోనే పూర్తయ్యాయి. రైలు సర్వీసులు ప్రారంభమయ్యాయి.
పనుల తీరు: దేవరకద్ర-కృష్ణ స్టేషన్ మధ్య లైను నిర్మాణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం జక్లేర్-కృష్ణ మార్గం పనులు వేగంగా సాగుతున్నాయి.
భూసేకరణ: ఈ రైలుమార్గం నిర్మాణానికి 866 ఎకరాల మేరకు భూమి అవసరం కాగా, తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 734 ఎకరాల భూమిని రైల్వేకు అందజేసింది.



నిర్మాణంలో ఉన్న రైల్వే ట్రాక్

అధికారుల నిర్లక్ష్యానికి ముగ్గురు బలి

- విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు, వర్కర్ మృతి
- మంచిర్యాల జిల్లాలో విషాదం

వేమనపల్లి, జనవరి 6: విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. వ్యవసాయ భూములకు కరెంట్ లైన్ కోసం స్తంభాలు మంజూరైనప్పటికీ వాటిని పాతడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించారు. నెలలు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వకపోవడంతో సొంతంగా స్తంభాలు పాతుకునే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు రైతులు సహా విద్యుత్తు వర్కర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం ముల్కలపేటలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చినగొండ రామయ్య(55), అతని సోదరుడి కుమారుడు చినగొండ సురేందర్(25) తమ వ్యవసాయ భూములకు కరెంటు లైన్ కోసం డీడీ కట్టడంతో ఏడు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్తు స్తంభాలు మంజూరయ్యాయి. కానీ వాటిని పాతడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో వారే సొంతంగా స్తంభాలు పాతేందుకు సిద్ధమయ్యారు. నీల్వాయికు చెందిన విద్యుత్తు వర్కర్ వశాక భీంరావు(30)తో కలిసి ఆదివారం విద్యుత్తు స్తంభాలు పాతడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఓ స్తంభానికి ఉన్న ఇనుపచువ్వలు పక్కనే ఉన్న విద్యుత్తు తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ముగ్గురు మృతి చెందారు. వీరి మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మృతుల కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. అధికారులు వచ్చే వరకు మృతదేహాలు తీసుకెళ్లబోమంటూ సాయంత్రం 7గంటల వరకు అక్కడే బైఠాయించారు. కాగా, ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.30 లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని పలువురు స్థానిక నాయకులు డిమాండ్ చేశారు.

వసతి గృహాల్లో కలుషిత ఆహారం

చేవెళ్ల 'కస్తూర్బా'లో 67మందికి, చిట్యాల హాస్టల్‌లో 27 మందికి అస్వస్థత

- ఐదుగురి పరిస్థితి విషమం



చిట్యాలలో విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యురాలు

చిట్యాల/చేవెళ్ల, జనవరి 6: కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఒకేరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో, రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు కలుషిత ఆహారం బారిన పడ్డారు. చిట్యాలలో 27 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవగా.. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. శనివారం రాత్రి విద్యార్థినులు హాస్టల్‌లో క్యాబేజీ కూర, సాంబారుతో భోజనం చేశారు. తిన్న కొద్ది సేపటికే కడుపు నొప్పి, తలనొప్పి మొదలైందని విద్యార్థినులు తెలిపారు. ఎవరూ ఆస్పత్రికి తీసుకెళ్లకపోవడంతో ఆదివారం ఉదయం పరిస్థితి విషమంగా మారి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయని చెప్పారు. 27 మందిని స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. వీరిలో ప్రవళిక, స్నేహ, ఝాన్సీ, సునీత, సౌజన్యల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఇక చేవెళ్లలోని కస్తూర్బా వసతి గృహంలో మొత్తం 200 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. సిబ్బంది శనివారం రాత్రి భోజనంలో విద్యార్థులకు క్యాప్సికం, పప్పు, పెరుగుతో భోజనం వడ్డించారు. భోజనానికి ముందు విద్యార్థులకు ఫ్రూట్ సలాడ్ ఇచ్చారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి విద్యార్థినులు కడుపు నొప్పి వస్తుందని సిబ్బందితో చెప్పి వాంతులు చేసుకోవడం మొదలు పెట్టారు. మొత్తం 67 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 37 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్, ఉస్మానియా ఆస్పత్రులకు తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన వారికి చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలోనే వైద్యం అందించి వసతి గృహానికి తీసుకెళ్లారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్య అధికారులు, చేవెళ్ల ఆర్డీవో హన్మంత్‌రెడ్డి, ఎంఈవో అక్బర్ వసతి గృహానికి చేరుకున్నారు. తాగునీటిని పరీక్షించేందుకు నమూనాలను ల్యాబ్‌కు తీసుకెళ్లారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శించారు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖర్చు చేసిందంతా ఏపీ సీఎం చంద్రబాబు పంపిన డబ్బేనని రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. మిర్యాలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు.



మార్మిక వచనం కవితాత్మక కథనం

మనిషి ఒకడు కాడు, ఇద్దరు. ఒకడు చీకటిలో వెలుతురయ్యేవాడు. ఒకడు వెలుతురులో చీకటయ్యేవాడు

- ఖలీల్ జిబ్రాన్

కథ ఎప్పటికీ నిలిచిపోయే వొక విశ్వజనీన కవిత్వరూపం. దీనికి వొక స్థిర సూత్రం లేదు. ఏ కథకు అదే సూత్రం. దేనికి అదే శాశ్వతం. అది వాస్తవాలతోపాటు వాస్తవాల్లోని మార్మికతనుకూడా పసిగట్టి చెబుతుంది. జీవితంలోని రహస్యాలను వొడిసిపట్టుకొని magicalగా మాట్లాడుతుంది. అసలైన కథ అంతు చిక్కదు. పాఠకుని యొక్క ఆత్మగౌరవం, ఆత్మరక్షణ తన గుణం. ఇది originality లోంచి పుడుతుంది. భూమి అంతమయిపోయేవరకు కథ ఎప్పటికీ తన కథను ముగించదు. కథ ఎప్పటికీ అంతం కాదు. ఇటువంటి లక్షణాలున్న కథలు విరివిగా రావు. కళ్ళకు అంత తొందరగా తగలవు. కాలంలోంచి, ఎవరూ చూడకుండా, దృష్టిని మళ్ళించే లోపల్నే జారిపోతుంటాయి. మంచి పాఠకుడికి మంచి కథ వొక accidental muse. అంతేకాక వొక యాదృచ్ఛిక అనుభవాంతర పొర్లింత.

అజయ్ ప్రసాద్ కథలు ఇటువంటి మంచి పాఠకునికి తాదాత్మ్యతను రగిలించిన కథలని అనిపించింది. ఇవి అచ్చమయిన, గాఢమయిన అతి మామూలు జీవితానికి దగ్గరగా మసలే 'వ్యక్తి' కథలు. ఇవి మనలోని "నీరంధ్ర భవదాంధకార జీమూతాళి" వంటి అంధకారంలో వున్న మనలోని నెగడుని అంటించి మన స్వభావాలను Diagnose చేస్తాయి. మన ఇండ్ల లోపలి నీడలలో సోకుతూ 'వాస్తవానుభవంగా' తుదకి పరిణమిస్తాయి. మనలో అంటరాని అనుభవాలై వొక మూలన పడివున్న జ్ఞాపకాలను తెరమీద నిలబెడతాయి. మంచి కథలు, జీవశక్తి దన్నుగా వున్న కథలు పాఠకుల స్థాయినీ, పరిణతినీ ఎప్పటికప్పుడు పెంచుతూ సరిదిద్దుతూ వుంటాయి కదా... సరిగ్గా అజయ్ కథలు పాఠకత్వానికి కూడా మెరుగులు దిద్దే కథలని చెప్పకతప్పదు. అందుకే సత్యంలోని అసంబద్ధతను తన కథల సారంగా ఎన్నుకున్నాడనిపిస్తుంది. కొన్ని పదుల సంవత్సరాలుగా జ్ఞాతమయ్యో, అజ్ఞాతమయ్యో రాసుకుంటూ వస్తున్న ఈ కథలు పాఠకుల తత్వజ్ఞత కోసం వస్తున్న కథలు. ఈ కథలు రచయిత వ్యక్తి స్వీయాన్వేషణలోని అడుగు జాడల్ని ముద్రిస్తూ పోతాయి. అస్పష్టత.. జీవితంలోని తీసెయ్యలేని వాస్తవం కనుక ఆయా ముద్రల్ని అస్పష్టంగానే చిత్రలేఖనం చేస్తాడు రచయిత. ఈ ముద్రలు ఎలాంటి సునామీలు వచ్చినా చెరిగిపోని ముద్రలు. మన ఆంతరిక దృష్టి కోణాన్ని పక్కకు జరిపే ముద్రలన్న మాట. ఇవన్నీ కూడా కొత్త తీరాల లేదా premodern తీరాల సత్యావిష్కరణలు గావిస్తాయి. అజయ్ ప్రతీ కథ ఒక మత్తుని ఎగదోసి internal discourse/ dialogueకి దారి తీసే కథలుగా అనిపిస్తాయి.

మన ఇప్పటి informational, risk society, post industrial societyకి అజయ్ కథలు కొరుకుడు పడకుండా అడ్డు తగిలే కథలు. ఎందుకంటే ఇవి వ్యక్తి గురించి మాట్లాడతాయి. 'వొక్కడి' గురించి, అతడి లోపలి ప్రపంచం గురించి ముచ్చట్లు పెడతాయి. అవి సిద్ధాంతాలను వల్లించవు. జీవనానుభవం వీటి సారం. కథలు ఏదో చెప్పాలనే agendaతో మొదలవ్వవు. కానీ వొక క్షణకాల తటస్థ దుఃఖసత్యాలను బింబిస్తాయి. ఆ క్షణకాల పాక్షిక సత్యమే వొక చెరపలేని వాస్తవంగా సంపూర్ణతను సంతరించుకుంటుంది. ఇప్పటి మన వ్యాధిగ్రస్థ మానవ సమాజానికి మనలోపలి మన ప్రాకృతిక ప్రపంచంలో వ్యాధినివారణ సంగతులున్నాయని ప్రవచించే కథలు ఇవని తెలిసివస్తుంది.

కథ చదివితే మనలోని వొక అమూర్త ద్రవధార పొంగాలి. హృదయ సంపద పెరుగుతూ పోవాలి. వెలుపలి సౌకర్యాల విషయంలో మనం వినిమయ దుకాణాలమయిపోతున్నాం. అంతరంగ దరిద్రం పెరిగినట్టుగా సంపద పెరగలేదు. అంతరంగమొక pharmaceutical store అయిపోయింది. ఈ స్థితి నుంచి మంచి వచన కథా కవిత్వం లాంటి కథలు కావాలి మనల్ని కాపాడటానికి.

అజయ్ ప్రసాద్ కథలన్నీ అచ్చమయిన కథలుగా అన్పించాయి. వాటిల్లో అనుభవమూ, మానవ సంకల్పంలోని నిస్సహాయత్వమూ తెలిసి వచ్చాయి కాబట్టేమో? మన చుట్టూతా క్షణక్షణమూ సంభవించే ఘటనలు అనుభవాలుగా మాత్రం మారవు. మన నుంచి, మన స్పృహ తగలకుండా జారిపోయే కాలం మనది కాదు. మన అనుభవంలోకి అడుగుపెడితేనే కాలముద్ర అగుపడుతుంది. అటువంటి కాలాన్ని మనకు మిగిల్చి ఇవ్వడమే రచయిత బాధ్యత అనిపిస్తుంది.

జ్ఞాపకాలని చరిత్రగా మార్చగలిగే magical గుణం కథల్లో గనక ఉంటే పాఠకుడు ఎంత రసార్ద్రతకు లోనవుతాడో చెప్పనవసరంలేదు. అజయ్ ప్రసాద్ దశాబ్దం క్రితం నుంచి రాస్తూ వస్తున్న కథల్లోని praxis అంతా పౌరాణిక చారిత్రక తత్వమే అని అనుకుంటున్నాను. ఇతని కథలు బఠానీల కథలు కావు. Facebook కథలు అస్సలు కావు. సెల్ఫీ సరంజామా కథలు కావు. ప్రతీ కథలో details ఇస్తూ ఉంటాడు. ఆ detailing అంతా ఎంతో హృదయ గతంగా ఉంటుంది. పాఠకుడ్ని internalize చెయ్యడం చాలా ముఖ్యం కథకుడికి. 'నిర్లయ', 'ఆమెనీడ', 'మృగశిర', 'లోయ' వంటి కథలు తను మాత్రమే రాయగలడనిపిస్తుంది. కొన్ని కథల్లోని విషాద చార, పెద్దిభొట్ల సుబ్బరామయ్య వంటి కథకుల పరిమితిని దాటి ముందుకు సాగిపోతుంటుంది. బుచ్చిబాబులాగ మానసిక పొరలు విప్పుతూ హఠాత్తుగా పాఠకుడ్ని చింతనలోకి మళ్ళిస్తాడు. గోపిని కరుణాకర్ లాగ, లెనిన్ ధనిశెట్టి లాగ లోపలి విషయాలు బయటికి తోస్తూ అవతలి విషయాలు బయటికి నెడుతూ పోతుంటాడు. నేరుగా పాత్రలతో పాఠకుడే తన సంభాషణ క్రమాన్ని కొనసాగిస్తుంటాడు. పాత్రలు తమ చుట్టూ ఉన్న పాంచభౌతిక ప్రపంచాన్ని తడుముతూ మన పంచేంద్రియాలను స్పృశిస్తూ వుంటాయి. వొక alertness అలుముకుంటుంది పాఠకుడికి. అది కథకుడు పాఠకుడి చుట్టూ అల్లినటువంటి alertness. Kafka కథలు చదివేటప్పుడు వొక alertness ఏర్పడుతుంది... అలాంటిదన్నమాట.

కథ చదివితే మనలోని వొక అమూర్త ద్రవధార పొంగాలి. హృదయ సంపద పెరుగుతూ పోవాలి. వెలుపలి సౌకర్యాల విషయంలో మనం వినిమయ దుకాణాలమయిపోతున్నాం. అంతరంగ దరిద్రం పెరిగినట్టుగా సంపద పెరగలేదు. అంతరంగమొక pharmaceutical store అయిపోయింది. ఈ స్థితినుంచి మంచి వచన కథా కవిత్వంలాంటి కథలు కావాలి మనల్ని కాపాడటానికి. జ్ఞాపకాలని చరిత్రగా మార్చగలిగే magical గుణం కథల్లో గనక ఉంటే పాఠకుడు ఎంత రసార్ద్రతకు లోనవుతాడో చెప్పనవసరం లేదు.

కథ ఏదయినా అది స్థిరత్వాల గురించి చెప్తే అది కథ కాదనిపిస్తుంది. అస్థిరత్వాల గురించి మాట్లాడితేనే కథలోకి పాఠకుడు ప్రయాణం చేస్తాడు. క్షణక్షణం భయోద్విగ్నాల హఠాత్పరిణామాల గాన లోలత్వమే కథాగానమనిపిస్తుంది. అంతా తెలిసివచ్చినతనమే, అంత సమాచారమయమే అయిపోయిన మసిబారిన అస్తిత్వాలను మంచి కథలతో శుభ్రంగా తుడవాల్సిన అవసరం ఎంతోవుంది ఇప్పుడు. slownessలో వున్న ఆనందాన్ని పాఠకుడికి అందివ్వాల్సిన కాలపుటంచులో వున్నాం. అసలు మందగతి, 'slowness'తో గనక మనం సేద తీరకపోతే అనుభవంలోని వివరాలు, సూక్ష్మాలు ఎట్లా తెలుస్తాయి. కథలు ఇదే పనిచేస్తాయి పాఠకుల మనోప్రపంచమ్మీద. Speed manialో కొట్టుకుపోయే మనల్ని చేతులందించి వొడ్డున పడెయ్యాలి కథలంటే. అట్లా నిలబెట్టిన కథలు 'ముడుపులు', 'జాతక కథ', 'ఆమె నీడ', 'మీమాంస' వంటి కథలు. ఇవన్నీకూడా మన మానసిక స్థలాల పరిధులని పెంచి, మనల్ని విశాలం చేసే కథలు. మనం బిగించుకున్న తాళ్ళను, కట్టేసుకున్న ఉరితాళ్ళను తెంపుతాయి. Cognitive Systemని సడలింపచేస్తాయి. లేదా మన దృష్టిని సడలిస్తాయి. 'జాగరణ' వంటి కథ కూడా చేసేపని అదే. ఇవన్నీ అధోజగత్తులోని వ్యక్తుల, జీవాల, అడవుల, ఇళ్ళ నడుమ కథనాలు. గ్రామీణ దిగువ మధ్యతరగతి జీవితం, అనేక పార్శ్వాల్లో ఎగురుతూ తడుముతూ పట్టుజారిపోతూ సత్యావిష్కరణ చేస్తుంటుంది. చాలా కథలని అస్పష్టంగా తెలిమసురు ఛాయల్లో ముగింపుగా తీర్మానించకుండా ముగిస్తాడు. కథల్లో వొక aesthetic phenomena, కవి అంతరంగ నివేదన ముప్పిరిగొంటుంది. ఏ కథ చదివినా 'యాత్రాస్మృతి'లాగా సజీవానుభవం తెరముందు కదులుతూ వుంటుంది. మనకు తెలిసిన జీవితం, మనం పట్టించుకోని వాతావరణం, మనం ఆలోచించడానికే నిరాకరించిన మనుషుల నిసర్గ మానవీయ గుణాలు కథల్లో చాలా సందర్భాల్లో ఆశ్చర్యానికి గురిచేస్తుంటాయి. కావాలనో, యాదృచ్ఛికంగానో, పూర్వానుభవ భారం వల్లనో చాలా పాత్రలు సంచార జీవితానికి సంబంధించినవి ఎన్నుకున్నాడు అజయ్ కథకుడిగా. అందుకనే వీటిల్లో వొక యాత్రానుభవస్థాయి ఎక్కువగా వుంటుంది. ఎక్కడా మనల్ని నిలబెట్టకుండా నడిపించే కథలన్నమాట. అన్నీ కూడా దేనికదే భిన్నం. అసలు భిన్నతను దృష్టివంతం చేయకుండా రచనలు చేస్తామా? కథల్లో అనేక ప్రశ్నలు, అనేక వ్యక్తిత్వాలు, అనేక దృష్టికోణాలు చూపించడమే లక్షణంగా వుంటుంది. పాత్రలకు లక్షణమే లక్ష్యంగా వుండిపోతుంటుంది. వాటిని చదివిన తరువాత వొక ఏకాంతపు విశ్వాసం పాఠకుడిని కమ్ముకుంటుంది. ప్రతీ విషయమూ అర్థం కావాలనుకునే మధ్యమ పాఠకస్థాయిని వెక్కిరించగల కథలు, రచనలు కావాలిప్పుడు. మనలో వుక్కిరి బిక్కిరి చేసే భ్రమలూ, వాస్తవాలూ, కలలూ, నిజవాస్తవాలు కలగలిపిన వొక అస్పష్ట మానవుడు ఎప్పటికీ వొకడు వుంటాడు. వాడికి బయటి ప్రపంచం అర్థమైనట్టుగా దృక్పథాలు, రాజకీయాలు అర్థమైనట్టుగా తన తత్వం అర్థం కాదు. అటువంటి స్థితిలో అర్థం కావాలనే ఆధిపత్య లక్షణం ఎందుకు? అస్పష్టం, ముఖబింబం అనుకోవాలి గదా సృజనకు. అంతా అర్థమయిపోయింది అనే రచన, వాచకం దగ్గరికి కూడా పోలేం. కేశవరెడ్డి పూర్తిగా అర్థమయిపోయాడా, బండి నారాయణ స్వామి, రెడ్డి శాస్త్రీ చండీదాస్, కాఫ్కా త్రిపురలు పూర్తిగా అర్థమయిపోయారా. అసలు మహా కథకుడు వేముల ఎల్లయ్య రాసిన కక్క, సిద్ధి వాచకాల దరిదాపులకైనా పాఠకుడు వెళ్ళగలిగాడా. అర్థంలోని అసంపూర్ణమేగదా ఆకర్షణ పాఠకులకు.

అజయ్ ప్రసాద్ కథలలో ఆకర్షణ అసంపూర్ణ అర్థమే అని అనుకుంటాను. తన విభిన్నమయిన కథలలో భిన్న పాత్రల ద్వారా, ఆర్థిక, పారమార్థిక, లౌకిక దుఃఖాలను, మానసిక అపభ్రంశాలను వడిశెల పట్టి లోకం మీదికి విసురుతుంటాడు. అట్టడుగువర్గాల అధోజీవచింతనను ఉసిగొల్పుతుంటాడు. పాఠకుడిని ఏకాంత పరుస్తూ వుంటాడు. వుద్రేకాలను పదును చేస్తుంటాడు. కథలు మన అంతరంగిక ప్రపంచాన్ని redesign చేస్తుండాలి; మనల్ని కోల్పోనియ్యని, ఇష్టపడే స్థితులతో అంతర్యాలని అలంకరించాలి. సామాజికమైన, జవాబుతనాన్ని బలవంతంగా ఆపాదించుకోగూడదు. మన ప్రవృత్తే మన జవాబుదారీతనం. మనం వొప్పుకోకపోతే.. మన రచన మనల్ని రంగు తేలుస్తుంది. Fast foods/ junk foods సిద్ధాంతాల, దినుసులతో కథలను వండితే మంచి పాఠకులను అవి కదిలించగలవా? అన్నది ఎప్పటికీ వేధించే ప్రశ్న. అజయ్ ప్రసాద్ కథలన్నీ అచ్చమైన కథలుగా అన్పించాయి. వాటిల్లో అనుభవమూ, మానవ సంకల్పంలోని నిస్సహాయత్వమూ తెలిసి వచ్చాయి కాబట్టేమో? మన చుట్టూతా క్షణక్షణమూ సంభవించే ఘటనలు అనుభవాలుగా మాత్రం మారవు. మన నుంచి, మన స్పృహ తగలకుండా జారిపోయే కాలం మనది కాదు. మన అనుభవంలోకి అడుగుపెడితేనే కాలముద్ర అగుపడుతుంది. అటువంటి కాలాన్ని మనకు మిగిల్చి ఇవ్వడమే రచయిత బాధ్యత అనిపిస్తుంది. Historical Time, Cultural Timeకీ మధ్య రచయిత వొక వంతెనయ్యి పాఠకుడిని రెండు కాల తీరాల నడుమ యాత్ర చేయిస్తూ వుంటాడు. అందుకోసం రచనాకారుడికి గాఢమయిన హృదయ పరిపక్వత, కరుణ, మేధస్సుని కాలదన్నిన మామూలు జ్ఞానం కావాలి. అప్పుడు సాధ్యమవుతుందేమో మంచి కథలు రాయడం. నాకు తెలియదు. పాఠత్వాన్ని మెరుగుపరుచుకుంటున్నాను. మనిషి, పక్షి అవ్వకుండా, కింది ప్రపంచపు, అట్టడుగు అడవుల్లో ఎగరకుండా.. సముద్రపు అఖాతాల్లో గూడు ఎలా కట్టుకోలడూ. అజయ్ ప్రసాద్ కథలన్నీ కూడా అఖాతాల్లో కట్టిన పక్షిగూళ్ళలాంటివే. లోయల్లోకి వినమ్రంగా అడవితీగలా దిగవల్సిందే పాఠకుడు.

At each moment my fear snatches me out of myself and out of my minor worries and leaves me to nothingness. In this nothingness in which I exist, as empty as the "nature" found in crude materialism. - Geroges Bataille on Nietzsche

■ సిద్ధార్థ
73306 21563



బొమ్మల సంతకం

చైనా గోడపై కూర్చుని
మంచుతో మాట్లాడుతూ
త్రిపుర కంట్లో పడ్డాడు కాఫ్కా

శ్రీశ్రీ కవితా పఠనానికి
ఇంద్రుడు కౌగిలించుకుని పొగుడుతూ
తమను పట్టించుకోక పోవడంతో
తిరుపతి వేంకట కవులు
అలకతో సభ నుండి వాకవుటు చేశారు

డార్విన్, డా. సలీమ్ అలీ
ఇసుకలో కూర్చుని పెదాలు కదుపుతోంటే
పక్షులూ, సముద్రమూ
ముంగాళ్ళపై కూర్చుని వింటున్నాయి

ఆకాశంలో మార్నింగ్ వాక్ చేస్తూ
ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లు
రాత్రి చూసిన మహానటి సినిమా
కబుర్లను పంచుకుంటున్నారు

తనను వెక్కిరించినందుకు భగవాన్లు
దొమ్మిలో నలుగురిని చితక బాది
రచయితకు తెలియకుండా
నేను చీకటి తలుపులు వేసుకున్నాడు

ద్వారం చెంత పెద్దిభొట్లను
జయ విజయులు అడిగారు కూతూహలంగా
ఇంగువంటే ఏమిటని

మోనాలిసా పెయింటింగ్‌ను చూస్తూ
ఉబ్బితబ్బిబ్బయిన పెద్దన
తన పోట్రేటు గీయించుకుని
డావిన్సీకి రెండు పద్యాలు కానుకగా ఇచ్చాడు

పారిజాతం చెట్టు కింద
కూర్చుని ఉన్న స్మైల్‌ను
పలకరించాడు మో పుల్లుందాని
'ఖాళీ సీసా' చూపాడు స్మైల్ స్మైల్‌తో...

■ టి. వెంకటేష్
99853 25362

చలి రాత్రి

మోకాళ్ల మధ్యలో సూర్యోదయం
ముడుచుకుంటే వెచ్చదనం
దుప్పటికి ఎప్పుడూ చలే
అందుకే మనుషుల్ని కప్పుకుంటుంది
రెండు మంచు బొట్లు.. రెండు పెగ్గులు...
శరీరం మీద రెండు శరీరాలు తొడుక్కుని..
అజంతా.... అంతా...
కర్ర్... కర్ర్... కర్ర్..
కొరుకుతున్న ఎముకల సుస్వరం
చచ్చేంత చలి గాలి
రవ్వంతే చెలి గాలి
***
కొంకర్లు పోతున్న వేళ్లు
వంకర్లు పోతున్న కళ్లు
సరిగమలకు కవి సమయం
అర్ధరాత్రుళ్ల అర్ధనిమీలితం
రెండు శరీరాలకు ఒకటే ముసుగు
ముసుగు కింద మరుగుతున్న మాంసం
జీవితం...
తెల్లవారిందా... తెల్లబోయిందా

■ ముక్కామల చక్రధర్



కావ్య పరిమళం

తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'కావ్యపరిమళం' పరంపరలో భాగంగా జనవరి 11 సా.6గం.లకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో దాశరథి కృష్ణమాచార్య 'అగ్నిధార' కావ్యంపై దేశపతి శ్రీనివాస్ ప్రసంగం ఉంటుంది.

ఏనుగు నరసింహారెడ్డి

అలిశెట్టి ప్రభాకర్ యాదిలో కవిసమ్మేళనం

అలిశెట్టి ప్రభాకర్ యాదిలో కవి సమ్మేళనం జనవరి 12 సా.5.30గం.లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్‌లో జరుగుతుంది. బి.నర్సన్, తంగిరాల చక్రవర్తి, భూపతి వెంకటేశ్వర్లు, యలవర్తి రాజేంద్ర ప్రసాద్ పాల్గొంటారు.

అనంతోజు మోహన్ కృష్ణ

'సాహితీ మాణిక్యం' అవార్డు

రావులపాటి నారాయణ, మాణిక్యం పేరిట ఇచ్చే 'సాహితీ మాణిక్యం' అవార్డును 2018కిగాను కవులు కోట్ల వెంకటేశ్వర్ రెడ్డికి, ప్రసాదమూర్తికి ఇవ్వనున్నారు. అవార్డు ప్రదానం జనవరి 12న ఖమ్మం చెరువు బజార్‌లో రావులపాటి సీతారాం స్వగృహంలో జరుగుతుంది.

సీతారాం

జాగృతి నవలల పోటీ

జాగృతి వార పత్రిక స్వర్గీయ ఎం.డి.వై. రామ్మూర్తి పేరిట నిర్వహిస్తున్న నవలల పోటీకి- భారతీయ జీవన విధానం విలువలు ఇతివృత్తంగా నవలలను పంపగోరుతున్నాం. ప్రథమ, ద్వితీయ బహుమతులు రూ.25వేలు, రూ.20వేలు. ఒక రచయిత ఒక నవలనే 150 ఎ4 పుటలు మించకుండా డిటిపి చేసి jagriticompetition@gmail.comకు పంపాలి. చివరి తేదీ మార్చి 30, 2019. వివరాలకు: 99599 97204.

గోపరాజు నారాయణరావు

కవిసంధ్య-జైనీ ఫౌండేషన్ కవితల పోటీ-2019

'కవిసంధ్య-జైనీ ఫౌండేషన్' కవితల పోటీకి కవితలను పంపగోరుతున్నాం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000. మరో పది కవితలకు రూ.500 బహుమతులు ఉంటాయి. కవితలు ఫిబ్రవరి 15లోగా చిరునామా: దాట్ల దేవదానం రాజు, 8-1-048, జక్రియ నగర్, యానాం- 533 464, తూగోజీ, ఆం.ప్రకు పంపాలి. వివరాలకు: 94401 05987.

దాట్ల దేవదానం రాజు

ప్రవాస స్వరం

నాకు అక్కిరాజు పరిచయమయ్యే నాటికి అతను రచయిత కాదు. తెలుగు సమాజం పట్ల, సాహిత్యం పట్ల, అభిమానం, ప్రేమ ఉన్న ఒక సిలికాన్ వాలీ సాఫ్ట్‌వేర్ నిపుణుడు. తెలుగు జీవితంలోకి ఇంటర్నెట్ అంతగా చొరబడని రోజుల్లో, soc.culture.indian.telugu (SCIT) అని దాదాపు నలభైవేలమంది సభ్యులున్న పెద్ద యూజ్నెట్ గ్రూపు ఉండేది; ఇంటర్నెట్‌లో మొదటి తెలుగు సమాజం అదే. ఈ గ్రూపు లోని కొందరు సాహిత్య అభిమానులతో తెలుసా (అంటే తెలుగు సాహిత్యమన్నమాట) అని మరొక మెయిల్‌గ్రూప్ ప్రారంభమై, ఇంకొన్నాళ్ళకి రచ్చబండగా మారింది. ప్రపంచం అన్నిమూలల నుంచి తెలుగు సాహిత్య అభిమానులు, తమ ఇష్టాలు, అయిష్టాలు, అభిప్రాయాలూ కలబోసుకుంటూ, కలహించుకుంటూ, కలివిడిగా ఈ రచ్చబండలో హడావుడి పడుతుండేవారు. ఈ గ్రూపులో 1996-97 ప్రాంతాల్లో అక్కిరాజు కనిపించటం మొదలెట్టాడు. మిగతా వారి పట్ల మర్యాదగా ఉంటూనే తన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పేవాడు. ఆ రోజుల్లో ఇంటర్నెట్ మిత్రులకి మనుషుల పేర్లు, ఈమెయిల్ అడ్రెసులూ మాత్రమే తెలిసేవి కాని, ప్రత్యక్షంగా కలుసుకునేదాకా మనుషుల రూపరేఖలు తెలిసేవి కావు. 1999 సిన్సినాటి తానా సభల్లో, సన్నగా, పొడుగ్గా, నవ్వుమొహంతో ఒక యువకుడు మొహమాటంగా నేను అక్కిరాజుని అని పరిచయం చేసుకున్నాడు. ఒక మిని రికార్డరు చేతపట్టుకుని అక్కడి సాహిత్య సమావేశాలన్నిటినీ రికార్డుచేసి, ఆ తర్వాత ముఖ్య ప్రసంగాలని టైపు చేసి, వెంటనే తెలుసా గ్రూపుకి అందించాడు. ఈ కుర్రాడికి ఉత్సాహంతో పాటు ఓపిక కూడా బాగానే ఉంది అని నేను ముచ్చట పడ్డాను.

ఈ విషయాలన్నీ ఇప్పుడెందుకూ అంటే, 1994-2004 దశకం అమెరికా తెలుగు సాహిత్యంలో ఒక కీలకమైన కాలం. 1994కు ముందు అమెరికా తెలుగు రచయితలకు తమ రచనలు ప్రచురించుకోవటానికి అవకాశాలు పరిమితంగా ఉండేవి. 70ల్లో ప్రారంభమైన తెలుగు అమెరికా మాసపత్రిక అప్పటికి దాదాపు మూతపడిపోయింది. రెండు సంవత్సరాలకి ఒకసారి వచ్చే తానా మహాసభల సావనీర్లు, అప్పుడప్పుడూ వస్తుండే స్థానిక తెలుగు సంఘాల లిఖిత పత్రికలు మాత్రమే ఈ రచనలకు వేదికలు. తెలుగుదేశపు పత్రికలలో కొంతమంది రచయితలు ప్రచురించి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటున్నా, ఆ రచనలు అమెరికాలో పాఠకులకు చేరేవి కాదు. 1990లలో మూడు పెనుమార్పులు వచ్చాయి. అమెరికాలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యకు స్టూడెంట్ వీసాలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు తాత్కాలిక వీసాలు తేలికగా దొరకటం మొదలయ్యింది. ఒక్కసారిగా అమెరికాలో తెలుగు యువతరం సంఖ్య పెరిగిపోయింది. అదే సమయంలో ఇంటర్నెట్ అందరికీ అందుబాటులోకి రావటం మొదలయ్యింది. మొదట్లో విద్యార్థులు, కంప్యూటర్లతో పనిచేస్తున్నవారే ఇంటర్నెట్‌ని వాడినా, అమెరికా ఆన్లైన్, నెట్‌స్కేప్ బ్రౌజర్ల ప్రాచుర్యంతో 1997నాటికి ఇతరులు కూడా ఇంటర్నెట్ వాడటం మొదలుపెట్టారు. తానాపత్రిక మాసపత్రికగా, అమెరికా భారతి త్రైమాసిక పత్రికగా రావటంతో రచయితలకు బహుళ ప్రాచుర్యం ఉన్న వేదికలు దొరికాయి. ఇంకొన్నేళ్ళకు తెలుగు దేశపు పత్రికలు కూడా ఇంటర్నెట్‌లో తమ దిన, వారపత్రికలను పంచుకోవటం మొదలుపెట్టటంతో, చదువరులకూ, రచయితలకూ కూడా విస్తృతంగా సమకాలీన తెలుగు సాహిత్య ప్రపంచాన్ని పరిశీలించటానికి అవకాశం కలిగింది. ఇంటర్నెట్ వల్ల వచ్చిన ఒక ముఖ్య సౌలభ్యమేమిటంటే ఒక విషయంపై ఆసక్తి ఉన్న వాళ్ళు ప్రపంచంలో ఏ మూల ఉన్నా తమ అభిప్రాయాలను పంచుకోవచ్చు. అమెరికా తెలుగుసాహితీలోకం ఈ అవకాశాన్ని వెంటనే అందిపుచ్చుకొంది. SCIT, తెలుసా, రచ్చబండలతో పాటు, ఈమాట ఇంటర్నెట్ తెలుగు పత్రిక కూడా అప్పుడే ప్రారంభమయ్యింది. సాహిత్యం పట్ల మంచి చర్చలు జరిగేవి. రచయితలకు వేదిక దొరకటంతో పాటు, తమ రచనలకు పాఠకుల, ఇతర రచయితల స్పందన వెంటనే దొరికే అవకాశం వచ్చింది. ఈ క్రమంలో అమెరికా తెలుగు రచన వికసించింది. ముఖ్యంగా కథకులు ఈ అవకాశాన్ని బాగా అందిపుచ్చుకున్నారు.



ఈ నేపథ్యంలో అక్కిరాజు భట్టిప్రోలు అనే సాఫ్ట్‌వేర్ నిపుణుడు ఉన్నట్లుండి ఒక రోజున నేనో కథ రాశాను అంటూ ప్రకటించాడు. ప్రపంచంలో అందరూ పురుగులే అని అంతరాంతరాల్లో నిర్ధారించుకున్న ఒక సాఫ్ట్‌వేర్ నిపుణుడు ఒకానొక ఆఫీసు పార్టీలో మూడు బీర్లు ముగించి నాలుగో సీసా తెరిచాక అతని బాహ్య ప్రవర్తనకూ, అంతశ్చేతనకూ మధ్య వైరుధ్యాలు కరిగిపోయిన వృత్తాంతం, 'మూడు బీర్ల తరువాత' అనే ఆ కథ. అతని కథానాయకుడి మీద నాకు పెద్ద సానుభూతి లేకపోయినా, అక్కిరాజు మొదటి కథ, మొదటి కథలా అనిపించలేదు. చదివించింది; సంభాషణలు, నిర్మాణం, శైలి బాగున్నాయి. ఆ తరువాత 9/11 సంఘటన ఇతివృత్తంగా అక్కిరాజు రాసిన నాక్కొంచెం 'నమ్మకమివ్వు' కథ ఆ అభిప్రాయాన్ని మరింత బలపరచింది. "ఇంజనీరింగ్ చేసి పెసరట్టుప్మా చేసే ఐశ్వర్యారాయి" వంటి పెళ్ళికూతుళ్ళకోసం చూస్తున్న మగ పిల్లల మధ్య, పెళ్ళి కన్నా తన వ్యక్తిత్వమే ముఖ్యం అనుకున్న ఒక తెలుగు అమ్మాయి కథ, 'నందిని', 2003 తానా కథల పోటీలో మొదటి బహుమతిని పంచుకొని, అక్కిరాజుని అమెరికా బయట పాఠకులకు పరిచయం చేసింది. అక్కిరాజు అమెరికా వదలి హైదరాబాదులో స్థిరపడ్డ కొత్తలో రాసిన 'అంటుకొమ్మ', 'గేటెడ్ కమ్యూనిటీ' కథలు అతనికి కథకుడిగా గుర్తింపు తెచ్చాయి. కథకుడిగా అక్కిరాజు ప్రపంచం ఐటీ ఉద్యోగుల ప్రపంచాన్నిదాటి విస్తరించింది. 'రమాదేవి ఎందుకు రమ్మంది', 'వస్త్రాపహరణం', 'జంధ్యం' కథలు అక్కిరాజులోని ఈ పరిణతికి నిదర్శనాలు.


దాదాపు రెండు దశాబ్దాలుగా కథలు రాస్తున్న అక్కిరాజు రాసింది డజను కథలే. ఇంత తక్కువగా కథలు రాయటానికి మంచి కథలు రాయాలన్న తపన, కథ ఆలోచింపచేయాలన్న విశ్వాసం బహుశా కారణాలు కావచ్చు. అక్కిరాజు కథలు కాలక్షేపానికి మాత్రమే రాయటం లేదని, తనను గాఢంగా ఆలోచింపచేసిన ప్రశ్నలను పాఠకులతో పంచుకోవాలన్న తపన వల్ల రాస్తున్నాడని నాకు అనిపిస్తుంది. ఆ ప్రశ్నల పట్ల అతనికి ఒక అవగాహన వచ్చేవరకు ఆగటం వల్లే అతని కథలు తక్కువగా వస్తున్నాయి. విశాలమైన, క్లిష్టమైన ప్రపంచంలో ఎప్పుడూ సమాధానాలకన్నా ప్రశ్నలే ఎక్కువ. సరైన ప్రశ్నలు లేవదీయటం, ఆ ప్రశ్నలకు సరైన సమాధానాలు వెదకడం మాత్రమే సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది. అతి త్వరగా మారిపోతున్న మన సమాజంలో ఉన్న వైరుధ్యాలను అర్థంచేసుకొని సరైన దారిలో ముందుకు వెళ్ళాలంటే అక్కిరాజులా ప్రశ్నలు లేవనెత్తే రచయితల అవసరం మనకు ఎంతైనా ఉంది.

■ డా. జంపాల చౌదరి

(అక్కిరాజు భట్టిప్రోలు కథాసంపుటి 'మూడు బీర్ల తర్వాత'కు రాసిన ముందుమాట నుంచి కొంత భాగం)

విజేత





రొమాన్స్‌కు వయసుతో పనేంటీ..!

ఒక అమ్మాయితో ప్రేమలో ఉన్న 25 ఏళ్ల కొడుకుతో పాటుగా, హైస్కూలులో చదువుతున్న టీనేజీ కొడుకూ ఉండగా, ఆ తల్లి మరోసారి గర్భం దాల్చితే ఎలా ఉంటుంది? కుటుంబం, సమాజం ఆమెను ఎలా చూస్తుంది? 'బధాయీ హో' సినిమాలో ప్రియంవద (నీనా గుప్తా) పరిస్థితి ఇదే. అయితేనేం... ఆమె ఎట్టకేలకు అందరి మనసులు దోచుకుంది. 2018 అక్టోబర్‌లో విడుదలైన ఈ సినిమా వసూళ్లు అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తాయి. రూ. 29 కోట్లతో తెరకెక్కిన 'బధాయీ హో' రూ. 221 కోట్లు వసూలు చేసింది. అంతేకాదు ఇటీవల జరిగిన 'స్టార్ స్క్రీన్ అవార్డు'ల్లో ఉత్తమ నటిగా 59 ఏళ్ల నీనాగుప్తా ఎంపికయ్యారు. పోటీలో ఆలియా భట్, దీపికా పదుకొనే లాంటి స్టార్లను వెనక్కి నెట్టి ఆమె ఈ అవార్డు గెలుచుకోవడం విశేషం.

నిజానికి 'సెక్స్' అనే పదాన్ని ఉచ్ఛరించడానికి ఎవరూ ఇష్టపడరు. సినిమాల్లో అయితే వికసిస్తున్న పూలు, ఊసులాడుతున్న పక్షులను సజెస్టివ్ షాట్స్‌గా చూపిస్తారు. అయితే ఇటీవల కొన్ని బాలీవుడ్ సినిమాలు సెక్స్ గురించి బోల్డ్‌గా చర్చిస్తున్నాయి. సునిశితమైన హాస్యాన్ని పండిస్తూనే, సీరియస్‌గా ఆలోచింపజేస్తున్నాయి. అందుకే ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు యూత్ కూడా అలాంటి సినిమాలకు బ్రహ్మరథం పడుతున్నారు. 'బధాయీ హో'లో వయసు మీద పడిన జితేందర్ కౌశిక్ (గజ్‌రాజ్ రావు), ప్రియంవద దంపతులను అందరూ అక్కున చేర్చుకున్నారు... వారి రొమాన్స్‌కు మనస్ఫూర్తిగా 'బధాయీ హో' అన్నారు. ముఖ్యంగా మధ్య తరగతికి చెందిన మధ్య వయస్కురాలైన ప్రియంవద పాత్రలో నీనాగుప్తా ఈ తరం మహిళలకు కావాల్సినంత ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మస్థైర్యాన్ని అందించారు. "ఈ సినిమా స్క్రిప్టు వినగానే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, అవకాశాన్ని వెంటనే అందిపుచ్చుకోవాలనుకున్నా. పాత తరంలో తల్లీబిడ్డలు కూడా ఒకేసారి పురుడుపోసుకున్న సందర్భాలు ఉండేవి. ఎందుకంటే అప్పట్లో చాలా చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లి చేసేవారు. గర్భం దాల్చడమనేది ఒక సహజ ప్రక్రియగానే చూసేవారు కానీ దానిని సెక్స్‌తో ముడిపెట్టి చూసేవారు కాదు. నా చిన్నతనంలో మా అమ్మానాన్నలు ఎప్పుడూ వేరే గదిలో పడుకోవడం చూడలేదు. మా సోదరుడు, నేను వాళ్లతోనే పడుకునేవాళ్లం. అప్పట్లో సెక్స్ అనేది ఒక నిషేధిత పదం. 'బధాయీ హో'ను ఈ మధ్య మరోసారి చూశాను. అందులో సెక్స్ అనేది అస్సలు లేదు. వయసు పెరుగుతుంటే సహచర్యం విలువ బాగా తెలుస్తుంది. భార్యాభర్తలు మరింత దగ్గరవుతారు. వయసులో ఉన్నప్పుడు పిల్లల్ని పెంచుతూ, వారి కోసం డబ్బు సంపాదిస్తూ తల్లితండ్రులు బిజీగా ఉంటారు. ఎప్పుడైతే పిల్లలు పెరిగి పెద్దయ్యి వారి దారి వారు చూసుకుంటున్నారో, అప్పుడు భార్యకు భర్త, భర్తకు భార్య కావాలనిపిస్తుంది. అయితే అప్పుడు వారెందుకు రొమాంటిక్‌గా ఉండకూడదు? రొమాన్స్‌కు వయసుతో పనిలేదు... సరిగ్గా ఈ అంశాలనే 'బధాయీ హో' సున్నితంగా చర్చించింది" అన్నారు నీనా గుప్తా.

న్యూఢిల్లీకి చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్ వివేక్ మెహ్రాను పెళ్లి చేసుకుని ముంబయి నుంచి ఢిల్లీకి మకాం మార్చిన నీనాగుప్తా కొన్నాళ్లు నటనకు దూరమయ్యారు. "2008లో నా పెళ్లయ్యింది. అప్పటి నుంచి ఇతర పనుల్లో బిజీగా ఉన్నా. ఏడాదిన్నర క్రితం జోయా అక్తర్ (బాలీవుడ్ దర్శకురాలు) ఇంట్లో ఆమెతో పనిచేసే కొందరు నన్ను 'ఎప్పుడు ముంబయికి తిరిగి వస్తార'ని అడిగారు. వారి మాటలు నన్ను ఆలోచనల్లో పడేశాయి. ఇంటికి రాగానే 'మంచి పాత్రలు వస్తే తప్పకుండా నటిస్తా' అని ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టా. వెంటనే 11 వేల మంది ఫాలోవర్స్ అయ్యారు. 'బధాయీ హో' సినిమా విడుదలైన తర్వాత ఆ సంఖ్య 2 లక్షలకు చేరింది" అన్నారామె.

'బధాయీ హో'లో ప్రియంవద పాత్రకు ఇటీవలే 'స్టార్ స్క్రీన్' బెస్ట్ యాక్టర్ క్రిటిక్స్ అవార్డు గెలుచుకున్నారు నీనా. ఈ అవార్డు చిత్ర పరిశ్రమలో సరికొత్త ఆలోచనలకు బీజం వేసినట్లుగా భావిస్తున్నారామె. "ఈ వయసులో నన్ను ఉత్తమ నటి అవార్డుకు ఎంపిక చేశారంటే జ్యూరీ ఆ పాత్రను అంగీకరించినట్టే కదా. నా వయసులో ఉన్న నటీమణులకు ఇదొక పెద్ద అడుగు. ఉత్తమ నటి అవార్డుకు వయసుతో పనిలేదని ఈ అవార్డు తెలియజేసింది. మధ్య వయస్కులైన హీరోలకు కూడా ఉత్తమ నటుడు అవార్డు ఇస్తారు కానీ హీరోయిన్లకు మాత్రం ఇవ్వరు. అంటే మన ఆలోచనా విధానంలో తేడా ఉందన్నమాట. అలియాభట్, దీపికా పదుకొనేలతో పోటీ పడి నేను... రణ్‌వీర్‌సింగ్, రణ్‌బీర్ కపూర్‌లతో పోటీ పడి గజ్‌రాజ్ రావు ('బదాయీ హో'లో నీనా గుప్తా భర్తగా నటించారు) అవార్డులు సాధించడం విశేషమే కదా. ఒక పెద్ద మార్పునకు ఇదే సంకేతం" అని నీనా సంతోషం వ్యక్తం చేశారు. 'బధాయీ హో'తో వచ్చిన సరికొత్త ఇమేజ్‌ను ఎంజాయ్ చేస్తూనే, ఆమె తదుపరి చిత్రం 'ది లాస్ట్ కలర్' కోసం మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. "జీవితంలో ప్రతీది నాకు ఆలస్యంగానే దొరికింది. అయితే నా అదృష్టానికి నేనెప్పుడూ మురిసిపోతుంటా" అని అంటున్న నీనా పోరాటస్ఫూర్తిని చూసి ఎవరైనా 'బధాయీ హో' అనాల్సిందే!

'ప్యాడ్‌మ్యాన్' నింపిన స్ఫూర్తి

యువ

తెరకెక్కిన నిజ జీవిత విజయగాథలెన్నో. మనం వాటిని ఓ సినిమాలానే చూసి వదిలేస్తాం. కానీ ఈ బాలిక... 'ప్యాడ్‌మ్యాన్' చిత్రం చూసి స్ఫూర్తి పొందింది. మహారాష్ట్రలోని 250 మంది గిరిజన బాలికలకు ఏడాదికి సరిపడా శానిటరీ నేప్కిన్స్ ఉచితంగా అందించింది. చిన్న వయసులోనే సామాజిక చైతన్యం చూపిన ఆ అమ్మాయి పేరు రివా తుల్పులే. వయసు 13 ఏళ్లు. దుబాయ్‌లోని జెమ్స్ మోడర్న్ అకాడమీలో 8వ తరగతి చదువుతున్న రివ జర్నీ ఇది...



రివా తల్లితండ్రులది మహారాష్ట్ర. ఉద్యోగం నిమిత్తం దుబాయ్‌లో స్థిరపడ్డారు. గత ఏడాది బాలీవుడ్ స్టార్ అక్షయ్‌కుమార్ నటించిన 'ప్యాడ్‌మ్యాన్' సినిమా చూసింది రివ. అది తనను ఆలోచనలో పడేసింది. నెలసరి సమయంలో బాలికలు, మహిళలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో తనకు అర్థమైంది. ఆ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత గురించి, శానిటరి ప్యాడ్స్ వినియోగం గురించి తెలుసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, బాలికలు పేదరికం కారణంగా పిరియడ్స్‌లో ఇప్పటికీ పాత వస్త్రాలనే ఉపయోగిస్తున్నారని గమనించింది. వారికి ఉచితంగా శానిటరి ప్యాడ్స్ అందించాలని అప్పుడే నిర్ణయించుకుంది.

'ప్యాడ్‌మ్యాన్ సినిమా చూసిన తర్వాత బాలికలు పీరియడ్ సమయంలో ఎదుర్కొనే ఇబ్బందుల గురించి తెలుసుకున్నాను. భారత్‌లోని ముఖ్యంగా మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బాలికల కోసం ఏదైనా చేయాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నా' అని చెబుతుంది రివ. తన ఆలోచనను తల్లితండ్రులకు చెబితే, వారు సరేనన్నారు. కొంకణ్ ఎంఎల్‌సీ నిరంజన్ దవ్‌ఖరే అధికార పర్యటనలో భాగంగా దుబాయ్ వచ్చినప్పుడు ఆయనను కలిసి ఈ విషయం చెప్పింది బాలిక. ఇంత మంచి ఆలోచన చేసిన రివను అభినందించిన ఆయన... అందుకు తను కూడా సహకారం అందిస్తానంటూ భుజం తట్టారు.

ఇ-వ్యర్థాలపై అవగాహన

రివాకు చిన్నప్పటి నుంచి సామాజిక అంశాలు మీద ఆసక్తి ఎక్కువ. కుప్పలుగా పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాల గురించి సోషల్ మీడియా ద్వారా 2017 జనవరిలో 'వి కేర్' పేరుతో దుబాయ్ వాసుల్లో అవగాహన కల్పించింది. స్కూలు నుంచి ఇంటికి రాగానే అమ్మతో కలిసి ఇంటింటికీ తిరిగి టన్ను ఈ వేస్ట్‌ను సేకరించింది. ఆ వేస్ట్‌ను రీసైక్లింగ్ సెంటర్‌కు చేరవేసింది.



బహుమతులు, టపాసుల డబ్బుతో...

దీపావళి పండుగకు దుబాయ్‌లో నివసించే భారతీయులు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం ఆనవాయితీ. పండుగ రోజున కానుకలు, టపాసుల కోసం ఖర్చు చేసే బదులు ఆ డబ్బుతో పేద బాలికలకు శానిటరి నేప్‌కిన్స్ కొంటే బాగుంటుంది కదా అనుకుంది రివ. కేవలం నేప్కిన్స్ ఇస్తేనే సమస్య పరిష్కారం కాదని, గ్రామ స్థాయిలో అవగాహన కూడా కల్పించాల్సిన అవసరం ఉందని గ్రహించింది. అందులో భాగంగానే తొలుత నెలసరి సమయంలో ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపేలా 'వి కేర్ బై రివా తుల్పులే' పేరుతో గత దీపావళికి ఫేస్‌బుక్‌లో సోషల్ మీడియా క్యాంపెయిన్ ప్రారంభించింది. పండుగ రోజున బంధువులు, స్నేహితుల నుంచి బహుమతులకు బదులు శానిటరి ప్యాడ్స్ కోసం నిధులు సేకరించింది. అలా మూడు వారాల్లోనే 250 మంది బాలికలకు సంవత్సరానికి సరిపడా శానిటరీ న్యాప్‌కిన్స్ కొనేందుకు అవసరమైన డబ్బును సేకరించింది రివ.

స్వరాష్ట్రంలో పంపిణీ...

డబ్బు సమకూరగానే గత ఏడాది నవంబర్ చివరి వారంలో తన సొంత రాష్ట్రం మహారాష్ట్రకు వచ్చింది రివ. థానే జిల్లా శహపూర్ తాలుకాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 250 మంది గిరిజన బాలికలకు శానిటరి ప్యాడ్స్‌ను ఉచితంగా అందించింది. రివ కృషిని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎంతో అభినందించారు.

మేలుకొన్న కొదమ సింహం!

తిరుప్పావై

ఇరవై మూడో పాశురం

మారిమలై ముళఇ్జిల్ మన్నిక్కిడన్దఉఱఙ్గమ్
శీరియ శిఙ్గరివిత్తుత్తీ విళిత్తు
వేరిమయిర్ పొఙ్గ వెప్పాడుమ్ పేర్ న్దుదరి
మూరి నిమిర్ న్దు ముళఙ్గిప్పురప్పట్టు
పోదరుమాపోలే, నీ పూవైప్పూవణ్ణా! ఉన్
కోయిల్ నిన్రిఙ్గనే పోన్దరుళి కోప్పుడైయ
శీరియ శిఙ్గాపనత్తిరున్దు యామ్ వన్ద
కారియమారాయ్ న్దరుళేలో రెమ్బావాయ్!

ఈ పాశురంలో కృష్ణుడి రాజసగంభీరమైన సింహగతిని ఆండాళ్ వర్ణిస్తోంది. ఇంతకు ముందు పాశురంలో గోపికలు కృష్ణుని శయనమందిరంలో ప్రవేశించి ఆయన పాదాల వద్దకు చేరుకోవడం, కన్నులు విప్పి చూడమని అర్థించడం గురించి వివరించింది. ఆయన అంగీకరించాడు. 'యశోద ఒడిలోని కొదమ సింహం' (యశోద ఇళై సింగం) నిదుర మేల్కొన్నాడు. ఆయన మేలుకున్న తీరు వర్ష ఋతువులో మేఘగర్జన విని, నిద్రాభంగమైన సింహం మేల్కొన్నట్టు ఉందిట!

గోపికల మేలుకొలుపు విన్న కృష్ణుడు ఎలా మేల్కొన్నాడంటే...



చిత్రం: కేశవ్ https://www.facebook.com/keshav61/

మృగరాజైన సింహం కొండగుహలో నిద్రిస్తుండగా, వర్షర్తు మేఘం గుహ దద్దరిల్లేటట్లు గర్జిస్తే, ఉలిక్కిపడి కోపంగా లేచి. నిప్పులు కక్కుతున్న ఎర్రని రౌద్రనేత్రాలతో, సింహనాదం చేస్తూ, జూలు విదుల్చుకొని గుహ బయటకు వస్తే ఎలా ఉంటుందో అలా ఉన్నాడట! "నీ దర్శన సౌభాగ్యాన్ని మాకు దయచేస్తూ, సింహగతిలో నీ మందిరం నుంచి బయటకు రావయ్యా నీలమేఘశ్యామా! వచ్చి నీ ఉత్తమ సింహాసనం మీద ఆసీనుడవై మమ్మల్ని అనుగ్రహించు. మా అభీష్టాన్ని తీర్చు!" అని ఆండాళ్ కోరుతోంది.

కృష్ణుడికి కోపం కలిగినట్టుంది! 'సమయాసమయాలు చూడకుండా శయ్యాగృహంలోకి వచ్చెయ్యడమేనా?' అని ఆయన అంటే, "ప్రభూ, బిడ్డలు తల్లిదండ్రుల వద్దకు చేరడానికి సమయాసమయాలేమిటి? నీ దర్శనభాగ్యం ఆశించే ఆశ్రితులను రక్షిస్తానని వాగ్దానం చేసి ఉన్నావు కదా! సర్వసంగ పరిత్యాగులకే నీ వాత్సల్య సౌలభ్యమా? నిన్నే నమ్ముకున్న మా వంటి గొల్లపిల్లలకు అందరాని వాడవా? సంసార విషయ విషాన్ని ఏవగించుకొని, నీ కోసం విరక్తులమై బయలుదేరి, శరణాగతులమై వచ్చాం. పురుష సింహమా! గంభీరంగా నడిచి వచ్చి సుఖాసీనుడవై మా పూజలందుకొని మా మొర ఆలకించు" అని ప్రార్థిస్తున్నారు ఆండాళ్, ఆమె సఖులు.

తండ్రి, కుమార్తెల నృసింహ భక్తి

పెరియాళ్వారు నృసింహ భక్తుడు. సహజంగానే, ఆయన ముద్దుల పట్టి ఆండాళ్ కూడా నృసింహోపాసకురాలే! తాము ఏడు తరాలుగా 'నృసింహోపాసకులం' అని తన పాశురాలలో పెరియాళ్వారు చెప్పుకొన్నారు (ఏళ్పడిక్కల్). 'నృసింహుడే అచ్యుతుడ'ని తన 'వారణం ఆయిరమ్' ప్రబంధంలో, లాజహోమం గురించిన పాశురంలో ఆండాళ్ ప్రతిపాదించింది. అంటే 'భక్తుల రక్షణకు కట్టుబడినవాడ'ని అర్థం. ఆమె నృసింహుని అచ్యుత తత్త్వం, ఆశ్రిత పక్షపాతాన్ని ఇక్కడ స్తుతిస్తోంది. నృసింహావతార వైభవాన్ని గానం చేస్తోంది.

ఇరవై మూడు ప్రాధాన్యం

ఇది ఇరవై మూడో పాశురం. 2+3గా భావిస్తే, సమాధానం అయిదు. నక్షత్రాలలో అయిదవది మృగ శీర్షం (మృగశిర). అంటే మృగ శిరస్సు, మృగాన్ని శీర్షంగా కలిగినవాడు నృసింహుడు. హయగ్రీవస్వామి, వరాహమూర్తి కూడా మృగ శీర్షాలు కలిగినవారే అయినా, 'మృగోరణ భీమః కుచరః గిరిష్ఠః' అనే వేదోక్తిని అనుసరించి - ఇక్కడ ప్రస్తావించిన మృగశీర్షం నృసింహునిదే! మృగశీర్షం కలిగిన నృసింహుడు ప్రపన్నులకు మార్గశీర్షాన్ని (మార్గశిర మాసాన్ని) అంటే ప్రపత్తిమార్గాన్ని దర్శింపజేస్తున్నాడు.

ఆండాళ్ తిరువడిగళే శరణం!


● శ్రీదేవీ మురళీధర్



రామ్‌బో... హో!

సెలబ్ షెఫ్

హీరో రామ్‌చరణ్ 'వినయ విధేయ రామ' స్టిల్స్ చూశారుగా... సిక్స్ ప్యాక్ స్టమక్... కండలు తిరిగిన కటౌట్... 'రాంబో' లుక్‌తో అదరగొడుతున్నాడు. ఇప్పుడిది కుర్రకారును ఊపేస్తోంది. నయా ట్రెండ్ సెట్టర్‌గా మారిన ఈ బాడీ బిల్డింగ్ కోసం రామ్ ఏంచేశాడనేగా! దానికి కారణం 'వీవీఆర్' డైట్ అంటూ ఉపాసన చేసిన ట్వీట్ వైరల్ అయింది. ఆ డైట్ ఏంటో మనమూ ఓ లుక్కేద్దాం రండి...



ఇదీ చెర్రీ తిండి లెక్క...

- **ఉదయం**

  8 గంటలకు: 3 గుడ్లు (తెల్ల సొన), పచ్చ సొనతో కలిపి 2 గుడ్లు, బాదం పాలతో 3/4 కప్పు ఓట్స్

  11.30కి: పెద్ద కప్పు వెజిటబుల్ సూప్

- **మధ్యాహ్నం**

  1.30 గంటలకు: 200 గ్రాముల చికెన్ బ్రెస్ట్, 3/4 కప్ బ్రౌన్ రైస్, 1/2 కప్ గ్రీన్ వెజిటబుల్ కర్రీ

- **సాయంత్రం**

  4 గంటలకు: 250 గ్రాముల గ్రిల్డ్ ఫిష్, 200 గ్రాముల స్వీట్ పొటాటో, 1/2 కప్పు పచ్చని కూరగాయలు

  6 గంటలకు: పెద్ద మొత్తంలో మిక్స్‌డ్ గ్రీన్ సలాడ్, 1/4 వంతు అవకాడో పండు, బౌల్ డ్రైఫ్రూట్స్ (నట్స్)

➡ ఈ మధ్యలో ఆకలి వేస్తే నట్స్, పచ్చి కూరగాయలు తినవచ్చు.

'కఠోర పరిశ్రమ, అంకితభావం, క్రమశిక్షణ... ఇవే రామ్‌చరణ్‌ను కండల వీరుడిగా తీర్చిదిద్దాయి' అంటూ ఇటీవల ట్వీట్ చేశారు ఆయన సతీమణి ఉపాసన కొణిదెల! తన భర్త 'వీవీఆర్' (వినయ విధేయ రామ) డైట్ పాటిస్తున్నారని, మీరూ దాన్ని ఫాలో అయ్యి ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండమని కూడా సూచించారు ఆమె. 'రంగస్థలం' కోసం బరువు పెరిగిన చెర్రీ... ఇప్పుడు బరువు తగ్గించి, బాడీని మంచి షేప్‌లోకి తీసుకువచ్చాడు. కొత్త సినిమా పోస్టర్లు చూస్తే 'రాంబో'ను తలపించేలా కండలు తిరిగిన శరీరంతో దుమ్ము రేపుతున్నాడు. అయితే దీని కోసం చరణ్ చాలానే కష్టపడ్డాడు. ప్రముఖ బాలీవుడ్ ట్రైనర్ రాకేష్ ఉదియార్‌ను ఎంగేజ్ చేసుకున్నాడు. రామ్‌తో రాకేష్‌కు ఇది రెండో ప్రాజెక్ట్. గతంలో 'ధృవ' చిత్రం కోసం చెర్రీకి ట్రైనింగ్ ఇచ్చాడు అతడు. 'సుల్తాన్' చిత్రం కోసం కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌కూ, 'దంగల్' కోసం ఆమిర్‌ఖాన్‌కూ ఫిట్‌నెస్ పాఠాలు చెప్పింది రాకేషే! ఇంకో విశేషమేమంటే రామ్‌చరణ్‌కు రాకేష్‌ను రికమండ్ చేసింది సల్మాన్‌ఖానే!

'దేహమే దేవాలయం' అని నమ్మే రామ్‌చరణ్ ఫిట్‌నెస్, ఆహారం విషయంలో పక్కాగా ఉంటాడు. అతడిలో ప్రత్యేకమైనది క్రమశిక్షణ. ఇండస్ట్రీలోకి అడుగు పెట్టినప్పటి నుంచీ శరీరాన్ని షేప్‌అవుట్ కాకుండా చూసుకుంటున్నాడు. ఎక్కడ షూటింగ్‌లకు వెళ్లినా ఇంటి వంటలే తింటాడు తప్ప బయట ఆహారం అస్సలు ముట్టుకోడు. షూటింగ్ స్పాట్‌లో రామ్ కోసం తనే స్వయంగా చేపలు వండి పెడుతున్న ఒక వీడియోను ఉపాసన ఈ మధ్య ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. నెట్టింట ఆ వీడియో వైరల్‌గా మారింది. ఇంతకీ చెప్పొచ్చేదేమంటే రామ్‌చరణ్ సినిమాలను అభిమానించడమే కాదు... అతడిలోని అంకితభావం, క్రమశిక్షణ చూసి స్ఫూర్తి పొందితే అంతకు మించిన ఆనందం మరొకటి ఉండదు.

వీటికి దూరంగా ఉండాలి...

- కాఫీ, పాల ఉత్పత్తులు, రెడ్ మీట్, గోధుమ, షుగర్ ఫ్రూట్స్, ఆల్కహాల్.
- **ఈ పోషక ఆహారం తీసుకోవచ్చు:** కాల్చిన, ఉడకబెట్టిన చికెన్/ కాయధాన్యాలు / సోయా పనీర్ / చేప.
- **పిండి పదార్థాల్లో ఇవి తినవచ్చు:** కినోవా, బ్రౌన్ రైస్, ఓట్ మీల్, స్వీట్ పొటాటో.
- **కాయగూరలు:** ఆవిరికి ఉడికించిన లేదా దోరగా వేగించిన బీన్స్, ఆవిరికి ఉడికించి, వేగించిన ఆస్పరాగస్, ఉడికించిన లేదా వేగించిన బ్రకోలి.
- అన్ని ఆహార పదార్థాల్లో వెల్లుల్లి కలపడం తప్పనిసరి. కాలే (ఒక విధమైన క్యాబేజీ)/ పాలకూర సలాడ్ (స్పూను ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్, స్పూను యాపిల్ సిడార్ వెనిగర్‌తో కాలే, కీర, ఆకుకూర).



- ఈ డైట్ ప్లాన్ మూడు వారాల(21 రోజులు)కు తయారు చేసింది. అయితే దీన్ని కనీసం 45 రోజులు ఫాలో అయితే మంచి ఫలితాలు ఉంటాయి.
- రోజులో 12 గంటలు మంచి నీళ్లు తప్ప మరేదీ తినడం కానీ, తాగడం కానీ చేయకూడదు.
- ఈ సమయంలో శరీరం నుంచి అనేక విష పదార్థాలు విడుదలవుతాయి. కాబట్టి మంచినీళ్లు ఎక్కువగా తాగాలి. అందుబాటులో ఉంటే ఆల్కనైజ్‌డ్ వాటర్ ఇంకా మంచిది.
- తరచూ బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి రావచ్చు. అంటే మీ శరీరంలోని విష పదార్థాలన్నీ బయటకు పోతున్నాయని (డీటాక్సింగ్) అర్థం. కంగారు పడాల్సిందేమీ లేదు.
- రామ్‌చరణ్ సినిమాలో సరికొత్త లుక్ కోసం వర్కవుట్స్ చేస్తూ, దానికి తగినట్టుగా ట్రైనర్ ఆధ్వర్యంలో ఈ డైట్ ఫాలో అవుతున్నాడు. కనుక శరీర తత్వాన్ని బట్టి డైట్ సరిపోతుందో లేదో చూసుకుని పాటించడం ఉత్తమం.

టెక్ సందేహాలు

ఓటిపి మెసేజ్‌లు ఎందుకొస్తున్నాయి?

నా మొబైల్‌లో ప్రతిసారి పేటియం, గూగుల్ గేమ్స్, ఇంకా రకరకాల ఓటిపి మెసేజ్‌లు వస్తూనే ఉన్నాయి. ఎన్నిసార్లు డిలీట్ చేసినా మళ్లీ వస్తున్నాయి. రోజుకి 20 సార్లకు పైగా డిలీట్ చేస్తున్నాను. దీనికి పరిష్కారం తెలుపగలరు?

- జగదీల్ రాయుడు, హైదరాబాద్



వాస్తవానికి ఆయా మెసేజ్‌లను ఆయా సంస్థలు పంపించడం లేదు. అవి ఫేక్ మెసేజ్‌లు. భయపడాల్సిన పనిలేదు. మీ మొబైల్ నెంబర్ మీ స్నేహితుల దగ్గర ఎవరి దగ్గరైనా ఉన్నట్లయితే, వారు కొన్ని ఎస్ఎంఎస్ బాంబర్ లాంటి యాప్స్ సాయంతో మిమ్మల్ని భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఆటోమేటిక్‌గా మెసేజ్‌లు పంపిస్తుంటారు. వీటి వల్ల ఎలాంటి హానీ ఉండదు కాబట్టి పట్టించుకోకండి. మీకు ఇలాంటి స్పామ్ మీ ఫ్రెండ్ లిస్టులో ఎవరు పంపించే అవకాశం ఉందో గుర్తించి వారికి గట్టిగా చెబితే సరిపోతుంది.

బ్లూటూత్ ఆప్షన్ ఏమైంది?

నా డెల్ ల్యాప్‌టాప్‌లో విండోస్ 10 ఉంది. కొత్తగా అప్‌డేట్ వచ్చిన తర్వాత కంప్యూటర్ రీస్టార్ట్ అవుతూ ఉంటుంది. అలా ఒకసారి అప్‌డేట్ వచ్చిన తర్వాత ఇప్పుడు నా ల్యాప్‌టాప్‌లో బ్లూటూత్ ఆప్షన్ కనిపించడం లేదు. మైక్రోసాఫ్ట్ వాళ్లు దీన్ని తీసేయడానికి అవకాశం ఉందా? తిరిగి బ్లూటూత్ పొందడం ఎలా?

- కె.ఎస్. నాయుడు, ఖమ్మం



మీ ల్యాప్‌టాప్‌లో బ్లూటూత్ చిప్‌ని డెల్ సంస్థ ఇతర కంపెనీల నుండి కొనుగోలు చేసి అమర్చుతూ ఉంటుంది. బ్లూటూత్ లాంటి హార్డ్‌వేర్ ఫీచర్లు పని చేయాలంటే వాటికి సంబంధించిన డివైస్ డ్రైవర్లు సక్రమంగా మీ కంప్యూటర్లో ఇన్‌స్టాల్ అయి ఉండాలి. గత కొద్ది సంవత్సరాలుగా మైక్రోసాఫ్ట్ వివిధ హార్డ్‌వేర్ తయారీ సంస్థలతో కలిసి పనిచేస్తూ, వివిధ హార్డ్‌వేర్ డ్రైవర్లని కూడా విండోస్ అప్‌డేట్‌లో భాగంగా లేటెస్ట్ వెర్షన్లని అందిస్తోంది. అయితే, ఏ కారణం చేతైనా మైక్రోసాఫ్ట్ విడుదల చేసిన కొత్త అప్‌డేట్ వల్ల ఇలా డివైజ్ డ్రైవర్లు కరప్ట్ అయినప్పుడు ఆ డివైజ్ పనిచేయదు. అలాంటప్పుడు, మీ ల్యాప్‌టాప్ తయారుచేసిన డెల్ సంస్థ వెబ్‌సైట్‌కి వెళ్లి మీ ల్యాప్‌టాప్ మోడల్‌కి సంబంధించిన లేటెస్ట్ బ్లూటూత్ డ్రైవర్లని విండోస్ 10 కోసం డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకుంటే సమస్య తొలగిపోతుంది.

యాంటీ వైరస్.. ఏది బెటర్?

ఇటీవల నేను హెచ్‌పి ఇంటెల్ ఐ5 8 జనరేషన్ లాప్టాప్ కొన్నాను. దానికోసం మంచిగా యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్ సూచించగలరు. పెయిడ్ మంచిదా, ఫ్రీ దాంతో సరిపెట్టుకోవచ్చా?

- వెంకట్ చంద్ర, కనిగిరి



ప్రస్తుతం రాన్‌సంవేర్లు, రూట్‌కిట్లు, వెబ్ అటాక్‌లు, బ్యాంకింగ్ ట్రోజాన్లు పెరుగుతున్న నేపథ్యంలో ఉచిత యాంటీవైరస్ ప్రోగ్రాములు ఏమాత్రం మీ అవసరాలను తీర్చలేవు. ఎన్నో ప్రముఖ సెక్యూరిటీ సంస్థలకు చెందిన యాంటీవైరస్ ప్రోగ్రాములు మార్కెట్లో ఉన్నప్పటికీ ప్రస్తుతం బిట్ డిఫెండర్ టోటల్ సెక్యూరిటీ 2019 మీ ల్యాప్‌టాప్ కోసం మెరుగైన రక్షణ ఇవ్వగలుగుతుంది. ఒకేసారి మూడు సంవత్సరాలకు వర్తించే లైసెన్స్‌ని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి వెబ్‌సైట్లలో పొందవచ్చు.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం
navya@andhrajyothy.com

డైలీ సుడోకు - 418

	1				8			
3					2	1		7
7	2			9				
		1					2	
8	9						1	5
	3					4		
				4			8	9
4		5	3					1
			2				3	

ఎలా పూరించాలి?
ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు - 417 సమాధానం

6	9	5	2	3	1	8	4	7
8	7	3	6	9	4	2	5	1
2	4	1	8	7	5	9	3	6
1	8	7	9	2	3	5	6	4
9	2	4	5	6	7	1	8	3
5	3	6	1	4	8	7	2	9
3	1	2	4	5	9	6	7	8
4	5	9	7	8	6	3	1	2
7	6	8	3	1	2	4	9	5

టెక్ గురు



ఎమోజీ... ఇదో కొత్త భాష!

వాట్సప్, ఫేస్‌బుక్ వంటి యాప్స్‌లో ఈ మధ్య ఎక్కడ చూసినా ఎమోజీలతోనే మాట్లాడేసుకుంటున్నారు. రెండు లైన్లు టైప్ చేసే కన్నా సందర్భానికి తగ్గట్లు ఓ ఎమోజీ ఎంపిక చేసుకొని పంపిస్తే.. చెప్పదలుచుకుంది సులభంగా చెప్పేయొచ్చు అన్న భావన చాలా మందిలో ఉంది. టెక్స్ట్‌తో పనిలేకుండా గంటల తరబడి ఎమోజీలూ, స్టిక్కర్లతోనే ఛాటింగ్ చేసుకునే యువతరం కూడా లేకపోలేదు.

ప్రపంచంలో కమ్యూనికేషన్‌కి అతిపెద్ద సవాల్‌గా నిలుస్తోంది.. భాషలు! ఈమధ్య కాలంలో టెక్నాలజీ పుణ్యమా ఒక భాషలో మాట్లాడితే మరో భాషలో అర్థం చేసుకోవడం సులభతరమైనప్పటికీ, ప్రపంచంలో ఉన్న వ్యక్తులందరూ తమ సొంత భాషలో మాట్లాడుకోవడం మొదలు పెడితే మిగతావాళ్ల అర్థం చేసుకోవడం కష్టమవుతోంది. మొట్టమొదటిసారిగా ఇలాంటి భాషా అవాంతరాలను అధిగమించిన భాషగా 'ఎమోజీ'లను పేర్కొనవచ్చు. 1982 సంవత్సరంలో కీబోర్డ్ మీద ఉండే ప్రత్యేకమైన చిహ్నాలను ఆధారంగా చేసుకొని 'ఎమోట్ఐకాన్'లు అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు :) అనే చిహ్నాలను టైప్ చేస్తే, అది సంతోషానికి సంకేతంగా, :(అని వ్యతిరేకంగా టైప్ చేస్తే అది విచారానికి గుర్తుగానూ పేర్కొనబడ్డాయి. 1999లో మొట్టమొదటి ఎమోజీ సెట్‌ని జపాన్‌కి చెందిన టెలికాం నెట్‌వర్క్ డొకొమో కోసం అభివృద్ధి చేయడం జరిగింది. ఆ తర్వాత మెల్లగా పలురకాల డెస్క్‌టాప్, మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్‌లలో యూనికోడ్ వాడకం మొదలైన తర్వాత, యూనికోడ్‌లో కొన్ని అక్షరాల సముదాయం ఒక్కో ఎమోజీగా రూపాంతరం చెందింది. ఎవరైనా యూజర్, ఆయా అక్షరాల కాంబినేషన్ టైప్ చేసిన వెంటనే అది ముందే పేర్కొనబడిన స్మైలీగా మారిపోతుంది. నిన్న మొన్నటి వరకు దాదాపు అందరు ఎస్ఎంఎస్ ద్వారానే కమ్యూనికేట్ చేసుకుంటూ ఉండేవారు. అందులో గరిష్టంగా



కేవలం 160 క్యారెక్టర్లు మాత్రమే టైప్ చేయడానికి సాధ్యపడేది. ఆ తక్కువ పరిమాణంలో తాము చెప్పదలుచుకున్నది వ్యక్తీకరించడానికి చాలామంది ఎమోజీలను వాడేవారు. చరిత్రలో ఇంకా కాస్త వెనక్కి వెళితే, ఎమోజీలను వాడడం మనకు కొత్తేమీ కాదు, రాతి యుగంలో తోటి వ్యక్తులకు తాము చెప్పదలుచుకున్నది అర్థం కావడం కోసం మనుషులు రాళ్లపై గుర్తులు గీసేవారు. అటు వైపు వచ్చిన ఇతరులు ఆ ఆనవాళ్లని ఆసరాగా చేసుకుని వాళ్లేం చెప్పదలు చుకున్నదీ అర్థం చేసుకునే వారు.

అపార్థాలు తొలగిస్తూ...

సహజంగా ఇద్దరు వ్యక్తులు టెక్స్ట్ రూపంలో మాట్లాడు కునేటప్పుడు, మనసులో ఉన్న భావం చాలా సందర్భాల్లో సమర్థవంతంగా అవతలివారికి అర్థం కాకపోవచ్చు. దాంతో అపార్థాలు ఏర్పడుతుంటాయి. సరిగ్గా ఈ సమస్యను అధిగమించడానికి ఎమోజీలు ఉపయోగపడతాయి. తాము టైప్ చేసిన విషయానికి చివర్లో, దాన్ని ఏ అర్థంతో మాట్లాడామో తెలియజేస్తూ స్మైలీలు చేర్చేవారు కూడా లేకపోలేదు. ఎలాంటి భావాన్నయినా, సులభంగా వ్యక్తపరచడానికి తగ్గట్లు పెద్ద మొత్తంలో ఎమోజీలు ఇప్పుడు లభించటంతో వీటి వాడకం బాగా పెరిగింది. 2014లో ప్రపంచవ్యాప్తంగా బాగా వాడబడిన పాపులర్ పదంగా హార్ట్ ఎమోజీ నిలిచిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీ ' 2015 వర్డ్ ఆఫ్ ఇయర్'గా సంతోషంలో కళ్ల వెంట నీళ్ళు వచ్చే ఎమోజీని ఎంపిక చేసింది.

సెన్సారింగ్

సహజంగా అన్ని భాషల్లో కొన్ని నిషిద్ధ పదాలు ఉంటాయి. ఆయా దేశాల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఇవి మారుతూ ఉంటాయి. అలాంటి పదాలను మొబైల్ అప్లికేషన్లు, సోషల్ మీడియా సర్వీసులు కూడా కొంతవరకూ నిషేధిస్తూ ఉంటాయి. ఎమోజీలు కూడా దీనికి మినహాయింపు కాదు. వాస్తవానికి 2015లో ఇన్‌స్టాగ్రామ్ ఎమోజీల ఆధారంగా మనకు కావలసిన కంటెంట్ వెతికి పట్టుకునే విధంగా ఏర్పాటు చేసినప్పటికీ, ఆ తర్వాత కొద్ది రోజులకే అదే సంస్థ 'వంకాయ' ఆకారంలో ఉన్న ఎమోజీని వినియోగదారులు వాడకుండా నిషేధించింది. దానికి అభ్యంతరకరమైన అర్థం ఉండటమే కారణం. అలాగే మిడిల్ ఫింగర్ పైకి చూపించే ఎమోజీ కూడా నిషేధించబడింది. ముందు ముందు అనేక అభ్యంతరకరమైన అంశాలకు సంబంధించి కొత్త ఎమోజీలు పుట్టుకు వచ్చే అవకాశాలు లేకపోలేదు, వాటిలో కొన్ని నిషేధించబడే అవకాశాలు కూడా లేకపోలేదు.

2011లో ఐఫోన్‌లో

అంతకుముందు వరకు కేవలం ఎమోటికాన్‌లను మాత్రమే వినియోగించేవారు వారు కాస్తా, 2011లో ఆపిల్ సంస్థ ఐఓయస్ 5 ఆపరేటింగ్ సిస్టంలో భాగంగా ఎమోజీ కీబోర్డ్‌ని పొందుపరచటం జరిగింది. అయితే మొదట్లో ఇది కేవలం జపాన్ మార్కెట్ కోసమే ఉద్దేశించబడింది. అయితే ఆపరేటింగ్ సిస్టంలో ఉండే ఒక చిన్న టెక్నిక్ ఆధారంగా మిగతా దేశాల్లో ఉన్న వినియోగదారులు కూడా దాన్ని వాడటం మొదలు పెట్టారు. ఆ తర్వాత కాలంలో మెల్లగా ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టంలో కూడా యూనికోడ్ ఎమోజీలను వినియోగించటం మొదలైంది. అయితే ఇటీవలి కాలంలో ఎమోజీలతో పాటు అధిక శాతం మంది యానిమేటెడ్ స్టిక్కర్లు కూడా ఎక్కువగా వినియోగిస్తున్నారు.

కొందరికి కష్టం

యువతరం ఎమోజీలను వినియోగించటంలో ముందజలో ఉంది. అయితే పాతతరం మాత్రం ఎమోజీల కన్నా టెక్స్ట్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం స్పష్టంగా గమనించవచ్చు. ఏ అనుభూతులకు ఎలాంటి ఎమోజీ వాడాలో తెలియకపోవడం, ఎమోజీల ద్వారా మనస్సులో ఉన్న అనుభూతి మొత్తం వ్యక్తం చెయ్యలేమన్న భావన కొద్దీ చాలామంది పాతతరం ఎమోజీలను వాడడానికి విముఖత చూపిస్తున్నారు. ఎమోజీలకు అర్థాలు తెలుసుకోవడం కోసం ప్రత్యేకంగా



ఎమోజీపీడియా అనే వెబ్‌సైట్ కూడా అందుబాటులో ఉంది. అంతేకాదు, ట్విట్టర్‌లో ఇప్పటికి ఇప్పుడు రియల్ టైంలో ఎంతమంది ఏ ఎమోజీలను ఎన్నిసార్లు తమ ట్వీట్లలో వాడారన్నది గణాంకాలు చూపించడం కోసం ఎమోజీట్రాకర్ అనే సైట్ కూడా లభిస్తోంది. యూనికోడ్‌లో ఎప్పటికప్పుడు కొత్త వెర్షన్లలో సరికొత్త ఎమోజీలు ప్రవేశపెట్టబడుతూ ఉంటాయి. జూన్2018 వరకు మొత్తం 2823 విభిన్న రకాల ఎమోజీలు యూనీకోడ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు జూన్ 2018 విడుదల చేయబడిన యూనీకోడ్ 11..0 ద్వారా కొత్తగా 157 ఎమోజీలు వాడకంలోకి వచ్చాయి. దాదాపు వివిధ సందర్భాలకు తగ్గట్లు మన భావాలను సులభంగా వ్యక్తపరచడం కోసం ఇవి ఉపయుక్తంగా ఉంటాయి.

భాషని మింగేస్తున్నాయా?

ఎమోజీల వాడకం ఐతే పెరిగింది గానీ అది పరోక్షంగా భాషని చంపేస్తోందా అనే భయాలు ఈ మధ్య ఎక్కువవుతున్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అనేక భాషలు అంతరించిపోయే పరిస్థితిలో ఉన్నాయి. ఇప్పుడు కష్టపడి టైప్ చేయడం ఇబ్బందిగా భావించి చాలామంది ఎమోజీలను వాడడం మొదలుపెట్టగానే, ఆయా భాషలకు గడ్డు పరిస్థితి వస్తున్నట్లుగా తెలుస్తోంది. అందరూ అనుకుంటున్నట్లు ఎమోజీలు పూర్తి స్థాయిలో ఒక వ్యక్తి యొక్క భావాన్ని అన్ని సందర్భాల్లో వ్యక్తపరచలేవు. అవసరానికి మించి అతిగా ఎమోజీలను వాడడం వల్ల వ్యక్తుల మధ్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం కూడా లేకపోలేదు. దీనికి ప్రధాన కారణం, కేవలం అక్షరాలు మాత్రమే మనసులో ఉన్న ఆలోచనలను హృదయానికి హత్తుకునే విధంగా అవతలి వారికి తెలియ చెప్పగలవు. వివరంగా టైప్ చెయ్యడానికి పరిస్థితులు అనుకూలించని సందర్భాల్లోనూ, వేగంగా రిప్లై ఇవ్వాల్సిన ప్రత్యేక పరిస్థితుల్లోనూ ఎమోజీలు చాలా అనువుగా ఉంటాయి. అయితే అవతలి వారు వివరంగా లైన్లకి లైన్లు టైప్ చేసి పంపిస్తుంటే మీరు ఒక ఎమోజీ పంపేసి చేతులు దులుపుకుంటే మాత్రం అవతలి వారిని మీరు నిర్లక్ష్యం చేసినట్లే అవుతుంది.





నల్లమోతు శ్రీధర్
fb.com/
nallamothusridhar

అప్‌డేట్

డ్యుయో... సరికొత్తగా!


గ్రూప్ కాలింగ్‌పై వీడియో కాలింగ్ యాప్‌లు ప్రత్యేక దృష్టిని సారించాయి. వినియోగదారుల దృష్టిని ఆకర్షించడానికి రకరకాల ఫీచర్లతో సిద్ధమవుతున్నాయి. ఈ మధ్యకాలంలోనే వాట్సాప్, యాపిల్ కంపెనీకి చెందిన 'ఫేస్‌టైమ్' గ్రూప్ కాలింగ్ ఫీచర్‌లో సమూలమైన మార్పులు తీసుకొచ్చాయి. వాట్సాప్‌లో ఒకేసారి నలుగురితో వీడియో కాల్ చేసుకునే అవకాశం కల్పిస్తే, ఫేస్‌టైమ్‌లో 32 మందితో మాట్లాడుకోవచ్చు. తాజాగా గూగుల్ డ్యుయో కూడా ఇలాంటి అప్‌డేట్‌తో ముందుకు వస్తోంది. ఇందులో ఒకేసారి 8 మందితో వీడియో కాల్ మాట్లాడుకోవచ్చు. మీరు ఎవరితో గ్రూప్ కాల్ మాట్లాడుకోవాలనుకుంటున్నారో వారి మీ గ్రూప్‌లో సభ్యులుగా చేర్చండి. ఆ తర్వాత గ్రూప్ ఐకాన్ మీద టచ్ చేసి కాల్ చేయండి. అంతేకాదు 'లో లైట్ మోడ్' అనే ఫీచర్‌ను కూడా జతచేయనుంది గూగుల్. ఒకవేళ మీరు ఎవరితోనైనా గ్రూప్ కాల్ మాట్లాడుతున్న సమయంలో ఒక్కోసారి బ్యాక్‌గ్రౌండ్‌లో సరిపడే వెలుగు లేకపోతే వారి ముఖాలు సరిగ్గా కనబడవు. ఆ సమయంలోనే 'లో లైట్ మోడ్' అనే ఆప్షన్ ఆన్ చేసుకోమనే అలర్ట్ ఇస్తుందీ యాప్. ఈ మోడ్‌ను ఆన్ చేసుకుంటే వీడియో కాల్‌లో క్లారిటీ ఇంకా మెరుగవుతుంది. ప్రస్తుతం ఈ అప్‌డేట్లు టెస్టింగ్ దశలో ఉన్నాయి.



అధ్యయనం

పర్మిషన్లు అడుగుతున్నాయా?

ఫోన్‌లో కొత్త యాప్ ఇన్‌స్టాల్ చేస్తే చాలు. ముందుగా కెమెరా, కాంటాక్ట్స్.... ఇలా అన్ని పర్మిషన్లు అడుగుతూంటాయి యాప్స్. వాటికి పర్మిషన్ ఇవ్వాలా? వద్దా? అనే సందేహం తలెత్తుతుంది. ఒకవేళ ఇవ్వకపోతే, యాప్స్ సరిగ్గా ఇన్‌స్టాల్ కావు. ఇక తప్పనిసరిగా పర్మిషన్స్ ఇచ్చుకుంటూ పోవాలి. దీని మీదే 'అర్కా కన్సెల్టింగ్' అనే సైబర్ సెక్యూరిటీ సంస్థ 'స్టేట్ ఆఫ్ ప్రైవసీ ఆఫ్ ఇండియన్ మొబైల్ యాప్స్ అండ్ వెబ్‌సైట్-2018' అనే అధ్యయనాన్ని



నిర్వహించింది. ఇంటర్నేషనల్ యాప్స్ కన్నా మన భారతీయులు తయారు చేసే యాప్‌లే 45 శాతం ఎక్కువగా పర్మిషన్లు అడుగుతున్నాయట. ఇలా ఫోన్ డేటాను అధికంగా అడుగుతున్న యాప్‌లలో చాలా మటుకు పిల్లలకు సంబంధినవేనని తేలింది. ఇలా పర్మిషన్లు ఇచ్చిన కారణంగా ఫోన్ మెమొరీకార్డులోని డేటాతో పాటు మీ కాల్స్, కాంటాక్ట్ వివరాలను తస్కరించే ప్రమాదం ఉంది. 99 శాతం ఆండ్రాయిడ్ యాప్‌లు ఫోన్ డేటాను థర్డ్ పార్టీ కంపెనీలకు అందించేలా ఒప్పందాలను కుదుర్చుకుంటాయని ఈ అధ్యయనంలో వెల్లడైంది.

ఆవిష్కరణ



వయసు చెప్పేస్తుంది!

వయసు ఎంతో చెప్పుకోవడం చాలా మందికి పెద్దగా ఇష్టం ఉండదు. టచప్ ఇస్తే, ఎంత పెద్ద వాళ్లయినా కాస్త చిన్నగా కనబడటం గ్యారెంటీ. కానీ ఇప్పుడులా మేకప్ వేసినా వయసు చెప్పేసేలా ఓ టెక్నాలజీని అభివృద్ధి చేశారు మాస్కోకు చెందిన శాస్త్రవేత్తలు. అయితే ఇప్పటికే ఆ టెక్నాలజీ స్మార్ట్‌ఫోన్లలో ఉంది. కానీ ఈ న్యూరల్ నెట్‌వర్క్‌లు కొన్ని సార్లు వయసు పసిగడుతున్నాయట. అందుకే సరికొత్త న్యూరల్ నెట్‌వర్క్‌ను ఆవిష్కరించారు శాస్త్రవేత్తలు. ఈ న్యూరల్ నెట్‌వర్క్ ఏదైనా వీడియోలో ఉన్నవారి వయసును, జెండర్‌ను కరెక్ట్‌గా చెప్పేస్తుందట. తక్కువ ధరలో లభించే స్మార్ట్‌ఫోన్లలో కూడా ఈ సాంకేతికత పనిచేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.


ముత్యాల ముగ్గు

19 నుంచి
5 వరకు
సరిచుక్క





కృష్ణకుమారి చెరుకూరి
పెనమలూరు




టి.యం. శారద
తిలక్‌నగర్, గుంతకల్

27 చుక్కలు
9 వరుసలు
9 వచ్చేవరకు



గొరిట్యాల తిరుమల
బాలాజీనగర్, కరీంనగర్

25 చుక్కలు
సరి చుక్క
1 వచ్చేవరకు



తుమ్మల సులోచన
నల్లగొండ

ముగ్గులు పంపాల్సిన చిరునామా:
నవ్య, ముత్యాల ముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70,
హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
ఈ-మెయిల్: navya@andhrajyothy.com

తాత అభిమానుల గురించి భయం లేదు

- సుమంత్



"చిన్నప్పటి నుంచీ తాత (ఏయన్నార్)గారి దగ్గర పెరిగాను కాబట్టి తెలియకుండానే ఆయన పోలికలు, మేనరిజమ్స్ నాలో ఉన్నాయి. కాబట్టి తాత పాత్ర పోషించడానికి పెద్దగా కష్టపడింది లేదు. టైటిల్ పాత్రలో బాలకృష్ణగారు, దర్శకుడి కుర్చీలో క్రిష్ లేకపోతే ఈ సినిమా వైపు చూసేవాడిని కాదు" అని సుమంత్ అన్నారు. 'యన్.టి.ఆర్' బయోపిక్‌లో ఆయన అక్కినేని నాగేశ్వరరావు పాత్రలో నటించారు. ఈ నెల 9న ప్రేక్షకులముందుకు రానుంది సినిమా. ఈ సందర్భంగా ఆదివారం సుమంత్ విలేకర్లతో ముచ్చటించారు.

అనుబంధం.. పోటీ..

ఒకరోజు క్రిష్ వచ్చి యన్.టి.ఆర్ కథ చెప్పారు. తాతగారి పాత్రను తెరకెక్కించడంలో ఆయన 100 శాతం న్యాయం చేస్తారని గట్టి నమ్మకం. ఇంకెవరన్నా ఈ ప్రాజెక్ట్ హ్యాండిల్ చేసుంటే ఆ వైపు కూడా వెళ్లేవాడిని కాదు. ఎన్టీఆర్‌కు, తాతకు మధ్య ఉన్న అనుబంధం గురించి తీసిన సినిమా కాదిది. ఇందులో తాతది సపోర్టింగ్ రోల్‌లా ఉంటుంది. ఆయన క్యారెక్టర్ హానెస్ట్‌గా, డిగ్నిఫైడ్‌గా ఉంటుంది. క్రిష్ చెప్పిన కథ ప్రకారం నేను చేసుకుంటూ వెళ్లా. చిన్నప్పటి నుంచీ నాలో తాత పోలికలున్నాయని అందరూ అంటుంటారు. దాన్ని అలాగే చిత్రీకరించడానికి కుదరలేదు. తాత క్యారెక్టర్ 25 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుంది. ఐదు వేరియేషన్స్‌లో మేకప్ టెస్ట్‌లు చేశారు. నాకు కోపం, విసుగు తక్కువ. మొదటిరోజు మేకప్ వేసేటప్పుడు కాస్త ఇబ్బందిగా అనిపించింది. తర్వాతి రోజు దార్లోకి వచ్చేశా. మొదటి సీన్ రానాతో చేశా. ఇద్దరి మధ్య చనువు ఉండటంతో ఈజీగా చేసేశా. ఐదు వేరియేషన్స్‌లో యాక్టింగ్ పరంగా దేనికీ ఇబ్బంది లేదు. ఓల్డ్ గెటప్‌కి మాత్రం కాస్త కష్టపడాల్సి వచ్చింది. తాతగారికి, ఎన్టీఆర్‌గారికి మధ్య ఎంత అనుబంధం ఉందో.. అంతే పోటీ కూడా ఉండేదట. డెఫినెట్‌గా అనుబంధం, పోటీకు సంబంధించి మంచి డైలాగ్‌లుంటాయి. నేను ఎప్పుడూ వినని డైలాగ్‌లున్నాయి. నేను ఎంత చెప్పినా అది తెరమీద చూస్తేనే అర్థమవుతుంది.

ఆ సీన్స్ లేవు..

తాతగారు షూటింగ్ నుంచిరాగానే చాలా విషయాలు చెబుతుండేవారు. కానీ తాత చెప్పని సిచ్యువేషన్స్ ఇందులో ఉన్నాయి. వాటి నుంచీ చాలా నేర్చుకున్నా. అదొక హిస్టరీ లెసన్‌లా అనిపించింది. వాయిస్ విషయంలో కూడా ఆయన్ను మిమిక్రీ చెయ్యలేదు. ఈ మధ్యన తాత ఇంటర్వ్యూ ఒకటి చూశా. వాయిస్ కోసం నేను చేసిన హోమ్‌వర్క్ అదొకటే. తాత వాయిస్ నాకు బాగా తెలుసు. చెయ్యగలను అనే నమ్మకంతో ముందడుగు వేశా. చిన్నప్పటి నుంచీ ఆయనతో కలిసున్నాను కాబట్టి తెలియకుండానే ఆయన క్వాలిటీస్, మేనరిజమ్స్‌లాంటివి నాకు చాలా వరకూ వచ్చేశాయి. ఏయన్నార్‌గారి అభిమానులు ఎలా రిసీవ్ చేసుకుంటారనే భయం నాకు లేదు. అభిమానులకు నచ్చేలా ఉంటుందని ఆశిస్తున్నా.

మావయ్య డిసైడ్ చెయ్యాలి...

ఈ సినిమాకు హిందీలో డబ్బింగ్ చెప్పమంటే చెబుతా. హిందీ వాళ్లు చెప్పడం కంటే మేం చెప్పడమే బావుంటుంది. ఇటీవల విడుదలైన 'ఇదంజగత్' నిరుత్సాహపరిచింది. 'మళ్లీరావా' సినిమాకు ముందు మొదలైన సినిమా అది. 'యన్.టి.ఆర్' బయోపిక్ తర్వాత మరో మంచి సినిమా ఉంది. నో వర్రీస్. తాత బయోపిక్ చెయ్యాలంటే అది నాగార్జున మావయ్య డిసైడ్ చెయ్యాలి. అలాంటి ఆలోచన ఉంటే ఫ్యామిలీ అంతా మాట్లాడుకుని చేస్తాం. ఇప్పటి వరకూ ఆ ఆలోచన రాలేదు.

మాఫియా డాన్‌ల కన్నా దారుణం

- ప్రసన్నకుమార్



'పేట' ప్రీ రిలీజ్ దృశ్యం

రజనీకాంత్ కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజు తెరకెక్కించిన చిత్రం 'పేట'. అశోక్ వల్లభనేని ఈ నెల 10న తెలుగులో విడుదల చేస్తున్నారు. ఆదివారం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో జెమినీ కిరణ్ ఫస్ట్ టిక్కెట్‌ను విడుదల చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ "చిరంజీవి, రజనీకాంత్ వంటి సీనియర్ నటుల సినిమాలు చూస్తూ పెరిగాం. మాలాంటి హీరోలకు వారే స్ఫూర్తి. 'పేట' ట్రైలర్‌లో రజనీకాంత్‌గారి ఎనర్జీ కనిపిస్తుంది. గత ఏడాది 'నవాబ్', 'సర్కార్'తో రెండు సూపర్‌హిట్లు అందుకున్న అశోక్ రెండు పెద్ద సినిమాల మధ్య 'పేట' విడుదల చేస్తున్నాడు. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని అన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ "సినిమా కళకు ప్రాంతం, కులం, మతం, భాషా ఉండవని నిరూపించిన వ్యక్తి రజనీకాంత్. స్వయంశక్తితో ఎదిగిన ఆయన ఓ చరిత్ర. థియేటర్ల యజమానుల పరిస్థితి మాఫియా డాన్‌లకన్నా దారుణంగా ఉంది. కొత్తవారిని రానివ్వడంలేదు. ఇది మంచి పద్ధతి కాదు. విజ్ఞప్తి అనుకోండి! వార్నింగ్ అనుకోండి! ఇలాంటి వాళ్లను చాలామందిని చూశాం. వీర్రవీగినవాళ్లు ఆకాశం నుంచి ఆకాశంలోకే వెళ్లిపోయారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు థియేటర్ మాఫియా గురించి తెలియజేస్తాం" అని చెప్పారు. "ప్రస్తుతం అశోక్ టైమ్ నడుస్తోంది. ఈ సినిమా కూడా హిట్ అవుతుంది. కార్తీక్ సుబ్బరాజు సినిమాలు చూసి వదిలేసేలా కాకుండా మనతో ఇంటికి తీసుకెళ్లేలా ఉంటాయి" అని అంబికా కృష్ణ అన్నారు. "అన్నగారు ఎన్టీఆర్‌గారి వల్ల రజనీకాంత్‌గారిని కలిసే అవకాశం దక్కింది. స్వయంకృషితో ఎదిగిన హీరో ఆయన. సౌత్ ప్రేక్షకులకు కావలసిన విధంగా రజనీకాంత్ 'పేట'లో కనిపిస్తారు" అని వైవీఎస్ చౌదరి చెప్పారు. "కార్తీక్ సుబ్బరాజు రజనీ సార్‌కి పెద్ద ఫ్యాన్. టీమ్ అందరికీ ఇదొక డ్రీమ్ ప్రాజెక్ట్. ఓ రజనీ అభిమాని.. రజనీ అభిమానుల కోసం తీసిన సినిమా ఇది" అని సంగీత దర్శకుడు అనిరుద్ చెప్పారు. "కథ మీదున్న నమ్మకంతో థియేటర్లు తక్కువున్నా ధైర్యంగా ఓన్ రిలీజ్ చేస్తున్నా. కొందరు థియేటర్ల విషయంలో ఇబ్బందులు పెడుతున్నారు. వీళ్లేమన్నా థియేటర్‌లతోనే పుట్టారా? నయీమ్‌ని షూట్ చేయించిన ప్రభుత్వాలు ఈ థియేటర్ మాఫియా కుక్కల్ని ఎందుకు షూట్ చెయ్యరు చెప్పండి?" అని నిర్మాత అన్నారు. "రజనీ సార్‌తో పని చేయాలని ఎవరైనా అనుకుంటారు. నా కల నెరవేరింది. డెఫినెట్‌గా ఈ సినిమా హిట్ అవుతుంది" అని కార్తీక్ సుబ్బరాజు చెప్పారు.


తిరిగి ఇవ్వాలని...

- ఎ.ఆర్.రెహమాన్



"తెలియని విషయాలను నేర్చుకోవాలని, ఎంతో కొంత సమాజానికి తిరిగి ఇవ్వాలని అనుకుంటున్నాను" అని అన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్. ఆయన ఆదివారం పుట్టినరోజును నిర్వహించుకున్నారు. 52 ఏళ్ల రెహమాన్ మాట్లాడుతూ "నేను, నా కుమారుడు అమీన్ ఒకేరోజు పుట్టినరోజును జరుపుకొంటాం. నా కుటుంబసభ్యుల మధ్య పుట్టినరోజు వేడుకలను నిర్వహించుకున్నాను. ఈ మధ్య యువతరాన్ని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. కొత్త విషయాలను రాయడానికి వారు స్ఫూర్తిని పంచుతున్నారు" అని అన్నారు.

కొత్త లుక్కులో... ఎన్ని నవ్వులో!



సమంత, నాగచైతన్య

నాగచైతన్య లుక్ మారింది! 'మజిలీ' ఫస్ట్ లుక్‌లో కాస్త గడ్డంతో రెట్రో లుక్కులో కనిపించిన ఆయన... క్లీన్ షేవ్‌లోకి వచ్చేశారు. టీనేజ్ కుర్రాడిలా కనిపిస్తున్నారు. చైతూ సతీమణి సమంత అక్కినేని ఈ లుక్కును బయటపెట్టారు. ప్రస్తుతం వీరిద్దరూ నెదర్లాండ్స్‌లోని అమస్టర్‌డామ్‌లో ఉన్నారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం వెళ్లారు. అమస్టర్‌డామ్ ట్రిప్ గొప్పగా గడిచిందని సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. చాలా అంచనాలతో 2019లోకి అడుగుపెట్టామని ఆమె అన్నారు. ట్రిప్ ఫొటోలనూ పోస్ట్ చేశారు. అందులో చైతూ నవ్వుకి కాంప్లిమెంట్స్ కూడా ఇచ్చారు. "నీ (చైతూ) నవ్వు అంటే నాకెంతో ఇష్టం... ప్రేమ" అని సమంత అన్నారు. 'మజిలీ'లో ఈ లుక్‌లో చైతూ కనిపిస్తారో? లేదా మేనమామ వెంకటేశ్‌తో కలిసి నటించబోయే 'వెంకీమామ' కోసం ఈ లుక్‌లోకి వచ్చారో? కొన్ని రోజుల్లో తెలుస్తుంది.



ఆరుగురు ఎవరు?

'నాకే తెలియని ఆరుగురు నా తలరాతను తలకిందులుగా రాశారు' అనే డైలాగ్ 'ఐరా'లో ఆకట్టుకుంటోంది. నయనతార ద్విపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'ఐరా'. తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ ఇటీవల విడుదలైంది. ట్రిడెంట్ ఆర్ట్స్ ఆర్.రవీంద్రన్ విడుదల చేస్తున్నారు. పచ్చటి పొలాల మధ్య 'మళ్లీ ఆడపిల్లే పుట్టిందిరా' అనే మాటతో టీజర్ మొదలైంది. 'ఐరా' హారర్ చిత్రమని టీజర్‌లోని ప్రతి ఫ్రేము చెబుతుంది. 'నేను చెప్పానుగా.. నీకోసం వస్తానని చెప్పానుగా..' అనే డైలాగ్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి కేఎంసర్జున్ దర్శకత్వం వహిస్తున్నారు. చలాకీ యువతిగా, అమాయకురాలిగా నయనతార లుక్స్ మెప్పిస్తున్నాయని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

శ్రీను మాస్టర్‌కి డాక్టరేట్!



సినిమా పరిశ్రమలో అర్ధశతాబ్దం అనుభవం ఉన్న నృత్య దర్శకుడు శ్రీను గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. తొమ్మిది భాషల్లో దాదాపు వెయ్యికి పైగా సినిమాలకు పనిచేసినందుకుగానూ ఆయన్ని హార్వెస్ట్ బైబిల్ యూనివర్శిటీ ఆదివారం డాక్టరేట్‌తో సత్కరించింది. శ్రీను మాస్టర్ మాట్లాడుతూ "నేనంటే నేనే చిత్రంతో నృత్య దర్శకుడిగా పరిచయమయ్యాను. హీరాలాల్ మాస్టర్‌గారి సహాయకుడిగా పనిచేశాను. అంతకు ముందు గురు సుందర్ ప్రసాద్‌గారి దగ్గర కథక్, ఎల్లప్పపిళ్లైగారి దగ్గర భరతనాట్యం నేర్చుకున్నాను. గతేడాది సెప్టెంబర్ 6కి నేను డ్యాన్స్‌మాస్టర్‌గా పరిచయమై 50 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ నెల 4న తిరుపతిలో మంచు మోహన్‌బాబుగారు చేసిన సత్కారాన్ని మర్చిపోలేను. ఇప్పుడొస్తున్న యువ కథానాయకులకు కొందరికి తప్ప, ఐదు దశాబ్దాలలో అగ్రకథానాయకులు, నాయికలందరితోనూ పనిచేసినందుకు సంతోషంగా ఉంది. నా శిష్యులు తార, తరుణ్, రాజేంద్రప్రసాద్ తదితరులు నృత్యదర్శకులుగా రాణిస్తున్నారు" అని అన్నారు.

కాలమే సమాధానం చెబుతుంది!

- ఖోలీ కర్దాషియన్



అమెరికన్ రియాలిటీ స్టార్, కెనడా బాస్కెట్‌బాల్ ప్లేయర్ ట్రిస్టన్ థాంప్సన్ ద్వారా ఓ పాపాయికి జన్మనిచ్చిన ఖోలీ కర్దాషియన్ మరో చిన్నారి గురించి ఆలోచిస్తున్నారా? ట్విట్టర్‌లో ఆమెను ఓ అభిమాని ఇదే విషయాన్ని అడిగారు. అందుకు ఖోలీ కర్దాషియన్ అవునని గానీ... కాదని గానీ... సమాధానం చెప్పలేదు. దీనికి కాలమే సమాధానం చెబుతుందని ఆమె అన్నారు. ఖోలీ కర్దాషియన్ మాట్లాడుతూ "మా అమ్మాయి అంటే నాకెంతో ప్రేమ. తను పుట్టిన తర్వాత నా జీవితానికి ఓ పరిపూర్ణత వచ్చిందని భావిస్తున్నా. మరొకరు జన్మిస్తే... నా జీవితానికి మరింత పరిపూర్ణత వస్తుందేమో! నాకు తెలియదు. దేవుడు నా గురించి ఏం ఆలోచిస్తున్నాడో? నాకు ఏం ఇవ్వాలనుకుంటున్నాడో? కాలమే సమాధానం చెబుతుంది" అని అన్నారు. థాంప్సన్, ఖోలీ జంట మరోసారి తల్లిదండ్రులు కావాలనుకుంటున్నారని సమాచారం.

వివరాలు ఇవిగో

◆ **నేను మెకానికల్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాను. ఒకటి రెండు సంవత్సరాలు పనిచేసి తర్వాత ఎంబిఏ చేయాలని అనుకుంటున్నాను. అయితే నా కోర్ రంగంలో పనిచేయాలంటే మొదట పీజీ చేయాలని చెబుతున్నారు. ఇదే కాకుండా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ గురించి ఎక్కడో పత్రికలో చదివాను కానీ దానికి సంబంధించిన వివరాలు లభించలేదు. ఆ వివరాలు ఇవ్వగలరు? అలాగే ఎంబిఏ, పీజీలకు సంబంధించి ఏదీ ఎంచుకోవాలో సలహా ఇవ్వగలరు?**

ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్

-రవి, గోదావరిఖని

● ఐఐఎంలు, ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఎంబిఏ చేయాలంటే ఒకటి రెండు సంవత్సరాలు పనిచేసి ఆ తర్వాత చేస్తే బెటర్. కొంత అడ్వాంటేజ్ ఉంటుంది. అలా అని మీ గ్రాడ్యుయేషన్ తరువాత అవకాశం ఉండదని కాదు. మిగిలిన వ్యక్తులు కూడా ఇదే విషయాన్ని చెప్పి ఉంటారు. ఇక సబ్జెక్టుకు సంబంధించిన క్వాలిఫికేషన్‌ను పెంచుకోవడం కూడా మంచి ఆలోచనే. అయితే మీ కోర్ ఇండస్ట్రీలో డిగ్రీ, పీజీకి పెద్దగా తేడా ఉండదు. అకడమిక్ వైపు వెళ్లాలనుకుంటే మాత్రం పీజీ, పీహెచ్‌డీ అవసరం అవుతుంటాయి. మొదట మీరు సరైన గోల్‌ను నిర్ణయించుకోండి. ఆ తర్వాత అందుకు అనుగుణంగా అడుగులు వేయండి. ఇక ఏ రంగంలోనైనా కొద్ది కాలం పనిచేసిన తరువాత ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(www.pmi. org.in) సర్టిఫికెట్ పొందడానికి ట్రై చేయండి. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (www.ignou.ac.in) కూడా దీనిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సును అందిస్తుంది. పిఎమ్ఐ వీలు కాకుంటే ఇగ్నో కోర్సువైపు దృష్టిపెట్టండి.

◆ **నేను డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాను. విదేశాల్లో ఎంఏ ఇంగ్లీష్ లిటరేచర్ చేయాలనుకుంటున్నాను. యూకెలో దీనికి సంబంధించిన మంచి యూనివర్సిటీ ఏదైనా ఉందా? అలాగే స్కాలర్‌షిప్‌లు ఏమైనా అందుబాటులో ఉంటాయా? స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించడానికి ఐఇఎల్‌టిఎస్‌లో కనీసం ఎంత స్కోరు సాధించాలి?**

ఐఇఎల్‌టిఎస్‌లో ఎంత స్కోరు..?


- మౌనిక, సికింద్రాబాద్

● లండన్ వెస్ట్‌మినిస్టర్స్ యూనివర్సిటీ వందశాతం స్కాలర్‌షిప్‌ను అందిస్తుంది. ఇక్కడ ఎంఏ లిటరేచర్ చేయాలంటే ఐఇఎల్‌టిఎస్‌లో 6.5 లేదా అంతకన్నా ఎక్కువ స్కోరు రావాలి. దీనితోపాటు బ్యాచిలర్ డిగ్రీలో మంచి జిపిఏ ఉండాలి. దరఖాస్తుతోపాటు స్కాలర్‌షిప్‌నకు ఎందుకు? ఎలా అర్హులు అనే విషయంపై 500 పదాలతో ఒక వ్యాసం రాసి జత చేయాల్సి ఉంటుంది. ఈ వ్యాసానికి మంచి విలువ ఉంటుంది. రాతలో మంచి నైపుణ్యం ఉన్నవారు వ్యాసం ద్వారా వాళ్లని కన్విన్స్ చేయగలరు.
వెస్ట్ మినిస్టర్ కాకుండా చాలా యూనివర్సిటీలు స్కాలర్‌షిప్‌ను అందిస్తున్నాయి. ఈ స్కాలర్‌షిప్ రేంజ్ 3000 నుంచి 5000 పౌండ్ల వరకు ఉంటుంది. పై దానితో పోలిస్తే ఇవి కొంత సులువుగా లభించే అవకాశం ఉంటుంది. చాలా మంది ఇంటర్నేషనల్ విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ద్వారా విద్యను కొనసాగిస్తుంటారు.

● గోవర్ధనం కిరణ్‌కుమార్

చిరునామా: వివరాలు ఇవిగో, కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్వినీ ఎన్‌క్లేవ్, హుడా హైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033





నెస్ట్‌తో బెస్ట్ కెరీర్

జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ముంబైలోని యుఎం-డిఎఇ సిఇబిఎస్(యూనివర్సిటీ ఆఫ్ ముంబై డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్), భువనేశ్వర్‌లోని ఎన్ఐఎస్ఈఆర్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష నేషనల్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్(నెస్ట్) నోటిఫికేషన్ విడుదలైంది. బేసిక్ సైన్స్ కోర్సులైన బయాలజీ, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఫిజిక్స్‌ల్లో ఉన్నత విద్య, ఆపై పరిశోధనలు చేయాలనుకొనే వారు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

చదువుతో పాటు స్కాలర్‌షిప్

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీలో అడ్మిషన్ పొందిన వారికి స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉంటుంది. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఏటా ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్ కింద రూ.60,000 ఇస్తుంది. భారత అణుశక్తి మంత్రిత్వశాఖ 'దిశ' కింద కూడా ఏటా రూ.60,000 స్కాలర్‌షిప్‌ను ఇస్తుంది. అయితే రెంటిలో ఏదో ఒకదానికి మాత్రమే అభ్యర్థి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి అదనంగా సమ్మర్ ఇంటర్న్‌షిప్ కింద రూ.20,000 లభిస్తాయి. అంతే కాదు ఈ ఐదేళ్లలో టాప్ పర్ఫార్మర్‌గా నిలిచిన వారికి ఇంటర్వ్యూ నిర్వహించి బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్) ట్రెయినింగ్ స్కూల్‌లో శిక్షణ ఇస్తారు.

అర్హత

నెస్ట్ రాయాలనుకొనే అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌ను తప్పని సరిగా బేసిక్ సైన్స్ స్ట్రీమ్(బయాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు తప్పని సరిగా 2017 లేదా 2018 అకడమిక్ ఇయర్‌లో ఉత్తీర్ణులై ఉండాలి. అయితే 2019లో ఇంటర్ చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

ఓబిసీ విద్యార్థులు 1999 ఆగస్టు 1, ఆ తరవాత జన్మించిన వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పిడబ్ల్యూడి అభ్యర్థులకు వయో పరిమితిలో నిబంధనల మేరకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

సిలబస్

- **ఫిజిక్స్:** జనరల్, మెకానిక్స్, సౌండ్, ఫ్లూయిడ్స్, థర్మల్ ఫిజిక్స్, రొటేషనల్ డైనమిక్స్, వేవ్ ఆప్టిక్స్, ఎలక్ట్రిసిటీ, మేగ్నటిజం, సెమి కండక్టర్స్, కెపాసిటెన్స్, మోడర్న్ ఫిజిక్స్, ఎలక్ట్రోమేగ్నటిక్ ఇండక్షన్, రే ఆప్టిక్స్, ఎక్స్‌రేస్
- **కెమిస్ట్రీ:** ఆటామిక్ స్ట్రక్చర్, కెమికల్ బాండింగ్, థర్మోడైనమిక్స్, మోల్ కాన్సెప్ట్, సొల్యూషన్స్, కెమికల్ కైనెటిక్స్, పిరియాడిక్ టేబుల్, మెటలర్జీ, డి-బ్లాక్ ఎలిమెంట్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, ఎఫ్-బ్లాక్ ఎలిమెంట్స్, ఎస్-బ్లాక్ ఎలిమెంట్స్, మెటల్స్ అండ్ నాన్ మెటల్స్, కొలాయిడ్స్, కోఆర్డినేషన్ కాంపౌండ్స్, సర్ఫేస్ కెమిస్ట్రీ, సాలిడ్ స్టేట్, సొల్యూషన్స్, హైడ్రోజన్ ఎలిమెంట్, ఆర్గానిక్ కెమిస్ట్రీ-రియాక్టివ్ ఇంటర్మీడియెట్స్, ఆల్కేన్స్, నామిన్‌క్లేచర్, ఆల్కేన్స్ అండ్ అల్కైన్స్, ఐసోమెరిజమ్, ఆరోమాటిక్ కాంపౌండ్స్
- **బయాలజీ:** ఎకోసిస్టమ్స్, ఎవల్యూషన్, బయోటెక్నాలజీ, అనాటమీ, జెనటిక్స్, హ్యూమన్ అండ్ ఎన్విరాన్‌మెంట్, బయోలజీ ఆఫ్ ప్లాంట్ సిస్టమ్స్, రిప్రొడక్షన్, ఫిజియాలజీ, హ్యూమన్ హెల్త్ అండ్ డిసీజెస్, ఎకాలజీ, బయోలజీ ఆఫ్ యానిమల్ సిస్టమ్స్.
- **మేథమెటిక్స్:** ఆల్జీబ్రా, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, ప్రాబబిలిటీ, అర్థమెటిక్, హార్మోనిక్ అండ్ జియోమెట్రిక్ ప్రోగ్రెషన్, పెర్మిటేషన్స్ అండ్ కాంబినేషన్స్, లాగరిథమ్స్, సైమల్టేనియస్ లీనియర్ ఈక్వేషన్స్, బైనామియల్ థీరమ్, మ్యాట్రిసస్
- **జనరల్ ఎబిలిటీ:** ప్రత్యేకంగా ఈ సిలబస్‌ను పేర్కొనకపోయినప్పటికీ జనరల్ ఎబిలిటీ అంటే సాధారణంగానే జనరల్ స్టడీస్‌లో ఉండే అన్ని అంశాలు ఇందులో ఉంటాయి. అంటే జికె, సైన్స్, హిస్టరీ, జాగ్రఫి, ఇంగ్లీష్, మేథమెటిక్స్, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రాథమిక స్థాయిలో అంటే పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుంది.

పరీక్ష స్వభావం

ప్రశ్న పత్రంలో ఐదు సెక్షన్లు ఉంటాయి. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి విభాగం జనరల్ సెక్షన్(జనరల్ ఎబిలిటీ). ప్రశ్నలన్నీ మల్టిపుల్ చాయిస్ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి. దీనిలో 30 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. జనరల్ ఎబిలిటీ సెక్షన్‌ను అభ్యర్థులు తప్పని సరిగా రాయాలి. ఎలాంటి నెగెటివ్ మార్కింగ్ ఉండదు. ఇక 2 నుంచి 5 వ సెక్షన్ వరకు సబ్జెక్టులకు సంబంధించినవి. ప్రతి సబ్జెక్టుకు 50 మార్కులు కేటాయించారు. అభ్యర్థులు ఇంటర్‌లో చదువుకొన్న ఆప్షనల్స్ మేరకు ప్రశ్న పత్రంలోని సబ్జెక్టులను అటెంప్ట్ చేయవచ్చు. ఎవరైనా అన్ని సెక్షన్లు అటెంప్ట్ చేసినప్పటికీ, జనరల్ సెక్షన్‌తో పాటు కేవలం మూడు అప్షనల్స్ నుంచి మాత్రమే మార్కులను మెరిట్ లిస్ట్‌కు పరిగణనలోకి తీసుకొంటారు.

విభాగాలు	ప్రశ్నల సంఖ్య
జనరల్ ఎబిలిటీ	30
ఫిజిక్స్	50
కెమిస్ట్రీ	50
బయాలజీ	50
మేథమెటిక్స్	50
మొత్తం	**230**

ప్రిపరేషన్ వ్యూహం

అభ్యర్థులు మొదట నోటిఫికేషన్‌లో పేర్కొన్న సిలబస్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అవగాహన చేసుకోవాలి. ఎందుకంటే పరీక్ష స్వరూపం, ప్రశ్నల సరళి అర్థం కాకుండా పరీక్ష రాయడం సులభం కాదు. అభ్యర్థులు ఇప్పటికే జెఇఇ, నీట్ వంటి పరీక్షలకు ప్రిపేరవుతున్న వారయితే నెస్ట్ రాయడం ఏమంత కష్టతరమైనది కాదు. జెఇఇ, నీట్ పరీక్షల్లో ఉన్న సిలబస్ ఇందులోనూ ఉంది. కాబట్టి ఒక్క సారి పునశ్చరణ చేసుకోవడం, వీలైనన్ని నెస్ట్ గత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ఉత్తమం. అదేవిధంగా ప్రిపరేషన్ ప్రణాళికను రూపొందించుకొని ఆ మేరకు అధ్యయనం చేయగలిగితే విజయం సాధించడం ఏమంత కష్టతరమైనది కాదు.

నోటిఫికేషన్ సమాచారం

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, యూనివర్సిటీ ఆఫ్ ముంబై - డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్ సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే నేషనల్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్(నెస్ట్) 2019 ప్రకటన విడుదలైంది. బేసిక్ సైన్సెస్(బయాలజీ, కెమిస్ట్రీ, మేథ్స్, ఫిజిక్స్) సబ్జెక్టుల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ప్రోగ్రాం ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహిస్తారు.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: జనవరి 7
చివరి తేదీ: మార్చి 11, **ప్రవేశ పరీక్ష తేదీ:** జూన్ 1
వెబ్‌సైట్: www.nestexam.in

క్యాట్ ర్యాంకర్స్ వాయిస్



పర్సంటైల్ 100
రాణక్ మజుందార్
ఐఐటి, కాన్పూర్

మాక్‌టెస్ట్‌లు రాస్తే బెటర్

● **మీ ప్రిపరేషన్ ఎప్పుడు మొదలైంది? ఎలా సాగింది? ప్రిపరేషన్‌ను ప్రారంభించడానికి సరైన సమయం ఏమిటి?**

ఆగస్టు 2018లోనే క్యాట్ ప్రిపరేషన్‌ను మొదలు పెట్టాను. ప్రిపరేషన్‌లో భాగంగా ఎక్కువగా మాక్ టెస్టులు ప్రాక్టీసు చేశాను. దాంతో ఎందులో వెనుకబడ్డానో బేరీజు వేసుకున్నాను. ఫండమెంటల్స్‌పై పూర్తి అవగాహన ఉంది. కానీ టైం మేనేజ్‌మెంట్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్ట్రాటజీస్‌పై మరింతగా దృష్టిసారించాలనే విషయం ఈ మాక్ టెస్టుల వల్ల అర్థమైంది. ప్రిపరేషన్ అనేది యూనివర్సల్‌గా ఉండదు. అది అభ్యర్థుల శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది. క్వాంటిటేటివ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారు జూలై - ఆగస్టు ఆ సమయంలో ప్రిపరేషన్‌ను ప్రారంభిస్తే సరిపోతుంది. కానీ, నాన్ క్వాంటిటేటివ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారు మాత్రం కాస్త ముందుగానే అంటే మార్చి/ఏప్రిల్‌లో ప్రిపరేషన్‌ను ప్రారంభిస్తే బేసిక్ మేథ్స్‌పై పట్టు సాధించవచ్చు.

● **ఎలాంటి ప్రత్యేక వ్యూహాన్ని అనుసరించారు?**

ప్రిపరేషన్ అంతా మాక్ టెస్టులు రాయడం, వాటిని విశ్లేషించుకోవడంగానే సాగింది. దీనినే నా ప్రధాన వ్యూహంగా ఎంచుకున్నాను. విజయం కూడా సాధించాను. ఎందుకంటే వారంలో అనేక మాక్ టెస్టులు అటెంప్ట్ చేస్తూ ఫండమెంటల్స్‌పై పట్టు సాధిస్తూ, ఏవైనా తప్పులు దొర్లితే వాటిని సవరించుకుంటూ అధ్యయనం కొనసాగించాను. ఏయే టాపిక్‌లో వెనుకబడి ఉన్నాననే విషయాన్ని వెంటనే గ్రహించ గలిగాను. జడ్జిమెంట్ విషయాల్లో కొన్ని కొన్ని చిన్న తప్పులు దొర్లాయి. అయితే అంతిమంగా మాత్రం మాక్ టెస్టులు నాలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచాయనే చెప్పవచ్చు.

● **ఏదైనా విభాగంలో లేదా సబ్జెక్టులో మీరు బలహీనంగా ఉన్నట్టు గమనించారా? ఎలా అధిగమించగలిగారు?**

అదృష్టవశాత్తు నాకు ఏ విభాగం అంత కఠినంగా అనిపించలేదు. అయితే నా ఎల్‌ఆర్‌డిఐ స్పీడ్‌ను మాత్రం పెంచుకోవాలని భావించాను. అందుకు గల సులభమైన పద్ధతులు, సాధన వ్యూహాలను అనుసరించి వేగంగా, కచ్చితంగా సమాధానాలను గుర్తించేలా నన్ను నేను మెరుగుపరుచుకొన్నాను.

● **విభాగాల వారీగా మీ ప్రిపరేషన్ స్ట్రాటజీ ముఖ్యంగా క్యూఏ, డిఐఎల్‌ఆర్, విఏఆర్‌సిలను వివరిస్తారా?**

విఏఆర్‌సి, క్యూఏలో ఎక్కువగా ఫండమెంటల్స్‌లో నాకున్న సామర్థ్యాన్ని పరీక్షించుకోవడమే నా ప్రిపరేషన్ వ్యూహంగా ఎంచుకున్నాను. అందుకు మొదట్లో చెప్పినట్లు మాక్ టెస్టులు బాగా ఉపయోగపడ్డాయి. క్యాట్ పరీక్షలో ఎవరైనా విజయం సాధించాలంటే ఫండమెంటల్స్‌పై అవగాహనతో పాటు వేగం, కచ్చితత్వంపై పట్టు తప్పనిసరిగా సాధించి తీరాలి. నేను కూడా వీటికే ప్రాధాన్యం ఇచ్చాను. దీనికి తోడు నాకు సోషల్ మీడియాలో మంచి పోటీ గ్రూపులతో అనుబంధం ఏర్పడింది. ఆయా గ్రూపుల ద్వారా నేను ఇతర అభ్యర్థులతో ప్రిపరేషన్ అనుభవాలు పంచుకోవడంతో పాటు సందేహాలను నివృత్తి చేసుకోగలిగాను. ఒక్క ముక్కలో చెప్పాలంటే అందరు అభ్యర్థుల మాదిరిగానే నేనూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను.

● **ఎక్కడైనా కోచింగ్ తీసుకున్నారా? క్యాట్‌కు కోచింగ్ తప్పనిసరా?**


నేను 'ఐఎంఎస్' మాక్ టెస్టుల సిరీస్‌ను ప్రాక్టీస్ చేశాను. అదేవిధంగా వివిధ ఇతర సంస్థల సహాయాన్ని కూడా నా ప్రిపరేషన్‌కి ఉపయోగించుకున్నాను. నాకు ఐఎంఎస్ థానె సెంటర్‌లో షామిందర్ సర్, స్క్రాబ్లర్ మెంటార్లుగా లభించారు. వీరి మార్గదర్శకంలోనే నేను క్యాట్‌లో విజయం సాధించగలిగాను. ఇక కోచింగ్ విషయానికి వస్తే క్యాట్ ప్రిపరేషన్‌లో మాక్ టెస్టుల పాత్ర ఎక్కువ అని నా భావం. క్యాట్ కోచింగ్‌లో సుదీర్ఘ అనుభవమున్న సంస్థల టెస్టు సిరీస్‌లను మాత్రం అభ్యర్థులు తప్పనిసరిగా రాయాలి. అప్పుడు మన సామర్థ్యం ఏమిటో తెలుస్తుంది. అదేవిధంగా ఫుల్ టైం క్లాసులు కానీ, లేదా నైట్ టైం క్లాసులు కానీ ఏవైనప్పటికీ బేసిక్ మేథ్స్‌లో బలహీనంగా ఉన్నవారికి ఇవి తప్పకుండా ఉపయోగపడతాయి.

● **క్యాట్ కోసం ప్రత్యేకమైన స్టడీమెటీరియల్, బుక్స్ ఉన్నాయా?**

క్యాట్ ప్రిపరేషన్ కోసం నేను ఎలాంటి స్టడీ మెటీరియల్ కానీ, బుక్‌ని కానీ రిఫర్ చేయలేదు. అయితే పఠనాసక్తి ఉన్న నేను నెలకు కనీసం రెండు పుస్తకాలు చదవడం పూర్తి చేసేవాడిని(ఎక్కువగా క్లాసిక్స్, ఫిక్షన్). ఈ పఠనాసక్తి కొంత వరకు నాకు ఉపయోగపడిందనే చెప్పవచ్చు. ఈ పుస్తకాలు చదివినప్పుడు నా మైండ్ కాస్త రిలాక్స్ అనిపించేది. ఆ తరవాత తిరిగి క్యాట్ ప్రిపరేషన్‌ను కొనసాగించేవాడిని. ఇది నాకు విఏఆర్‌సి విభాగానికే పరిమితం కాలేదు, వేడెక్కిన నా బుర్రను చల్లబర్చుకోవడంలోనూ ఆ పుస్తకాలు ఉపయోగపడ్డాయి.

● **పరీక్ష రోజు మీరు అనుసరించిన వ్యూహం ఏమిటి? మీ లాస్ట్ మినిట్ ప్రిపరేషన్ గురించి వివరిస్తారా?**

పరీక్షకు ముందు రోజు సాధారణంగానే గడిపాను. మరో వారం రోజుల్లో పరీక్ష ఉందనగా మాక్ టెస్ట్ రాయడం ఆపివేశాను. క్యాట్ ముందుటి రోజు మిగతా ప్రిపరేషన్ కూడా ఆపివేశాను. ఇలా చేయడం వల్ల పరీక్ష సమీపిస్తున్న కొద్దీ కొందరిలో మొదలయ్యే ఆందోళన వంటివి నా దరి చేరలేదు. నేను ఎలాంటి లాస్ట్ మినిట్ ప్రిపరేషన్ వ్యూహాన్నీ అనుసరించలేదు. అన్ని పరీక్షలకు మాదిరిగానే వెళ్లినట్లుగానే దీనికీ వెళ్లగలిగాను.



పర్సంటైల్ 98.9
విఎన్ఎస్ జూహీ వల్లభ్

మార్కెటింగ్‌పై ఆసక్తి

మాది హైదరాబాద్. నాన్న సునీల్‌కుమార్ మీడియా మార్కెటింగ్‌లో ఉంటారు. ఇంపాక్ట్ అసోసియేట్ పేరిట సొంత సంస్థ ఆయనకు ఉంది. ప్రస్తుతం నేను అందులోనే పనిచేస్తున్నాను. అమ్మ కృష్ణశ్రీ, గృహిణి. ఇంటర్మీడియెట్ వరకు హైదరాబాద్‌లోనే చదువుకున్నాను. ఐసిఎస్ఇ బోర్డులో 92% మార్కులతో టెన్త్ పాసయ్యాను. ఇంటర్‌లో 95% మార్కులు వచ్చాయి. ఆ తరవాత మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో(ఎస్‌పిఎ) బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సు చేశాను. 2018 మే నెలలో నా కోర్సు పూర్తయ్యింది. ఆ తరవాత క్యాట్ కోసం టైమ్ కోచింగ్‌లో చేరాను. ఆరు నెలల కృషి ఫలితమే ప్రస్తుతం సాధించిన ఈ ర్యాంక్. మొదటి యత్నంలోనే ఈస్థాయి ర్యాంకు వచ్చినందుకు ఆనందంగా ఉంది. ఏదైనా ఐఐఎంలో చేరి ఎంబిఏ చేద్దామనుకుంటున్నాను. ఆర్కిటెక్చర్ చదివినప్పటికీ మార్కెటింగ్‌పై నాకు ఆసక్తి ఎక్కువ. అందుకే నాన్నగారి సంస్థలో పనిచేస్తున్నాను.

క్యాట్‌లో ఇంగ్లీష్ ఒక విభాగం. నాకు మొదటి నుంచి ఇంగ్లీష్ అంటే ఆసక్తి. అందుకే ఆ విభాగంలో 99 పర్సంటైల్ సాధించగలిగాను. నాకు ఇంగ్లీష్ నవలలు అంటే ఆసక్తి. కొద్దిగా అవగాహన వచ్చిన రోజుల నుంచి ఇంగ్లీష్ నవలలు చదవడం మొదలుపెట్టాను. పరీక్షలో రెండో విభాగమైన లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్‌ను కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ లో నేర్చుకున్నాను. మూడోదైన మేథ్స్‌లో నేను మొదటి నుంచి వీక్. బేసిక్స్ నుంచి నేర్చుకున్నాను. ఆ తరవాత ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయడం మొదలుపెట్టాను. సిస్టమాటిక్ ప్లాన్‌తో మూడు విభాగాలకు ప్రిపేరయ్యాను. ప్రతివారం కనీసం ఒకటి రెండు మాక్‌టెస్ట్‌లకు హాజరయ్యేదాన్ని. పరీక్ష రాసిన తరవాత ఎక్కడ తప్పు చేశానో చూసుకొని లోతుగా విశ్లేషించుకునేదాన్ని. అలాగే ఆ తప్పులు మరలా దొర్లకుండా జాగ్రత్త పడేదాన్ని. అలా లోపాలను సవరించుకుంటూ ముందుకు వెళ్లాను. పరీక్షలోనూ నాకు బాగా తెలిసినవే ఆన్సర్ చేశాను. మైనస్ మార్కులు ఉన్నందున కొద్దిగా సందేహం ఉన్న ప్రశ్నలను కూడా విడిచిపెట్టాను. ఫలితంగా మంచి ర్యాంకు సాధించగలిగాను.

మొదట్లో చెప్పినట్లు ఇంగ్లీష్‌పై ఆది నుంచి నాకు ఆసక్తి ఎక్కువ. ముఖ్యంగా రోండా బైరన్ రాసిన సీక్రెట్ నవల నాకు చాలా ఇష్టం. దానిని పదేపదే చదువుతాను. పాజిటివ్ దృక్పథం ఉంటే సమస్య ఎంత క్లిష్టమైనా సానుకూల ఫలితాన్ని పొందవచ్చన్నది ఆ నవల సారాంశం. భోపాల్‌లో ఆర్కిటెక్చర్ కోర్సు చేస్తున్నప్పుడు పాజిటివ్ ఆలోచనలే నన్ను ముందుకు నడిపాయి. నెగెటివ్ ఆలోచనలను దగ్గరకు రానివ్వకూడదు. క్యాట్ ప్రాక్టీస్‌లోనూ అదే పద్ధతిని అనుసరించాను.

క్యాట్ లాంటి పరీక్షలో అన్ని ప్రశ్నలకు సమాధానాలను గుర్తించాలన్న ఆతృత పనికి రాదు. నెగెటివ్ మార్కులు ఉన్నందున, సమాధానంపై మనకు పూర్తిగా విశ్వాసం ఉన్నప్పుడే ఆన్సర్ గుర్తించాలి. అప్పుడే మన మార్కులు మనకు మిగిలి, మంచి ఫలితాన్ని రాబట్టుకోవచ్చు. ఇదే నేను సదా ఆచరించే ఫార్ములా.

హైదరాబాద్-విజయవాడ మధ్య స్పైస్‌జెట్ డైలీ విమాన సేవలు

ఈనెల 20 నుంచి ప్రారంభం

హైదరాబాద్: ప్రైవేట్ రంగ విమాన సంస్థ స్పైస్‌జెట్.. ఈ నెల 20 నుంచి 12 కొత్త సర్వీసులను ప్రారంభించనుంది. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రతి రోజు విమానాన్ని నడపనున్నట్లు సంస్థ వెల్లడించింది. హైదరాబాద్-విజయవాడ సర్వీసు చార్జీ రూ.2,200, విజయవాడ-హైదరాబాద్ సర్వీసు చార్జీ రూ.1,648 నుంచి ప్రారంభం కానుంది. హైదరాబాద్-విజయవాడ విమాన సర్వీసు (ఎస్‌జీ 1061) ఉదయం 10 గంటల 35 నిమిషాలకు బయలుదేరి 11 గంటల 35 నిమిషాలకు గమ్యాన్ని చేరుకుంటుంది. ఇక విజయవాడ-హైదరాబాద్ విమాన సర్వీసు (ఎస్‌జీ 1602) మధ్యాహ్నం 12 గంటల 5 నిమిషాలకు టేకాఫ్ తీసుకొని ఒంటి గంట 5 నిమిషాలకు చేరుకుంటుంది.



భారత మార్కెట్లోకి లారెట్ 'డియాన్‌ఎక్స్'

2021లో విడుదల

న్యూఢిల్లీ: లండన్‌కు చెందిన లారెట్ ఆటోమోటివ్ కార్పొరేషన్ భారత మార్కెట్లోకి ప్రవేశించే సన్నాహాల్లో ఉంది. ఇందులో భాగంగా 2021నాటికి తన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ డియాన్‌ఎక్స్‌ను విడుదల చేయాలని భావిస్తోంది. ఈ కంపెనీ పుదుచ్చేరిలో 37 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,577 కోట్లు) పెట్టుబడితో వాహనాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే పనిలో ఉంది. తొలుత ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 10,000 వాహనాలుగా ఉంటుంది. 2023 నాటికి ఈ సామర్థ్యాన్ని 23,000 వాహనాలకు పెంచాలని కంపెనీ భావిస్తోంది. డియాన్‌ఎక్స్ దాని విడిభాగాలను ఈ ప్లాంట్‌లోనే తయారు చేసి అసెంబుల్ చేయనున్నారు. 2021నాటికి ఈ ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని కంపెనీ సీఈఓ మార్కస్ పలేటి తెలిపారు. డియాన్‌ఎక్స్‌ను ఒకసారి చార్జింగ్ చేస్తే 540 కిలో మీటర్ల వరకు ప్రయాణించవచ్చని ఆయన చెప్పారు. 2021 సంవత్సరంలో భారత్‌తో పాటు యూరోపియన్ మార్కెట్లలోనూ ఏకకాలంలో విడుదల చేస్తామని ఆయన తెలిపారు. రెండు వేరియంట్లలో డియాన్‌ఎక్స్ అందుబాటులో ఉంటుందని, ధర రూ.40 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. 5.4 సెకన్ల వ్యవధిలోనే ఈ మోడల్ 0-100 కిలో మీటర్ల వేగాన్ని అందుకుంటుందని చెప్పారు. ఈ ఎస్‌యూవీలో అత్యాధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇంటిగ్రేషన్ ఉంటుందని చెప్పారు.

క్రూడ్ ధరతో ముప్పే

ఆర్థిక స్థిరత్వానికి విఘాతం.. ఆర్‌బీఐ అధ్యయన నివేదిక

ముంబై: ముడి చమురు ధరల పెరుగుదలతో దేశ ఆర్థిక స్థిరత్వానికి విఘాతమేనని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) హెచ్చరించింది. క్రూడ్ ధరలు ఒక్కసారిగా పుంజుకున్న పక్షంలో కరెంట్ ఖాతా లోటు, ద్రవ్య లోటు అదుపు తప్పడంతో పాటు ధరల సూచీ మళ్లీ ఎగబాకుతుందని, గరిష్ఠ స్థాయి వృద్ధికి గండి పడుతుందని ఆర్‌బీఐ ఆర్థిక వేత్తల అధ్యయన నివేదిక పేర్కొంది. ఎందుకంటే, భారత్ ఇంధన అవసరాల కోసం ప్రధానంగా (80 శాతానికి పైగా) దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబరు)లో ముడి చమురు ధరలు 12 శాతం మేర పెరిగాయి. డిమాండ్ అనూహ్యంగా పెరగడంతో పాటు ప్రపంచ వృద్ధి పునరుద్ధరణ బాట పట్టడం, భౌగోళిక రాజకీయ సంక్షోభాలతో సరఫరా తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. అయితే, నవంబరు ద్వితీయార్థం నుంచి ముడి చమురు సెగలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. పీపా ముడి చమురు ధర 85 డాలర్లకు చేరిన పక్షంలో కరెంట్ ఖాతా లోటు 10,640 కోట్ల డాలర్లకు (జీడీపీలో 3.61 శాతం) పెరగవచ్చని అధ్యయన నివేదిక అంచనా వేసింది. పీపా ధర 10 డాలర్లు పెరిగితే లోటు 1,250 కోట్ల డాలర్లు పెరగవచ్చని, ఇది జీడీపీలో 0.43 శాతానికి సమానమని రిపోర్టు వెల్లడించింది. ఇక పీపా ముడి చమురు 65 డాలర్ల నుంచి మరో పది డాలర్లు పెరిగితే టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 0.49 శాతం మేర ఎగబాకుతుందని, 55 డాలర్ల నుంచి పది డాలర్లు పెరిగితే 0.58 శాతం పుంజుకుంటుందని ఆర్థికవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. ఒకవేళ ప్రభుత్వం చమురు ధరా భారాన్ని వినియోగదారులపైకి బదిలీ చేయని పక్షంలో ప్రతి పది డాలర్ల పెరుగుదలకు ద్రవ్య లోటు 0.43 శాతం మేర ఎగబాకుతుందని అధ్యయన నివేదిక పేర్కొంది.



ఉద్యోగ నియామకాలు పెంచాలి..

ప్రభుత్వ రంగ బ్యాంకులతో పార్లమెంటరీ స్థాయీ సంఘం.. 2019-20లో భారీగా రిటైర్మెంట్లు

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20) ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ)ని అధికారులు భారీ సంఖ్యలో పదవీ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో సిబ్బంది కొరత ఏర్పడకుండా జూనియర్, మిడ్ లెవెల్ ఉద్యోగుల నియామకాలు పెంచాలని పీఎస్‌బీలను పార్లమెంటరీ స్థాయీ సంఘం కోరింది. వచ్చే ఏడాది పీఎస్‌బీల్లోని 95 శాతం జనరల్ మేనేజర్లు (జీఎం), 75 శాతం డిప్యూటీ జీఎంలు, 58 శాతం అదనపు జీఎంలు రిటైర్ కానున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ డేటా ప్రకారం.. పీఎస్‌బీల్లోని క్లరికల్, ప్రొబేషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య తగ్గుతున్నట్లు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఫైనాన్స్ గుర్తించింది. బ్యాంకులు నియామకాలు తగ్గించడంతో పాటు పని ఒత్తిడి, దీర్ఘకాలిక పని గంటలు, ఇబ్బందికర పరిస్థితుల్లో పని చేయాల్సి రావడం వంటి అంశాలు ఉద్యోగార్థులను నిరుత్సాహపరుస్తుండవచ్చని గతవారం పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో కమిటీ పేర్కొంది. ఈ తరుణంలో ఉన్నతోద్యోగులు భారీ సంఖ్యలో పదవీ విరమణ పొందనుండటంతో సిబ్బంది కొరత ఏర్పడవచ్చని కమిటీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీరప్ప మొయిలీ ఆందోళన వ్యక్తం చేశారు.

పీఎస్‌బీలకు కమిటీ సూచనలు

- తగినంత సిబ్బందిని సమకూర్చుకునేందుకు, ప్రస్తుత ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- సీనియర్ మేనేజర్లకు మరిన్ని ప్రోత్సాహకాలతో పాటు ప్రైవేట్ రంగానికి దీటుగా మెరుగైన వేతన ప్యాకేజీలు ఆఫర్ చేయాలి.
- ఎస్‌బీఐ అధికారులకు ఇతర పీఎస్‌బీల్లోని ఉన్నత పదవులకు ప్రమోట్ చేయడమే కాకుండా ఇతర పీఎస్‌బీల్లోని అధికారులను ఎస్‌బీఐలో ఉన్నత పదవులకు సైతం ప్రమోట్ చేయాలి.



మరో 69 విదేశీ శాఖల మూసివేత!

పీఎస్‌బీలు విదేశీ కార్యకలాపాలను వీలైనంతగా తగ్గించుకునే పనిలో ఉన్నాయి. వచ్చే కొద్ది నెలల్లో మరో 69 విదేశీ శాఖలను మూసివేయడం లేదా దగ్గర్లోని మరో శాఖలో కలిపివేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. నిర్వహణ వ్యయం తగ్గించుకునే వ్యూహంలో భాగంగా గత ఏడాది పీఎస్‌బీలు విదేశాల్లోని 216 శాఖల కార్యకలాపాల పరిశీలన, హేతుబద్ధీకరణ కార్యక్రమాన్ని చేపట్టాయి. అందులో భాగంగా 35 శాఖలను ఇప్పటికే మూసివేశాయి. మరో 69 శాఖల తగ్గింపు ప్రయత్నాల్లో ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఇక కంపెనీలకూ కేవైసీ!

సీఏలు, సీఎస్‌లకు సైతం

న్యూఢిల్లీ: త్వరలో కార్పొరేట్ కంపెనీలు, చార్టర్డ్ అకౌంటెట్లు (సీఏ) కూడా కేవైసీ (వ్యక్తిగత వివరాల ధ్రువీకరణ) సమర్పించాల్సి రావచ్చు. కంపెనీలు, సీఏలతో పాటు కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీ (సీఎస్)ల నుంచి కేవైసీ వివరాలు సేకరించాలని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. యోగ్యత లేని, నిబంధనలు పాటించని కంపెనీలను, వృత్తి నిపుణులను ఏరివేసే వ్యూహంలో కేవైసీ వివరాల సేకరణ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలుస్తోంది. నల్లధన ప్రవాహానికి ప్రధాన వేదికగా మారిన డొల్ల కంపెనీలపై యుద్ధం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. గత ఏడాది కంపెనీ డైరెక్టర్ల కేవైసీ వివరాల సేకరణ ప్రక్రియను చేపట్టింది. కేవైసీ ప్రక్రియలో భాగంగా ప్రమాణాలకు లోబడి కంపెనీల పేర్లను 'ఎంసీఏ 21'లో రిజిస్టర్ చేయడం జరగదని కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఇంజెటి శ్రీనివాస్ తెలిపారు.

నగదు కొరత రానివ్వొద్దు

చాలినన్ని ఏటీఎంలు ఏర్పాటు చేయాలి: పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ : ఏదో ఒక సమస్యతో కొన్ని ఏటీఎంలు ఎప్పుడూ పని చేయకపోవడంతో ఏర్పడుతున్న 'బలవంతపు' నగదు కొరతపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆర్‌బీఐ వెంటనే చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీరప్ప మొయిలీ నాయకత్వంలోని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్థాయీ కమిటీ స్పష్టం చేసింది. ప్రజలకు నగదు కొరత లేకుండా చాలినన్ని ఏటీఎంలు ఏర్పాటు చేసేందుకు బ్యాంకులు చర్యలు తీసుకోవాలని కోరింది. 'డిజిటల్ లావాదేవీలు ఎక్కడా సార్వత్రిక స్థాయికి చేరుకోలేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేయని ఏటీఎంలు పని చేసేలా చేయడంతో పాటు మరిన్ని ఏటీఎంలు ఏర్పాటు చేయాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరాలి. అదే సమయంలో ఏటీఎంల నిర్వహణ ఆర్థికంగా గిట్టుబాటయ్యేలా ఉండాలి. ఇలా చేయడం వల్ల ప్రజలకు బలవంతపు నగదు కొరత ఏర్పడదు' అని పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో కమిటీ పేర్కొంది.

ముందు రెరాకు... ఆ తర్వాతే ఎన్‌సీఎల్‌టీకి

నరెడ్కో విజ్ఞప్తి

న్యూఢిల్లీ: స్థిరాస్తి నియంత్రణ, అభివృద్ధి చట్టం (రెరా)లో మార్పులు చేయాలని జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి (నరెడ్కో).. ప్రభుత్వాన్ని కోరింది. ముఖ్యంగా ఏదైనా ప్రాజెక్టుల అభివృద్ధికి సంబంధించి బిల్డర్ దివాలా తీస్తే.. అలాంటి కేసులను ముందుగా ఎన్‌సీఎల్‌టీలో కాకుండా 'రెరా' విచారించేలా మార్పులు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అక్కడ కూడా సమస్యకు పరిష్కారం దొరక్కపోతేనే ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించేలా చట్టంలో మార్పులు చేయాలని సూచించింది. అలాగే రెరా చట్ట నిబంధనలు దేశవ్యాప్తంగా ఒకేలా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. రెరా చట్టం అమల్లోకి వచ్చినా, స్థిరాస్తి రంగానికి సంబంధించిన కేసులు ఇంకా వినియోగదారుల కోర్టుల్లో దాఖలు కావడంపైనా నరెడ్కో ఆందోళన వ్యక్తం చేసింది. 'బిల్డర్లపై ఇప్పటికీ వినియోగదారుల కోర్టులతో పాటు రెరా కింద ఏర్పాటైన నియంత్రణ అధికార యంత్రాంగం దగ్గర కేసులు నమోదవుతున్నాయి. దీంతో గందరగోళం ఏర్పడుతోంది' అని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు నిరంజన్ హీరానందానీ చెప్పారు. కనీసం కొత్త ప్రాజెక్టుల విషయంలోనైనా, ఫిర్యాదులు రెరా చట్టం కింద ఏర్పాటైన అధికార యంత్రాంగం దగ్గర మాత్రమే నమోదయ్యేలా చట్టంలో మార్పులు చేయాలని కోరారు. ఇలా చేయడం వల్ల బిల్డర్లకు 'కోర్టు' ఖర్చులు తగ్గుతాయన్నారు.

భవనాల నాణ్యత

భవన నిర్మాణ లోపాలకు బిల్డర్‌ను బాధ్యత చేసే నిబంధనల విషయంలోనూ మార్పులు చేయాలని హీరానందానీ ప్రభుత్వాన్ని కోరారు. కట్టడాన్ని కొనుగోలుదారుకు అప్పగించిన దగ్గరి నుంచి ఐదేళ్ల వరకు ఆ భవన నిర్మాణ నాణ్యత మొత్తానికి బిల్డర్‌నే బాధ్యుడిని చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిబంధన నుంచి ఉత్పత్తిదారుల హామీ ఉండే లిఫ్టులు, జనరేటర్లను మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. సహజంగా అరుగుదల, తరుగుదల ఉండే ప్లంబింగ్, శానిటరీవేర్, ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్ పరికరాలనూ బిల్డర్ హామీ పరిధి నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పన్ను వసూళ్లు పెంచండి

ఆదాయ పన్ను శాఖ అధికారులకు సీబీడీటీ చీఫ్ ఆదేశాలు

న్యూఢిల్లీ: పన్ను వసూళ్లపై ఆదాయ పన్ను శాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యక్ష పన్ను వసూళ్లు తగ్గుముఖం పడుతున్నాయని, వీటిని పెంచేందుకు అధికారులు కృషి చేయాలని సూచించింది. ఇందుకోసం టార్గెటెడ్ సర్వేలు, ఉద్దేశపూర్వకంగా పన్నులు ఎగవేసిన వారిపై కోర్టు కేసులు నమోదు చేయటం వంటి వాటిపై దృష్టి పెట్టడం ద్వారా పన్ను వసూళ్లను పెంచుకునేందుకు కృషి చేయాలని ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్లకు సీబీడీటీ చైర్మన్ సుశీల్ చంద్ర లేఖ రాశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియటానికి రెండున్నర నెలల గడువు మాత్రమే ఉందని, పన్ను వసూళ్లలో వృద్ధి లేకపోతే ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రెగ్యులర్ అసెస్‌మెంట్ పన్నుల్లో గడచిన ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 15.6 శాతంగా ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది 1.1 శాతం తగ్గిందని ఆయన తెలిపారు. రెగ్యులర్ అసెస్‌మెంట్ పన్నుల్లో ప్రతికూల వృద్ధి నమోదు కావటమే ఇందుకు ప్రధాన కారణమని చంద్ర వెల్లడించారు. ఆదాయ పన్ను శాఖకు చెందిన అన్ని రీజియన్లలో దాదాపు ప్రతికూల వృద్ధి నమోదైందన్నారు. ఆదాయ పన్ను శాఖ అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పన్ను వసూళ్లను పెంచటంపై దృష్టి సారించాలని చంద్ర తెలిపారు.



2018, డిసెంబరు ముగిసే నాటికి పన్ను వసూళ్లలో 14.7 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా 13.6 శాతం మాత్రమే వృద్ధి నమోదైందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.11,50,000 కోట్లు వసూలు చేయాలని బడ్జెట్ అంచనాల్లో ప్రకటించారని ఆయన చెప్పారు. ప్రస్తుతం పన్ను వసూళ్లు బడ్జెట్ అంచనాల కన్నా తక్కువ స్థాయిలోనే ఉన్నాయన్నారు. నిర్దేశిత లక్ష్యాలను అందుకునేందుకు పన్ను శాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సుశీల్ చంద్ర సూచించారు.

ద్వితీయార్థం కీలకం

(జనవరి 7-11 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 10727 (-133)

నిఫ్టీ గత వారం విస్తృత స్థాయిలో 10924-10629 మధ్యన కదలాడి 133 పాయింట్ల నష్టంతో నెగెటివ్‌గా ముగిసింది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10776, 10646, 10886, 10786 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ ఒక్క 50 డీఎంఏ కన్నా మాత్రమే పైన ఉంది. మిగతా డీఎంఏలన్నింటి కన్నా దిగువనే ఉంది. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు (డెత్ క్రాస్) రావడం దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్ అయిందనేందుకు సంకేతం.
- స్వల్పకాలిక ట్రెండ్ మరోసారి సాధారణంగా మారింది. మధ్యకాలిక ట్రెండ్ బుల్లిష్‌గాను, దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్‌గాను ఉన్నాయి. ఈ వారాంతంలో 10600 దిగువన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బేరిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 10900
బ్రేక్‌డౌన్ స్థాయి: 10600

నిరోధ స్థాయిలు: 10875, 10950 (10800 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 10575, 10500 (10650 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన...

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ఉదయం మెరుగు (సోమవారానికి)

ఆస్ట్రో గైడ్

తిథి : పుష్య శుక్ల విదియ
నక్షత్రం : ఉత్తరాషాఢ

ఆర్ద్ర, స్వాతి, శతభిషం నక్షత్ర జాతకులు, కుంభ, మిథున రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 11.50; 1.49

ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 10.10 నుంచి 1.20 మధ్యలో మెరుగ్గా ట్రేడవుతూ 1.30 నుంచి చివరి వరకు తిరిగి నిస్తేజంగా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం: 10770, 10805

మద్దతు స్థాయిలు: 10685, 10650

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

గ్రహగతులివే...

- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 3 - కుంభంలోని పూర్వాభాద్ర పాదం 1 మధ్యలో చంద్ర సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 3-4 మధ్యలో రవి సంచారం
- ధనుస్సులోని మూల పాదం 1 నుంచి పూర్వాషాఢ పాదం 1 మధ్యలో బుధ సంచారం
- వృశ్చికంలోని అనూరాధ పాదం 1-2 మధ్యలో శుక్ర సంచారం
- మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 2-3 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 2లో కన్య నవాంశలో శని సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 2లో మకర నవాంశలో బృహస్పతి సంచారం
- కర్కాటకంలోని పునర్వసు పాదం 4లో రాహువు, మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2లో కేతువు సంచారం.

కొత్తగా 1,600 మంది బిజినెస్ కరస్పాండెంట్లు

ఆంధ్రా బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ : ఫైనాన్షియల్ ఇంక్లూజన్ ప్రాజెక్టులో భాగంగా 1,600 మంది బిజినెస్ కరస్పాండెంట్లను నియమించుకునేందుకు ప్రభుత్వ రంగంలోని ఆంధ్రా బ్యాంక్ రెడీ అవుతోంది. ఖాతా ప్రారంభం, ఇంటి వద్దకే బ్యాంకింగ్ సేవలు, ఏటీఎం సేవలు, మొండి బకాయిల వసూలు వంటి వాటి కోసం వీరిని నియమించుకోనున్నట్లు బ్యాంక్ తెలిపింది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఎక్కువగా బిజినెస్ కరస్పాండెంట్లను నియమించుకోనున్నట్లు పేర్కొంది. ఆంధ్రా బ్యాంక్ 2010 సంవత్సరం నుంచి బిజినెస్ కరస్పాండెంట్ మోడల్ ద్వారా మైక్రో ఏటీఎం/కియోస్క్ బ్యాంకింగ్ టెక్నాలజీ వంటి సేవలను వినియోగదారులకు అందిస్తోంది. తాజాగా ఇతర ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలైన రుణాల రికవరీ, సామాజిక పథకాల ఎన్‌రోల్‌మెంట్ స్కీమ్ వంటి సేవలను కూడా చేపడుతోంది. ఇదే సమయంలో ఆధార్, మొబైల్, పాన్ సీడింగ్, బీమా ఉత్పత్తుల విక్రయం, బ్యాంకింగ్ లావాదేవీల వంటి వాటిని బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా ఆఫర్ చేస్తోంది. ఈ నెల 31 నాటికల్లా కొత్త బిజినెస్ కరస్పాండెంట్లను నియమించుకోవాలని ఆంధ్రా బ్యాంక్ భావిస్తోంది.


రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.10 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	450	చిత్తూరు	448
వరంగల్	452	చెన్నై	455
విజయవాడ	453	నమక్కల్	440
గోదావరి	453	బెంగళూరు	452
విశాఖపట్నం	458	ముంబై	502

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	87	విజయవాడ	90
కరీంనగర్	87	గుంటూరు	91
వరంగల్	87	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	90
కర్నూలు	87	నెల్లూరు	90
విశాఖపట్నం	80	అనంతపురం	83
గోదావరి	86		

కీలక నిరోధాల్లో మరో పరీక్ష





వి సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత సోమవారం 10920 వద్ద విఫలమై కరెక్షన్‌లో పడినా కీలక మద్దతు స్థాయి 10700 వద్ద బౌన్స్‌బ్యాక్ సాధించడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. వీక్లీ చార్టుల్లో కూడా నిఫ్టీ మద్దతు స్థాయిల కన్నా పైనే క్లోజైంది. టెక్నికల్‌గా మార్కెట్లో గత రెండు నెలలుగా ప్రస్తుత స్థాయిల్లో సైడ్‌వేస్ ధోరణి కొనసాగుతోంది. ప్రధాన దిశకు సమాయత్తం అవుతున్నందున ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో బలమైన బౌన్స్‌బ్యాక్ ఏర్పడినందు వల్ల సోమవారం పాజిటివ్‌గా ప్రారంభం కావడానికే ఆస్కారం ఉంది. మరోసారి మధ్యకాలిక నిరోధం 11000 వద్ద పరీక్షకు సమాయత్తమవుతోంది. కొంత కాలంగా తరచుగా ఇక్కడే విఫలమవుతూ పరిమిత పరిధిలోనే ఉంటూ వస్తోంది. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ఇక్కడ బ్రేకౌట్ తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు : మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధ స్థాయి 10850 కన్నా పైన క్లోజ్ కావాలి. తదుపరి టార్గెట్ 11000. ఇదే స్వల్పకాలిక, మధ్యకాలిక ట్రెండ్‌ను నిర్ణయించే స్థాయి. మరింత అప్‌ట్రెండ్‌లో ప్రవేశించాలంటే రెండు రోజుల పాటు ఈ స్థాయి కన్నా పైన బలంగా క్లోజయి తీరాలి.

బేరిష్ స్థాయిలు : 10850 వద్ద విఫలమైతే మైనర్ బలహీనతకు ఆస్కారం ఉంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 10650. అంతకన్నా దిగువన క్లోజయితే మరింత బలహీనతను ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10500.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీ గత వారం మద్దతు స్థాయి 27000 కన్నా పైన రికవరీ సాధించింది. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 27500 కన్నా పైన బలంగా క్లోజయితే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 26900 కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఎదుర్కొంటుంది.

స్వల్పకాలిక వ్యూహం: స్వల్పకాలిక ఇన్వెస్టర్లు ఎంట్రీ ధరపై 3-4 శాతం మించకుండా స్టాప్‌లాస్ పెట్టుకుని స్వల్పకాలిక బై పొజిషన్లు కొనసాగించుకోవచ్చు.

పాటర్న్ : చార్టులో ఎగువకు ట్రయాంగిల్ పాటర్న్ ఏర్పడుతూ ఉండడం సానుకూలత సంకేతం. 11000 వద్ద డబుల్ టాప్ పాటర్న్ కనిపిస్తోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం దీన్ని బ్రేక్ చేయాలి. అలాగే 11000 వద్దనే అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ పైన క్లోజ్ కావాలి. అలాగే మార్కెట్ "ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా పైన ఉండడం కూడా సాధారణ పరిస్థితుల్లో తక్షణ డౌన్‌ట్రెండ్ ఉండదనేందుకు సంకేతం.

టైమ్ : ఈ సూచి ప్రకారం తదుపరి రివర్సల్స్ మంగళ, శుక్రవారాల్లో ఉన్నాయి.

సోమవారం స్థాయిలివే...

నిరోధం : 10850, 10930
మద్దతు : 10760, 10700

దివీస్ లాబ్ (రూ.1470)- కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.1470 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.1510	రెండో నిరోధం రూ.1560
రూ.1440 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.1400	రెండో మద్దతు రూ.1360

వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in

వేతనాలపై జీవనం సాగించే వారికి వివిధ రకాల పన్ను ఆదా పెట్టుబడులు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా వారు తమ పన్ను భారాన్ని తగ్గించుకోగలుగుతారు. ఆదాయపు పన్ను రాబడి పరిధి లోకి వచ్చే ప్రతీ ఒక్కరూ పన్ను ఆదా కోసం తాము చేసే పెట్టుబడుల వివరాలు యాజమాన్యాలకు అందించాల్సిన సమయం ఇదే.



పన్ను ఆదా చేసుకోండి

వేతన జీవులకు దగ్గర పడిన గడువు

పన్ను ఆదాకు సంబంధించిన పెట్టుబడుల వివరాలు ప్రకటించే సమయానికి ప్రతి ఒక్కరికీ గరిష్ఠంగా పన్ను ఆదా చేసుకునేందుకు ఏయే అవకాశాలున్నాయో తెలిసి ఉండాలి. ఇవి తెలిసి ఉన్నట్టయితే ప్రతీ ఒక్క విభాగంలోనూ గరిష్ఠంగా ప్రయోజనం పొందగల విధంగా ఇన్వెస్ట్ చేసి అధికంగా పన్ను ఆదా చేసుకోగలుగుతారు. కొన్ని రకాల అలవెన్సులు, వ్యయాలపై కూడా వేతన జీవులకు పన్ను ఆదా కల్పిస్తున్నారు.

పన్ను ప్రయోజనాలు -పెట్టుబడి ఉపకరణాలు

ఇంటి అద్దె అలవెన్సు (హెచ్ఆర్ఏ): అద్దె ఇంటిలో నివసిస్తున్న ఉద్యోగులందరికీ ఈ అలవెన్సు వర్తిస్తుంది.

ఏ) కంపెనీ నుంచి అందిన వాస్తవ హెచ్ఆర్ఏ;

బీ) వేతనంలో 40 శాతం (మెట్రో నగరాల్లో 50 శాతం),

సీ)వేతనంలో బేసిక్, డీఏ, టర్నోవర్ ఆధారిత కమీషన్ భాగంగా ఉన్నట్టయితే ఇంటి యజమానికి అందిస్తున్న వాస్తవ అద్దె నుంచి వేతనంలో పది శాతం మైనస్ చేయగా వచ్చే మొత్తం ఈ మూడింటిలో ఏది వర్తిస్తే దానిపై పన్ను మినహాయింపు ఉంటుంది.

పిల్లల విద్య అలవెన్సు: గరిష్ఠంగా ఇద్దరు పిల్లల వరకు ఒక్కొక్కరిపై నెలకు రూ.100 వంతున మినహాయింపు కల్పిస్తున్నారు.

హాస్టల్ వ్యయాల అలవెన్సు: గరిష్ఠంగా ఇద్దరు పిల్లల వరకు ఒక్కొక్కరిపై నెలకి రూ.300 వంతున మినహాయింపు కల్పిస్తున్నారు.

ఎంటర్‌టైన్‌మెంట్ అలవెన్సు: ప్రభుత్వోద్యోగులకు..

ఏ) కనీసం రూ.5,000

బీ) వేతనంలో ఐదో వంతు

సీ) వాస్తవంగా వినోదం కోసం చేసిన వ్యయం ఈ మూడింటిలో ఏది వర్తిస్తే దానిపై పన్ను మినహాయింపు ఉంటుంది. ఇతర ఉద్యోగులకు దీనిపై పూర్తిగా పన్ను విధిస్తారు.

స్టాండర్డ్ డిడక్షన్ : కనీసం రూ.40 వేలు లేదా వేతనం

ఇంటి రుణంపై వడ్డీ : ఇంటి రుణంపై చెల్లించే వడ్డీకి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంది.

కొత్త పింఛను స్కీమ్‌లో (ఎన్‌పీఎస్) పెట్టే పెట్టుబడి : ఎన్‌పీఎస్ నిర్బంధం, స్వచ్ఛందమనే రెండు భాగాలుగా ఉంటుంది.

ఉద్యోగులు చట్టబద్ధంగా అందించి తీరాల్సిన వాటా : ఇదే నిర్బంధ ఎన్‌పీఎస్‌గా పరిగణనలోకి వస్తుంది. ఈ విభాగం కింద ఇన్వెస్ట్ చేసే మొత్తంలో గరిష్ఠంగా ఏడాదికి లక్షన్నర రూపాయలు లేదా ఆర్థిక సంవత్సరంలో వాస్తవంగా చెల్లించిన మొత్తం ఏది తక్కువైతే దానిపై 80సీతో అనుసంధానమైన 80 సిసిఇ సెక్షన్ కింద మినహాయింపు ఉంటుంది.

స్వచ్ఛందంగా చెల్లించే వాటా : చట్టబద్ధంగా ఇన్వెస్ట్ చేసే వాటాకు పైబడి స్వచ్ఛందంగా జమ చేసే వాటాపై ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.50 వేలకు 80సీ సెక్షన్‌తో అనుసంధానమైన 80సిసిడి కింద పన్ను మినహాయింపు ఉంటుంది.

ప్రావిడెండ్ ఫండ్‌కు అందించే వాటా పెట్టుబడి : ఇది మూడు రకాలుగా ఉంటుంది.

ఏ) ప్రైవేటు రంగంలోని ఉద్యోగులకు వర్తింపచేసే గుర్తింపు పొందిన ప్రావిడెండు ఫండ్

బీ) జీపీఎఫ్‌గా వ్యవహరించే చట్టబద్ధమైన ప్రావిడెండ్ ఫండ్

సీ) గుర్తింపు లేని ప్రావిడెండ్ ఫండ్.

ఉద్యోగుల వాటా : వేతనంలో భాగంగా ఉండే బేసిక్ పే, డీఏ, టర్నోవర్ ఆధారిత కమీషన్ మూడింటినీ కలిపితే వచ్చే మొత్తంలో 12 శాతం వాటాకు పన్ను మినహాయింపు ఉంటుంది.

యాజమాన్యం వాటా : గుర్తింపు లేని ప్రావిడెండ్ ఫండ్‌లను మినహాయించి ఉద్యోగుల పీఎఫ్‌కు యాజమాన్యాలు అందించే వాటాకు 80 సి సెక్షన్ కింద మినహాయింపు ఉంటుంది.

పీఎఫ్‌కు జమ చేసిన వడ్డీ మొత్తం : గుర్తింపు పొందిన ప్రావిడెండ్ ఫండ్లలో పెట్టిన సొమ్ముపై వచ్చే వడ్డీరాబడిలో 9.5 శాతానికి ఆదాయపు పన్ను రాయితీ ఉంటుంది. చట్టబద్ధమైన పీఎఫ్ సంస్థలు, గుర్తింపు లేని పీఎఫ్ సంస్థల్లో పెట్టే పెట్టుబడికి పూర్తిగా మినహాయింపు ఉంటుంది.

80డీ సెక్షన్ కింద మినహాయింపులు

- సొంతానికి, భార్య, తమపై ఆధారపడిన సంతానం కోసం చెల్లించే ఆరోగ్య బీమా ప్రీమియంపై నగదు మినహా ఏ ఇతర విధానంలో చేసే చెల్లింపునకైనా రూ.25 వేలు లేదా భార్యాభర్తలిద్దరూ సీనియర్ సిటిజన్‌లై ఉంటే రూ.50 వేలకు మినహాయింపు ఉంది. అలాగే తల్లిదండ్రుల కోసం చెల్లించే ఆరోగ్య బీమా ప్రీమియంపై రూ.25 వేలు లేదా సీనియర్ సిటిజన్లయితే రూ.50 వేలకు మినహాయింపు ఉంది. ప్రభుత్వోద్యోగులైతే కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకానికి చేసే చెల్లింపులు, పివెంటివ్ హెల్త్ చెకప్ కోసం చేసే వ్యయంలో రూ.5,000 మొత్తానికి కూడా పన్ను మినహాయింపు ఉంది.

80ఈ : పూర్తి కాలపరిమితికి చెందిన (ఫుల్ టైమ్) గ్రాడ్యుయేషన్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు కోసం తీసుకున్న రుణంపై చెల్లించే వడ్డీకి (అసలుకు వర్తించదు) ఈ సెక్షన్ మినహాయింపు ఇస్తుంది.

80జీ : దాతృత్వ సంస్థలు, స్వచ్ఛంద సహాయ సంస్థలకు ఇచ్చే విరాళాలపై ఆ సంస్థ స్వభావాన్ని బట్టి 50 శాతం నుంచి నూరు శాతం మొత్తంపై పన్ను మినహాయింపు ఉంటుంది. పలు విరాళాల విషయంలో స్థూల ఆదాయంలో 10 శాతం మించకుండా ఇచ్చే మొత్తం పైనే ఇది వర్తిస్తుంది.

80సీ సెక్షన్ కింద మినహాయింపులు

- పాలసీదారు వారి భార్య/భర్త, పిల్లల కోసం చేసే బీమా మొత్తంలో పది శాతం మొత్తంపై చెల్లించే ప్రీమియం
- పెన్షన్ ప్లాన్లు, డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్లు, యులిప్‌లలో పెట్టిన పెట్టుబడి
- ప్రభుత్వోద్యోగులైతే తన కోసం తీసుకునే డిఫర్డ్ యాన్యువిటీ ప్లాన్, భార్య, పిల్లల కోసం చేసే కేటాయింపులపై వారికి చెల్లించే వేతనంలో 20 శాతానికి లోబడి
- ఇంటి రుణం పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల లోపు ఇల్లు ఉద్యోగి చేతికి వచ్చిన కేసుల్లో ఇంటి రుణంపై చెల్లించే అసలు
- పైన చర్చించిన విధంగా ఇపీఎఫ్‌కు చెల్లించే వాటా
- ఇద్దరు పిల్లల పరిమితికి లోబడి ప్రతీ ఆర్థిక సంవత్సరంలోను చెల్లించే ట్యూషన్ ఫీజు (డెవలప్‌మెంట్ ఫీజు, డొనేషన్ మినహా)
- స్వయంగాను, భార్య, పిల్లల కోసం చేసే పీపీఎఫ్ పెట్టుబడి
- నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ల కొనుగోలుకు చేసిన పెట్టుబడి
- ఐదేళ్ల పోస్టల్ డిపాజిట్‌కు చేసిన పెట్టుబడి
- షెడ్యూల్డు బ్యాంకుల్లో 5 ఏళ్ల కాలపరిమితి గల ప్రకటిన ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పెట్టిన పెట్టుబడి
- ఈఎల్ఎస్ఎస్ లేదా ఏదైనా అధీకృత సూపర్ యాన్యువేషన్ ఫండ్‌లో పెట్టే పెట్టుబడి
- ఇద్దరు కుమార్తెల పరిమితికి లోబడి సుకన్య సమృద్ధి యోజనలో పెట్టే పెట్టుబడి
- 5ఏళ్ల కాలపరిమితి గల వయోవృద్ధుల పొదుపు పథకం (ఎస్‌సిఎస్ఎస్)

మరిన్ని మార్గాలు..

పైన పేర్కొన్న పన్ను ఆదా సాధనాలు కాకుండా అంతగా తెలియనివి కూడా మరి కొన్ని ఉన్నాయి.

పిల్లల ప్రీ నర్సరీ ఫీజులు : ఇద్దరు పిల్లల పరిమితికి లోబడి ప్లేగ్రూప్, ప్రీ నర్సరీ, నర్సరీ క్లాసులకు చెల్లించే ఫీజులపై 80 సి సెక్షన్ కింద మినహాయింపు ఉంది. ఈ విభాగం కింద లక్షన్నర రూపాయల పరిమితికి లోబడి మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.

స్టాంప్ డ్యూటీ : కొనుగోలు చేసిన ఇంటిపై చెల్లించే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు రెండింటికీ 80సి సెక్షన్ కింద పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. గరిష్ఠంగా లక్షన్నర రూపాయల వరకు మినహాయింపును అనుమతిస్తారు. ఇవి ఏ ఆర్థిక సంవత్సరంలో చేసే ఆ సంవత్సరంలోనే క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. తదుపరి సంవత్సరంలో క్లెయిమ్ అవకాశం ఉండదు.

తల్లిదండ్రులకు చెల్లించే వడ్డీ : బ్యాంకులు, ఆర్థిక సహాయ సంస్థల నుంచి ఇంటి కొనుగోలు కోసం తీసుకున్న రుణం పైనే కాకుండా తల్లిదండ్రుల నుంచి ఏమైనా సొమ్ము రుణంగా పొందగలిగితే దానిపై వారికి చెల్లించే వడ్డీకి కూడా 24 బి సెక్షన్ కింద గరిష్ఠంగా రెండు లక్షల రూపాయల వరకు మినహాయింపు పొందవచ్చు.

తల్లిదండ్రులకు చెల్లించే అద్దె : తల్లిదండ్రులు యజమానులుగా ఉన్న ఇంటిలోనే అద్దె కుంటున్నట్టయితే దానికి చెల్లించే అద్దెపై కూడా 10 (13ఏ) సెక్షన్ కింద మినహాయింపు పొందవచ్చు. అయితే దీన్ని డాక్యుమెంట్ చేయించాల్సి ఉంటుంది. అద్దెకు ఉంటున్న వారు దీనికి హెచ్ఆర్ఏ మినహాయింపు పొందితే అద్దె తీసుకుంటున్న తల్లిదండ్రులు వారు చెల్లించే మునిసిపల్ పన్నులకు మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. స్టాండర్డ్ డిడక్షన్ కూడా వర్తిస్తుంది. ఆ రకంగా కుటుంబం మొత్తానికి ఆదా అవుతుంది.

గ్రూప్ ఇన్సూరెన్స్ ప్రీమియం : యాజమాన్యాలు అందించే గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లో ఉద్యోగి తనకు, భార్యా పిల్లలకు చెల్లించే ప్రీమియంపై 80డీ సెక్షన్ కింద గరిష్ఠంగా రూ.75 వేల వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు.

తల్లిదండ్రుల వైద్య చికిత్స వ్యయాలు : ఉద్యోగులు తమ తల్లిదండ్రులకు చేయించే వైద్య చికిత్సలకు అయ్యే వ్యయంపై ఏడాదికి రూ.50 వేల గరిష్ఠ పరిమితికి లోబడి 80డీ సెక్షన్ కింద పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు.

కొత్త ఏడాదిలో ఈ తేదీలు ముఖ్యం



జనవరి : పటిష్ఠమైన ప్లానింగ్ చేసుకోవాలి. ప్రతి ఒక్క పెట్టుబడి లేదా లక్ష్యానికి ఒక తేదీ నిర్ణయించుకోవడం, నిర్దిష్ట కాలపరిమితిలో గరిష్ఠ ప్రయోజనం సమకూర్చే సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడానికి ఈ ప్రణాళిక దోహదపడుతుంది.

ఫిబ్రవరి : మీ స్వల్పకాలిక, దీర్ఘకాలిక పెట్టుబడి ఆలోచనలు, వ్యూహాలను వాలెంటైన్స్ డే సందర్భంగా జీవిత భాగస్వామితో పంచుకోండి. మీ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులను ఇద్దరూ కలిసి నిర్ణయించండి.
- తేదీ 1 : బడ్జెట్ ప్రతిపాదన
- తేదీ 6 : ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం

మార్చి : 15: ఈ ఆర్థిక సంవత్సరానికి (2018-19) అడ్వాన్స్ టాక్స్ నాలుగో విడత వాయిదా చెల్లింపు చివరి తేదీ
- తేదీ 31 : పాన్, ఆధార్ అనుసంధానానికి తుది గడువు
- 2017-18 సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్న్‌లు రూ.10 వేలు ఫైన్‌తో కలిపి దాఖలు చేసేందుకు తుది గడువు

ఏప్రిల్ 1 : ఫిజికల్ షేర్లను డీమ్యాట్ చేయించుకునేందుకు చివరి తేదీ

మే 7 - అక్షయ తృతీయ

జూన్ : ఆర్థిక లక్ష్యాల్లో ఏ విధంగా ముందుకు సాగుతున్నారో ఒకసారి సంవత్సర మధ్యంతర సమీక్ష చేసుకోండి. లోటుపాట్లుంటే దిద్దుకోండి.
- తేదీ 5: ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం
- తేదీ 15 : 2019-20 ఆర్థిక సంవత్సరానికి తొలి వాయిదా అడ్వాన్స్ టాక్స్ చెల్లింపునకు తుది గడువు

జూలై 31 : ఆదాయపు పన్ను రిటర్న్‌ల దాఖలుకు చివరి తేదీ. ఈ గడువు దాటి దాఖలు చేస్తే డిసెంబరు 31లోగా అయితే రూ.5 వేలు, ఆ తేదీ కూడా దాటితే రూ.10 వేలు ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది.

ఆగస్టు 7 : ఆర్‌బీఐ మానిటరీ పాలసీ సమావేశం

సెప్టెంబరు 15 : 2019-20 ఆర్థిక సంవత్సరానికి అడ్వాన్స్ టాక్స్ రెండో వాయిదా చెల్లింపునకు చివరి తేదీ

అక్టోబరు 9 : ఆర్‌బీఐ మానిటరీ పాలసీ సమావేశం
- తేదీ 25 : ధన త్రయోదశి

నవంబరు 14 : బాలల దినోత్సవం, పిల్లల కోసం పెట్టుబడులు, బీమా ప్రణాళికలు రూపొందించుకోవచ్చు.

డిసెంబరు 4: ఆర్‌బీఐ మానిటరీ పాలసీ సమావేశం

డిసెంబరు 15 : 2019-20 ఆర్థిక సంవత్సరానికి అడ్వాన్స్ టాక్స్ మూడో వాయిదా చెల్లింపునకు చివరి తేదీ



అధిక రాబడి + పన్ను ఆదా = ఈఎల్ఎస్ఎస్

భారత రిటైల్ ఇన్వెస్టర్లకు పన్ను ఆదా చేసే సాధనాలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. వీటిని ఎవరూ సమర్థవంతంగా వినియోగించుకోవడంలేదు. చక్కని అవగాహనతో ఇన్వెస్ట్ చేసినట్టయితే ఇవి పన్ను లాభాలు అందించడంతో పాటు అధిక రాబడులు కూడా అందచేస్తాయి. అసలు ఈఎల్ఎస్ఎస్ అంటే ఏమిటి, వాటిలో ఎలా ఇన్వెస్ట్ చేయాలి వంటి అంశాలు వివరిస్తున్నారు ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం బ్యాంక్ బజార్ సీఈఓ అదిల్ షెట్టి.



ఈఎల్ఎస్ఎస్ ఏమిటి?

ఇది ఒక రకమైన డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్. సాధారణ పరిభాషలో వీటిని పన్ను ఆదాకు ఉపయోగపడే మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లుగా వ్యవహరిస్తారు. వీటిలో ఇన్వెస్ట్ చేసే సొమ్ముపై 1961 ఆదాయపు పన్ను చట్టం 80 సి సెక్షన్ కింద పన్ను మినహాయింపు పొందవచ్చు. భిన్న రంగాలకు చెందిన ఈక్విటీ షేర్లు ఇందులో భాగంగా ఉంటాయి. ఇన్వెస్టర్ల నుంచి సమీకరించిన సొమ్ములో 80 శాతం మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ఈక్విటీ, ఈక్విటీ అనుసంధానిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తూ ఉంటాయి.

ఎందుకు ఇవి ఉత్తమం?

ఇవి ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే ఎందుకు ఉత్తమం అనే ప్రశ్న రావచ్చు. ప్రారంభ దశలోని ఇన్వెస్టర్లకు ఇవి దీర్ఘకాలంలో అత్యధిక రాబడులు అందిస్తాయి. ఈక్విటీ రాబడులకు కంపెనీలు ఎలాంటి గ్యారంటీ ఇవ్వకపోయినా ఈ ఫండ్‌లలో మూడు సంవత్సరాలు నిలకడగా పెట్టుబడి పెట్టినట్టయితే 11 శాతం, ఐదు సంవత్సరాల కాలం పాటు పెట్టిన పెట్టుబడిపై 16 శాతం వరకు రాబడులు అందించిన చరిత్ర ఉంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పీపీఎఫ్, ఇతర పెట్టుబడి సాధనాలు అందిస్తున్న రాబడులు 8 శాతం కన్నా ఇది చాలా మెరుగైన రాబడి.



లాకిన్ కాలపరిమితి తక్కువ

పీపీఎఫ్, పన్ను ఆదా చేసే ఎఫ్‌డిలు, ఎన్ఎస్‌సీల వంటి ప్రముఖ సాధనాలతో పోల్చితే ఈఎల్ఎస్ఎస్‌ల లాకిన్ కాలపరిమితి తక్కువ. మిగతా మూడింటికీ మెచ్యూరిటీ కాలపరిమితి 15.5 సంవత్సరాలు కాగా ఈఎల్ఎస్ఎస్‌ల కాలపరిమితి మూడు సంవత్సరాలే.

గరిష్ఠ పరిమితి ఎంత?

80సీ సెక్షన్ నిబంధనల ప్రకారం ఈఎల్ఎస్ఎస్‌లలో ఏడాదికి గరిష్ఠంగా లక్షన్నర రూపాయల వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు. ఈఎల్ఎస్ఎస్‌లో మీరు పెట్టే అసలుకు ఇది వర్తిస్తుంది. అయితే ఈఎల్ఎస్ఎస్‌లలో పెట్టిన పెట్టుబడిపై వచ్చే రాబడికి పాక్షికంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. 2018 బడ్జెట్ ప్రకారం ఈఎల్ఎస్ఎస్‌లలో పెట్టుబడి ఏడాదికి లక్ష రూపాయలు దాటితే 10 శాతం వర్తిస్తుంది. లక్ష రూపాయలు, ఆ లోపు పెట్టుబడులకు ఎలాంటి పన్ను ఉండదు.

దరఖాస్తు చేయడం తేలిక

ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడికి దరఖాస్తు చేయడం కూడా చాలా తేలిక. పెద్దగా పేపర్ వర్క్ కూడా ఏమీ ఉండదు. మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా ఇన్వెస్ట్ చేయవచ్చు లేదా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు ఫారం నింపి కెవైసీ నిబంధనలకు అనుగుణంగా వివరాలందించి ఇన్వెస్ట్ చేయవచ్చు. పెట్టుబడి పెరుగుదల ధోరణులు కూడా ఆన్‌లైన్‌లోనే చెక్ చేసుకోవచ్చు.

మీ బడ్జెట్‌కు అనుగుణంగా పెట్టుబడి

వివిధ మ్యూచువల్ ఫండ్లలాగే ఈఎల్ఎస్ఎస్‌లో రెండు మార్గాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఏకకాలంలో పెద్ద మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయడం ఒకటైతే క్రమానుగత పెట్టుబడి విధానంలో (ఎస్ఐపి) కూడా ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉంది. నెలకు కనీసం రూ.500 నుంచి ఎంత మొత్తంలో అయినా గరిష్ఠ పరిమితికి లోబడి ఇన్వెస్ట్ చేసే వెసులుబాటు ఉంది.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్

ఈఎల్ఎస్ఎస్‌ల విభాగంలోని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్ (టాక్స్ సేవింగ్) పదేళ్ల కాలపరిమితిలో మంచి పనితీరును ప్రదర్శించింది. ఇది మల్టీ క్యాప్, విలువ ఆధారిత పెట్టుబడి వ్యూహంతో నడుస్తోంది. నిఫ్టీ 50 పదేళ్ల కాలపరిమితిలో అందించిన స్థూల సగటు రాబడి వృద్ధిరేటు 14.31 శాతం ఉండగా ఈ ఫండ్ 19.53 శాతం రాబడిని అందించింది. ఈ ఫండ్ ప్రారంభించిన తేదీ నుంచి ఇప్పటికి అందించిన స్థూల సగటు రాబడి 20.36 శాతం ఉంది. ఎస్ఐపీలో క్రమం తప్పకుండా ప్రతీ నెలా రూ.10 వేలు ఇన్వెస్ట్ చేస్తే ఆ మొత్తం మూడు సంవత్సరాలకు 4.7 లక్షలు, ఏడు సంవత్సరాలకు రూ.27.3 లక్షలు, పదేళ్ల కాలానికి రూ.27.3 లక్షలు, 15 సంవత్సరాల కాలానికి రూ.67.3 లక్షలు రాబడి వచ్చింది.

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ స్మార్ట్ యాన్యూటీ ప్లాన్

ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ స్మార్ట్ యాన్యూటీ ప్లాన్‌ను విడుదల చేసింది. ఇది సింగిల్ ప్రీమియం, నాన్ లింక్డ్ నాన్ పార్టిసిపేటింగ్ యాన్యూటీ ప్లాన్. రిటైర్‌మెంట్ తర్వాత గ్యారెంటీగా జీవిత కాలం పాటు ఆదాయం కావాలనుకునే వారిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్లాన్‌ను కంపెనీ తీసుకువచ్చింది. ఈ ప్లాన్‌లో మూడు యాన్యూటీ అప్షన్లు కూడా ఉన్నట్టు సంస్థ తెలిపింది. ఈ ప్లాన్‌లో కనీస ప్రవేశ వయసు 45 సంవత్సరాలు. ఇందులో వన్‌టైమ్ కనీస పెట్టుబడి రూ.47,962. ఈ ప్రీమియంకు ఆదాయ పన్ను చట్టంలోని 80సీసీసీ కింద పన్ను మినహాయింపు ఉంటుందని కంపెనీ తెలిపింది.

క్యాట్‌లో మెరిసిన తెలంగాణ తేజం

» 95.95 శాతం మార్కులతో రికార్డు



హైదరాబాద్, జనవరి 6 : పదహారవ ఏటనే తెలంగాణకు చెందిన అత్యంత పిన్నవయస్కురాలైన ఇంజనీర్‌గా ఆమె రికార్డు సృష్టించింది. ఏడాది గడవగానే ఆమె మరో మైలురాయిని అందుకుంది. ఈ ఏడాది నిర్వహించిన క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) పరీక్షలో హైదరాబాద్‌కు చెందిన సంహిత కాశీభట్ల 95.95 మార్కులు పొందింది. సాధారణంగా ఈ పరీక్షలో పాస్ కావడం అంత సులభం కాదు. ఆమె సీనియర్లే ఒకటి కన్నా ఎక్కువ ప్రయత్నాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. అలాంటిది ఒకే ప్రయత్నంలో క్యాట్‌లో ఆమె నెగ్గడం విశేషం. ఈ సందర్భంగా సంహిత మాట్లాడుతూ.. తాను సాధించిన స్కోరుతో తనకు ఐఐఎం కోచి, లఖ్‌నవూ, కోజికోడ్‌లో సీటు వస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొంది. ఫినాన్స్ అంటే తనకు ఇష్టమైన సబ్జెక్టని తెలిపింది. పరీక్షకు ముందు కార్టూన్ వీడియోలు చూస్తూ గడిపానని చెప్పింది. చార్టర్ట్ ఫినాన్షియల్ అనలిస్ట్ ప్రోగ్రామ్ (అమెరికాకు చెందిన సీఎఫ్ఏ ఇన్‌స్టిట్యూట్.. అంతర్జాతీయంగా అందించే వృత్తివిద్యా కోర్సు) లెవల్-1 పరీక్షలు పాస్ కావడమే తన ధ్యేయమని సంహిత వెల్లడించింది. తమ కుమార్తె సాధించిన విజయం పట్ల తమకు ఎంతో గర్వంగా ఉందని ఆమె తల్లిదండ్రులు ఎల్ఎన్ కాశీభట్ల, గీతా చతుర్వేదుల హర్షం వ్యక్తం చేశారు.

రైల్వే స్టేషన్‌లో 20 నిమిషాల ముందే ఉండాలి

న్యూఢిల్లీ, జనవరి 6: ఎక్కాల్సిన రైలు ఎప్పుడూ కాస్త లేటే కదా అని రైల్వే స్టేషన్‌కు సరిగ్గా సమయానికి వెళ్లడం ఇక ముందు కుదరదు. రైలు బయల్దేరే 15-20 నిమిషాల ముందే ప్రయాణికులు రైల్వేస్టేషన్లో సిద్ధంగా ఉండాల్సి ఉంటుం ది. రైల్వే స్టేషన్లు, రైళ్ల కోసం సమీకృత భద్రత వ్యవస్థ లో భాగంగా తీసుకున్న కీలక నిర్ణయం ఇది! భద్రతపై విమానాశ్రయాల్లో అనుసరిస్తున్న విధానాన్నే పాటించనున్నారు. దీంతో రైల్వే స్టేషన్‌కు 15-20 నిమిషాల ముందే చేరుకున్న ప్రయాణికులను ఆపాదమస్తకం తనిఖీ చేస్తారు. ఆ తర్వాతే రైలు ఎక్కేందుకు అనుమతిస్తారు. ఈ విధానాన్ని ఇప్పటికే యూపీలోని అలహాబాద్, కర్ణాటకలోని హుబ్లీ స్టేషన్లలో అమలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 202 స్టేషన్లలో అమలు చేసేందు కు నమూనా సిద్ధం చేసినట్లు రైల్వే భద్రతా దళం డైరెక్టర్ జనరల్ అరుణ్ కుమార్ వెల్లడించారు. స్టేషన్లను పూర్తిగా భద్రతా వలయంలోకి తీసుకొస్తామన్నారు. ఎంపిక చేసుకున్న చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసి ఆర్పీఎఫ్ బృందాలను మోహరిస్తామని చెప్పారు. ప్రతి ప్ర వేశ ద్వారం వద్ద ర్యాండమ్ చెకింగ్ ఉంటుందన్నారు. సమీకృత భద్రత వ్యవస్థలో భాగంగా స్టేషన్లలో సీసీ కెమెరాలు, యాక్సెస్ కంట్రోల్ విధానం, భద్రత సిబ్బం ది, బ్యాగేజ్ స్కానింగ్, బాంబ్ డిటెక్షన్ విధానాలు ఉంటాయి. స్టేషన్లలో భద్రతను పెంచేందుకు సమీకృత భద్రత వ్యవస్థ ప్రాజెక్టును 2016లో కేంద్రం రూ.385 కోట్లతో అమలులోకి తెచ్చింది.

రక్షణ మంత్రి అబద్ధాల కోరు!

హాల్‌కు లక్ష కోట్ల ఆర్డర్లు ఎక్కడ?.. నిరూపిస్తారా? రాజీనామా చేస్తారా?

» నిర్మలను నిలదీసిన రాహుల్‌గాంధీ

» ఆర్డర్లు ఇచ్చేసినట్లు చెప్పానా?

» సారీ చెబుతారా? రాజీనామా చేస్తారా?

» ఘాటుగా బదులిచ్చిన సీతారామన్

"మీరు ఒక అబద్ధం ఆడితే దాన్ని కప్పిపుచ్చుకోవడానికి వంద అబద్ధాలు ఆడాల్సి ఉంటుంది. మోదీని కాపాడే ఆత్రుతలో రక్షణ మంత్రి లోక్‌సభలో అబద్ధపు ప్రకటన చేశారు. లక్ష కోట్ల ఆర్డర్లకు ఆధారం చూపాలి. లేదా రాజీనామా చేయాలి"
- రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు

"రాహుల్ ఏబీసీ నుంచి మొదలు పెట్టాలి. ఆ పత్రిక కథనంలో ఏముందో చివరిదాకా చదవకుండానే కోట్ చేస్తే ఎలా? అబద్ధాలు ప్రచారం చేసినందుకు ఆయన క్షమాపణ చెబుతారా? రాజీనామా చేస్తారా?"
- నిర్మలా సీతారామన్, రక్షణ మంత్రి





న్యూఢిల్లీ, జనవరి 6: 'రాఫెల్' కుంభకోణంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ల మధ్య ఆదివారం ట్వీట్ల యుద్ధం నడిచింది. ఇద్దరూ పరస్పరం రాజీనామాలకు డిమాండ్లు చేసుకున్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు లక్ష కోట్ల రూపాయల వర్క్ ఆర్డర్లు ఇవ్వనున్నట్లు శుక్రవారం లోక్‌సభలో నిర్మల చేసిన ప్రకటన పచ్చి అబద్ధమని రాహుల్‌గాంధీ ఆరోపించారు. లక్ష కోట్ల ఆర్డర్ నిజమైతే పత్రాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. పెట్టలేకపోతే ఆమె రాజీనామా చేయాలన్నారు. "మీరు ఒక అబద్ధం ఆడితే దాన్ని కప్పిపుచ్చుకోవడానికి వంద అబద్ధాలు ఆడాల్సి ఉంటుంది. ప్రధానిని కాపాడే ఆత్రుతలో నిర్మల లోక్‌సభలో అబద్ధం చెప్పారు" అన్నారు. రక్షణ శాఖ నుంచి హాల్‌కు ఒక్క పైసా ఆర్డర్ రాలేదంటూ టైమ్స్ ఆఫ్ ఇండియా రాసిన కథనాన్ని కోట్ చేస్తూ ఆయన ట్వీట్లు పెట్టారు. రూ.50 వేల కోట్లతో 83 ఎల్‌సీఏలు, 3000 కోట్లతో 15 యుద్ధ రంగ హెలికాప్టర్లు, 20 వేల కోట్లతో ఇతర రకాలైన 200 హెలికాప్టర్లు, 3400 కోట్లతో 19 సరకు రవాణా విమానాలు, 15 వేల కోట్లతో సరకు రవాణా హెలికాప్టర్లు, 8400 కోట్లతో విమాన ఇంజిన్లను హాల్ నుంచి కొనడానికి ఆదేశాలు సిద్ధమవుతున్నాయని నిర్మల శుక్రవారం లోక్‌సభలో ప్రకటించారు. నిర్మల పేర్కొన్న జాబితాలోని కొన్ని అంశాలకు మాత్రమే కొంత కదలిక వచ్చిందని టైమ్స్ కథనం పేర్కొంది. "కొన్నింటిని కొనాల్సిన అవసరం ఉందని ప్రాథమిక అవగాహనకు వచ్చారు. రక్షణ కొనుగోళ్ల మండలి అనుమతి ఇచ్చింది. ఇదంతా ప్రాథమిక అనుమతిలో భాగం. తుది అనుమతులేవీ రాలేదు" అని పేర్కొన్నది. "హాల్ ప్రస్తుతం జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉంది. ఇటీవలే జీతాల కోసం వెయ్యి కోట్లు అప్పు తెచ్చారు. వైమానిక దళం వందల కోట్ల రూపాయల బకాయిలే చెల్లించడం లేదు" అని తెలిపింది. లక్ష కోట్ల రూపాయల ఆర్డర్ గురించి కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించగా "మాది లిస్టెడ్ కంపెనీ. ఆర్డర్ పుస్తకాలను ఎవరైనా తనిఖీ చేసుకోవచ్చు. లక్ష కోట్ల ఆర్డరులో ఒక్క పైసా కంపెనీ చేతికి రాలేదు" అని బదులిచ్చినట్లు పత్రిక పేర్కొంది. హాల్‌కు ఇప్పటివరకు 73 అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల ఆర్డర్ మాత్రమే వచ్చిందని, హెలికాప్టర్ విలువ రూ.70 కోట్లని, అందుకు సంబంధించి కొంత అడ్వాన్స్ ముట్టిందని ఒక అధికారి పత్రికకు వెల్లడించారు. రాఫెల్ యుద్ధ విమానాల కాంట్రాక్టును రిలయన్స్ డిఫెన్స్‌కు కట్టబెట్టడం వల్ల ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు జరిగిన అన్యాయంపై శుక్రవారం విపక్షాలు లోక్‌సభలో ధ్వజమెత్తగా, హాల్‌కు లక్ష కోట్ల రూపాయల విలువైన ఆర్డర్లు ఇస్తున్నట్లు రక్షణమంత్రి బదులిచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం ట్వీట్ల యుద్ధం నడిచింది. తన రాజీనామా డిమాండ్‌పై నిర్మల భగ్గుమన్నారు. "రాహుల్‌గాంధీ రాజకీయాలే అబద్ధాల పునాదిగా నిర్మితమయ్యాయి. రాఫెల్ డీల్‌పై ఆయన ప్రజల్లో అపోహలు సృష్టించారు. సుప్రీంకోర్టు వాటిని పటాపంచలు చేసింది. రాహుల్ ఇంకా దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది సిగ్గు చేటు. మీరు ఏ పత్రిక కథనాన్ని ఆధారంగా చూపుతున్నారో దాన్ని ఆసాంతం చదవండి" అని నిర్మల సూచించారు. "హాల్‌కు ఆర్డర్లు ఇస్తూ సంతకం చేసినట్లు నేను ఎక్కడా ప్రసంగంలో పేర్కొనలేదు. ఆర్డర్లు పైప్‌లైన్లో ఉన్నట్లు మాత్రమే చెప్పాను. ఆ విషయాన్ని పత్రిక కూడా రాసింది" అంటూ ట్వీట్ చేశారు. "రాహుల్ అబద్ధాలు ప్రచారం చేసినందుకు లోక్‌సభలో క్షమాపణ చెబుతారా? రాజీనామా చేస్తారా?" అని ప్రశించారు.

కాంగ్రెస్‌కు 'రాఫెల్' పత్రాలెక్కడివి..?

» కీలక పత్రాలెలా అందుతున్నాయ్?

» బీజేపీ వర్గాల్లో అయోమయం

» పార్టీ నేతలే ఉప్పందిస్తున్నారా?

» ఢిల్లీ రాజకీయ వర్గాల్లో చర్చ



న్యూఢిల్లీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రక్షణ శాఖకు సంబంధించిన కీలక పత్రాలు..! వివాదాస్పద రాఫెల్ ఒప్పందానికి సంబంధించిన రహస్య డాక్యుమెంట్లు! రాఫెల్ ఒప్పందంలో కుంభకోణం జరిగిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ అందుకు సాక్ష్యాధారాలుగా రహస్య, కీలకమైన పత్రాలను విడుదల చేస్తోంది. అసలు అవి కాంగ్రెస్ చేతికి ఎలా చిక్కుతున్నాయో అర్థం కాక బీజేపీ నేతలు, ప్రభుత్వ వర్గాలు అయోమయానికి గురవుతున్నారు. ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను బయట పెట్టాలని పార్లమెంటు లోపల, వెలుపల ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుంటే.. అవి దేశ రక్షణకు సంబంధించినవి కాబట్టి బహిర్గతం చేయలేమని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ఇటీవల సుప్రీంకోర్టులో ఈ ఒప్పందంపై విచారణ జరిగిన సందర్భంలో కూడా ప్రభుత్వం సీల్డ్ కవర్‌లో పత్రాలను అందించింది. అలాంటి పత్రాలు కాంగ్రెస్ చేతికి ఎలా వస్తున్నాయన్న ప్రశ్న అన్ని వర్గాల్లో ఉత్పన్నమవుతోంది. అయితే ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వైఖరితో అసంతృప్తిగా ఉన్న బీజేపీలోని కీలక నేతలే ఈ పత్రాలను కాంగ్రెస్ నేతలకు ఇస్తున్నారని ఢిల్లీ రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఈ అంశంపై ప్రధానంగా పోరాటం చేస్తున్న నేపథ్యంలో సాక్ష్యాధారాలు బయటపెడితే మోదీ, అమిత్ షా మరింత ఇబ్బందుల్లో పడతారు కాబట్టి బీజేపీలోని ఓ వర్గమే ఇలా చేస్తోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గోవా మంత్రి విశ్వజిత్ రాణే ఫోన్ కాల్ రికార్డింగ్ లీక్ అవడం కూడా ఇదే కోవలోకి వస్తుందని అంటున్నారు. మరోవైపు రక్షణ శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కూడా కాంగ్రెస్‌కు సమాచారం అందుతోందని చెబుతున్నారు.

అట్టుడుకుతున్న కేరళ

» కొనసాగుతున్న ఆందోళనలు

» ఢిల్లీలో బీజేపీ నేతల ధర్నా

» నేడు ఎంపీల ఆందోళన



అట్టుడుకుతున్న కన్నూరులో పోలీసు మార్చ్

తిరువనంతపురం, జనవరి 6: యుద్ధభూమిగా మారిన దేవభూమి కేరళలో పరిస్థితులింకా అదుపులోకి రాలేదు. ఓవైపు పోలీసులు శాంతి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నా.. ఆ వెంటనే బాంబు దాడులు, భౌతిక దాడులు చోటుచేసుకుంటుండటంతో శాంతిభద్రతలు గతి తప్పుతున్నాయి. ముఖ్యంగా మతపరంగా సున్నిత ప్రాంతమైన కన్నూరు జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అటు మైదాన జిల్లా పాలక్కడ్‌లోనూ ఆందోళనలకు అడ్డుకట్టపడటం లేదు. డీజీపీ లోక్‌నాథ్ బెహరా ఆదేశాల మేరకు కన్నూరు పోలీసులు శనివారం సాయంత్రం సీపీఎం, బీజేపీ నేతల మధ్య సయోధ్యకు శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తామిక అల్లర్ల జోలికి వెళ్లబోమంటూ ఇరుపక్షాల నేతలు వాగ్దానం చేసినా.. సమావేశం ముగిసిన కొద్ది సేపట్లోనే.. ఇళ్లు, దుకాణాలపై దాడులు ప్రారంభ వ ం య య్యా ం ి. రాత్రంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆదివారం ఉదయం వరకూ అల్లర్లు కొనసాగాయి. బీజేపీ, సీపీఎం కార్యకర్తలు పరస్పరం దాడులకు దిగారు. ముఖ్య నేతల ఇళ్లపై దాడులు జరిపారు. ఆదివారం ఉదయం కన్నూరులోని థలస్సేరీ ప్రాంతంలో నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం నాయకుడి ఇంటిపై ఆందోళనకారులు బాంబుతో దాడి చేశారు. అల్లర్ల పాపమంతా బీజేపీ, ఆరెస్సెస్‌లదేనని సీపీఎం వర్గాలు, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెబుతుండగా.. సీఎం చేతగాని తనంతోనే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కాగా.. ఆదివారం ఢిల్లీలోని కేరళ హౌస్ ఎదుట బీజేపీ వర్గాలు ధర్నా నిర్వహించాయి. అటు బీజేపీ ఎంపీలు కూడా సోమవారం ఉదయం పార్లమెంటు ఆవరణలో ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు కేరళ సర్కారు తీరుపై నాయర్ సర్వీస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్) తీవ్రంగా స్పందించింది. 'కేరళ ప్రభుత్వం నాస్తికవాదాన్ని జనంపై రుద్దే ప్రయత్నం చేస్తోంది. అధికార సీపీఎం తీరు ప్రజల మత విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయి. శబరిమలలో సనాతన సంప్రదాయాల పరిరక్షణకు మేం చేస్తున్న నిరసనలకు రాజకీయ రంగు పులుముతున్నారు. అయ్యప్ప భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా శబరిమల పరిసరాల్లో పోలీసులతో బలప్రయోగం చేస్తున్నారు' అని ఎన్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి జి.సుకుమారన్ నాయర్ దుయ్యబట్టారు.

మూడు రోజుల్లో 1286 కేసులు

శబరిమలలోని అయ్యప్పను ఇద్దరు మహిళలు దర్శించుకున్న నాటి నుంచి కేరళ వ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. శనివారం రాత్రి వరకు 1,286 కేసులు నమోదయ్యాయని డీజీపీ లోక్‌నాథ్ బెహరా వెల్లడించారు. కేసులు ఎదుర్కొంటున్న వారు: 37 వేల మంది.

'సన్ రైజ్' ఆపండి బాబూ!

» మీ పుత్రోత్సాహంతో ఏపీ అస్తమయం

» సీఎంగా చంద్రబాబు విఫలం: మోదీ

» కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్



అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు తన కుమారుడి ఎదుగుదలపైనే దృష్టి సారించారని ప్రధాని మోదీ ఆరోపించారు. ఆయన విధానాలు, అవినీతితో రాష్ట్రం అస్తమిస్తుందన్న విషయం గుర్తెరగడం లేదని తప్పుబట్టారు. సూర్యోదయ ఆంధ్రప్రదేశ్ (సన్‌రైజ్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) అన్నది రాష్ట్ర ప్రభుత్వ నినాదమన్న సంగతి తెలిసిందే. 'సన్ రైజ్' అంటే సీఎం పుత్రుడి బాగు మాత్రమే కాదని మోదీ చెప్పారు. 'మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనంతపురం, తిరుపతి, కడప, కర్నూలు, నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గాల బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌ను తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి అసలైన ప్రతీకగా మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ వ్యతిరేక జాతీయ ఫ్రంట్ ఏర్పాటు చేసి 'కాంగ్రెస్ ముక్త్ భారత్'ను ఆయన కాంక్షించారని.. ఇప్పుడు ఆయన అల్లుడు (చంద్రబాబు) తన అధికారం కాపాడుకోవడానికి కాంగ్రెస్ కాళ్ల వద్ద మోకరిల్లారని ఆరోపించారు. 'ఆయన రాష్ట్ర ప్రజలను మోసగించడం ఇదే తొలిసారి కాదు. ఎన్టీఆర్‌కు రెండు సార్లు వెన్నుపోటు పొడిచారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని, ప్రయోజనాలను దెబ్బతీసినందుకు ఎన్టీఆర్ కాంగ్రెస్‌ను ఎప్పటికీ క్షమించలేదు. ఆయన విలువలకు తిలోదకాలిచ్చిన వారిని ఓడించడమే ఎన్టీఆర్‌కు, ఆయన నమ్మిన సిద్ధాంతాలకు అసలైన నివాళి. ఎన్టీఆర్ జ్ఞాపకాలకు సెల్యూట్. ఆయన వారసత్వాన్ని నిలబెడదాం' అని పిలుపునిచ్చారు. 'రాష్ట్రంలో ఒకే కుటుంబం అధికారాన్ని అంటిపెట్టుకుని ఉంటే.. కుర్చీ కాపాడుకోవడానికి ప్రజలను నిర్లక్ష్యం చేస్తుంటే.. ఓడిపోతామన్న భయంతో రోజూ రాత్రి, పగలు మోదీని తిడుతుంటే.. ముఖ్యమంత్రిగా విఫలమైన మీరు ప్రధాని కావాలని పగటికలలు కంటుంటే.. తెలుగువారి ఆత్మగౌరవం ఏమవ్వాలి' అని నిలదీశారు. 'కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్రం లెక్కలు చెప్పడంలేదు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయండి. జనాందోళనలు చేపట్టండి' అని కార్యకర్తలకు మోదీ సూచించారు. కాగా, 'కలియుగ అవతారం బాలాజీకి కోటి కోటి నమస్కారాలు' అంటూ తెలుగులో తిరుపతి నేతలు, కార్యకర్తల్ని మోదీ పలకరించారు.

మీడియాపై కోపమొద్దు..

మీడియాను చేతిలో పెట్టుకుని చంద్రబాబు బీజేపీని బద్నాం చేస్తున్నారని కర్నూలు జిల్లా నేతలు ఆరోపించగా మోదీ వారించారు. 'మీడియాపై కోపం వద్దు.. కెమెరామెన్ నుంచి మీడియా యజమాని వరకూ దేశం కోసం పనిచేస్తున్నారు. వారందరికీ దేశ సమస్యలపై అవగాహన ఉంది. మన ఫొటోలు రావడం ముఖ్యం కాదు, సమస్యలు హైలైట్ అయ్యేలా మీరూ మీడియాను వినియోగించుకోండి. వారితో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోండి' అని సూచించారు.

లోక్‌సభ ఎన్నికలకు 17 కమిటీలు!

» బీజేపీ ఎన్నికల కమిటీల నియామకం

» మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్‌లో జరిగే సార్వత్రిక ఎన్నికల శంఖారావంలో భాగంగా కీలకమైన ఎన్నికల కమిటీలను బీజేపీ నియమించింది. మేనిఫెస్టో రూపకల్పన కమిటీ, ఎన్నికల ప్రచారం, సామాజిక స్వచ్ఛంద సంస్థలతో సంబంధాలు, మీడియా, పార్టీ సాహిత్య రూపకల్పన, సోషల్ మీడియా, ప్రవాసులతో సంబంధాలు, లబ్ధిదారులతో సంబంధాలు తదితర 17 కమిటీలను నియమించారు. ఈ వివరాలను పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆదివారం వెల్లడించారు. కీలకమైన మేనిఫెస్టో రూపకల్పన కమిటీకి పార్టీ సీనియర్ నేత, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ప్రచార కమిటీకి కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సారథ్యం వహిస్తారు. ఏపీకి చెందిన ఎంపీ హరిబాబు, బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌లకు సభ్యులుగా స్థానం కల్పించారు. ఈ కమిటీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరికీ స్థానం కల్పించకపోవడం గమనార్హం. ఆయనకు సామాజిక సంబంధాలు, ఎన్జీవోలకు సంబంధించిన కమిటీని అప్పగించారు. ఈ కమిటీలో తెలంగాణ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయకు స్థానం కల్పించారు. ఇక ప్రచార కమిటీకి అరుణ్ జైట్లీ సారథ్యం వహిస్తారు. పార్టీ సాహిత్యాన్ని రూపొందించే కమిటీ బాధ్యతలను విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌కు అప్పగించారు. మీడియా కమిటీ సారథిగా కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి రవిశంకర్ ప్రసాద్ వ్యవహరిస్తుండగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు స్థానం కల్పించారు. ప్రకాశ్ జావడేకర్ సారథ్యంలో మేధావులతో సంబంధాల కమిటీ ఏర్పాటు చేశారు.

ఎస్పీ, బీఎస్పీ పొత్తును అడ్డుకునే కుట్ర

» అందులో భాగమే సీబీఐ తనిఖీలు: అఖిలేశ్

» ప్రజాధనాన్ని ఎంత లూటీ చేశారు?: బీజేపీ



న్యూఢిల్లీ, జనవరి 6: ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ బీజేపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ పొత్తును అడ్డుకునేందుకు అధికార బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ ప్రశ్నించే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఆయన స్పందించారు. "మేమిప్పుడు మహాకూటమిలో ఎన్ని సీట్లు పంచుకున్నామనే విషయాన్ని కూడా సీబీఐకి చెప్పాల్సి ఉంటుంది. అధికార పార్టీ అసలు రంగు బయటపడింది. గతంలో సీబీఐని కలిసే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించింది. ఇప్పుడు బీజేపీ వంతు. వారు చేస్తున్న పనులకు తర్వాత తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది." అని ఆదివారం అఖిలేశ్ విలేకర్లతో చెప్పారు. సీబీఐని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తమ పొత్తును అడ్డుకోవాలని చూసేవారికి తోడుగా సీబీఐ ఉందని.. దేశ ప్రజలు మాత్రం బీజేపీకి తగిన జవాబు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాగా, అఖిలేశ్ ఆరోపణలను బీజేపీ తిరస్కరించింది. అక్రమ మైనింగ్ కేసులో అఖిలేశ్‌పై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. అఖిలేశ్ సీబీఐ తనిఖీలు చేస్తున్న సమయం గురించి కాదని, ఆయన హయాంలో రాష్ట్రంలో అంత భారీగా లూటీ ఎందుకు జరిగిందో చెప్పాలని యూపీ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్ డిమాండ్ చేశారు.

ప్రధానిగా మమతకే ఛాన్స్

» పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు ఘోష్

» తీవ్ర విమర్శలతో మాట మార్చిన నేత

న్యూఢిల్లీ, జనవరి 6: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ప్రధాని అభ్యర్థిత్వంపై ఎన్‌డీఏలో వివాదం ముదురుతోంది. తాజాగా పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ వ్యాఖ్యలు బీజేపీని ఇరకాటంలో పడేశాయి. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ మొదటి బెంగాలీ ప్రధాని కావడానికి అవకాశం ఉందన్నారు. "బెంగాల్ నుంచి ఎంపిక చేయాల్సి వస్తే మమతా బెనర్జీకే అవకాశముంది. ప్రధాని కావాలన్నది ఆమె కల. రాష్ట్ర అదృష్టం ఆమె విజయంపై ఆధారపడి ఉన్నందున ఆమె మంచి ఆరోగ్యంతో ఉండాలి" అని అంటూ ఘోష్ ఆమెకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీకి కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తామన్న నమ్మకం లేదనడానికి ఘోష్ వ్యాఖ్యలే నిదర్శనమని కాంగ్రెస్ విమర్శలు మొదలుపెట్టడంతో 'జోక్‌గా అలా అన్నాన'ని ఆయన మాట మార్చేశారు. మరోవైపు బిహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా ప్రధాని అభ్యర్థియేనంటూ ఆ పార్టీ నేతలు కొత్తరాగం అందుకున్నారు. ఎన్డీఏ సారథి ప్రధాని మోదీయే అయినా ప్రధాని అభ్యర్థిపై చర్చ జరిగితే పోటీదారుల్లో నితీశ్ కూడా ఒకరని జేడీయూ రాష్ట్ర ప్రతినిధి రాజీవ్ రంజన్ పేర్కొన్నారు. ఎన్డీయేకు మోదీ, నితీశ్ రెండు ముఖాలని జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు వశిష్ఠ నారాయణ్ సింగ్ అన్నారు.

అమెరికాలో ఎమర్జెన్సీ?

» అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక.. సరిహద్దు గోడ కోసం పట్టు

వాషింగ్టన్, జనవరి 6: అమెరికాలో అత్యవసర పరిస్థితి విధించే అవకాశముందా? దేశంలో ఏర్పడిన ప్రతిష్టంభన, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొండి పట్టుదల చూస్తుంటే ఎమర్జెన్సీ తప్పదనిపిస్తోంది. ప్రతిష్టంభన తొలగించడానికి ట్రంప్‌తో చట్టసభ ప్రతినిధులు శనివారం జరిపిన చర్చల్లోనూ పురోగతి కనిపించలేదు. దీంతో అధ్యక్షుడి చేతిలో ఉన్న విశేష అధికారమైన ఎమర్జెన్సీ విధించి అమెరికా-మెక్సికో గోడ నిర్మాణాన్ని పూర్తి చేస్తానని ట్రంప్ హెచ్చరించారు. ఈ గోడ నిర్మాణానికి 5.6 బిలియన్ డాలర్లు కేటాయించాల్సిందేనన్న ట్రంప్ మొండి పట్టుదల, నిధులు కేటాయించేది లేదన్న సీనియర్ డెమోక్రాట్ల బెట్టుతో ప్రతిష్టంభన నెలకొంది.

పాక్ అరాచక పాలనతో వేగలేం

» స్వయం ప్రతిపత్తి కోసం 'గిల్గిత్ - పీఓకే' ఉమ్మడిపోరు?

గిల్గిత్ బాల్టిస్తాన్, జనవరి 6: పాక్ అరాచక పాలనతో విసిగివేసారిన గిల్గిత్ బాల్టిస్తాన్ ప్రజలు తిరగబడుతున్నారు. తమ ప్రాంతానికి స్వయం ప్రతిపత్తి కల్పించాలంటూ ర్యాలీలు, ధర్నాలతో నిరసన తెలియజేస్తున్నారు. తాజాగా ఆదివారం గిల్గిత్ ప్రాంతానికి చెందిన అవామీ యాక్షన్ కమిటీ(ఏఏసీ) నేతృత్వంలో స్థానిక నాయకులంతా ఏకతాటిపైకి వచ్చారు. అవసరమైతే పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) స్వయం ప్రతిపత్తి కోసం పోరాడుతున్న ఉద్యమ సంస్థలతో కలిసి పాక్ సర్కారుపై రాజకీయ ఒత్తిడి పెంచాలని నిర్ణయించినట్లు ఏఏసీ చైర్మన్ మౌలానా సుల్తాన్ రయీస్ తెలిపారు. గిల్గిత్ ప్రజలపై పాక్ అమానుష చట్టాలను ప్రయోగిస్తోందన్నారు.

బ్రిటన్ వర్సిటీల చూపు.. భారత్, చైనా వైపు

లండన్, జనవరి 6: 'బ్రెగ్జిట్' దెబ్బకు బ్రిటన్ విశ్వవిద్యాలయాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఈ గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు వారి చూపు భారత్, చైనా విద్యార్థులపై పడింది. ఇందుకోసం ప్రత్యేక ఎడ్యుకేషన్ ప్యాకేజీలతో యూకే విద్యాసంస్థలు ముందుకొస్తున్నాయి. మరోవైపు వచ్చే మార్చిలో యూరోపియన్ యూనియన్(ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలగనుంది. అదే జరిగితే ఇప్పటివరకు ఇక్కడి వర్సిటీల్లో చదువుతున్న ఈయూ దేశాల విద్యార్థులకు బ్రిటన్ అందిస్తున్న 1.3 బిలియన్ పౌండ్ల విద్యానిధి పథకం అమలు నిలిచిపోనుంది. ఈ నేపథ్యంలో ఈ లోటును పూడ్చుకునేందుకు భారత్, చైనా దేశాల నుంచి వచ్చే అడ్మిషన్లే తమకు కీలకంగా మారుతాయని గ్లాస్గో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆంటోన్ ముస్కాటెలి పేర్కొన్నారు.

పీడీపీకి ముస్తఫా మిర్ రాజీనామా

శ్రీనగర్, జనవరి 6: జమ్మూకశ్మీర్‌లో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ)కి మరో షాక్ తగిలింది. సీనియర్ నేత జావేద్ ముస్తఫా మిర్ ఆ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. ఇది వ్యక్తిగత నిర్ణయమని, ఈ విషయంలో తాను ఏమీ మాట్లాడదలచుకోలేదని ఆయన స్పష్టం చేశారు. బుద్గాం జిల్లాలోని చదూరా అసెంబ్లీ స్థానానికి 2002 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మరో రెండు విమానాల్లో సమస్యలు

» కోల్‌కతా విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్

వారణాసి/న్యూఢిల్లీ, జనవరి 6: విమానాల్లో రోజుకో సాంకేతిక లోపం బయట పడటంతో ప్రయాణికులు భయంతో వణుకుతున్నారు. శనివారం ఇండిగో విమానం ఇంజిన్‌లో తలెత్తిన సాంకేతిక లోపాన్ని మర్చిపోక ముందే ఆదివారం మరో రెండు విమానాల్లో సమస్య తలెత్తింది. 140 మంది ప్రయాణికులు, సిబ్బందితో కలిసి హాంకాంగ్ నుంచి ఢిల్లీ బయల్దేరిన స్పైస్ జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన బోయింగ్-737 మ్యాక్స్ విమానం ఇంజిన్‌లో ఎడమ వైపున సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో వారణాసిలోని లాల్‌బహదూర్ శాస్త్రి విమానాశ్రయంలో అత్యవసరంగా దించాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. మరో ఘటనలో దుబాయ్‌కు వెళ్లేందుకు ముంబై విమానాశ్రయం నుంచి ఎయిర్ ఎక్స్‌ప్రెస్ విమానం గాల్లోకి ఎగరగానే 'హైడ్రాలిక్' సిస్టమ్ ఫెయిల్ అయినట్లు పైలెట్ గుర్తించారు. దీంతో విమానాన్ని అత్యవసరంగా వెనక్కి తిప్పి ముంబై ఎయిర్‌పోర్టులోనే ల్యాండ్ చేశారు. ఇంకో ఘటనలో బ్యాంకాక్ నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం శనివారం రాత్రి కోల్‌కతా విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగింది. ఆ సమయంలో విమానం నుంచి ఇంధనం లీక్ అవడంతో ఆ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించారు. విమానాల రాకపోకలను నిలిపివేసి రన్ వేను శుద్ధి చేశారు.

ఒడిసాలో వాచ్‌మన్‌ను చంపిన మావోయిస్టులు

» పోలీసు ఇన్ఫార్మర్ అనే అనుమానంతోనే!

ఫుల్బనీ/రాయ్‌పూర్, జనవరి 6: పోలీసు ఇన్ఫార్మర్ అనే అనుమానంతో ఓ వాచ్‌మన్‌ను మావోయిస్టులు కాల్చి చంపారు. ఒడిసాలోని కందమాల్ జిల్లా పటియాంబ ప్రాంతంలో శనివారం రాత్రి ఈ దారుణం జరిగింది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) పథకం కింద ఇక్కడ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ గది వద్దకు వచ్చిన సాయుధ మావోయిస్టులు అక్కడున్న మూడు ట్రాక్టర్లు, లారీ, రోడ్డు రోలర్‌లకు నిప్పు పెట్టారు. వాచ్‌మన్ రవీంద్ర మల్లిక్‌ను సమీప అడవిలోకి తీసుకెళ్లి కాల్చి చంపారని ఎస్పీ ప్రతీక్‌సింగ్ చెప్పారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా మాలెవాహి గ్రామంలోనూ రోడ్డు నిర్మాణ ప్రాంతం వద్దకు శనివారం సాయుధ నక్సల్స్ వచ్చారని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని సిబ్బందిని ఆదేశించారని డీఐజీ పి.సుందర్‌రాజ్ చెప్పారు. అనంతరం మూడు మిక్సర్ యంత్రాలు, ట్రాక్టర్, పికప్ వ్యాన్, బైక్ తగలబెట్టి వెళ్లిపోయారన్నారు.

2018లో కోటి ఉద్యోగాల్లో కోత: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 6: దేశంలో ఉద్యోగ కల్పన పెరుగుతోందంటూ కేంద్రం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని కాంగ్రెస్ మండిపడింది. గత ఏడాదిలో సుమారు కోటి ఉద్యోగాలను భారత్ కోల్పోయిందని భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ కేంద్రం(సీఎంఐఈ) నివేదికను ఉదహరిస్తూ విమర్శలు గుప్పించింది. ఈ నివేదిక ప్రకారం.. 2017 డిసెంబరుకు దేశంలో 40.79 కోట్ల మంది ఉద్యోగులుగా ఉంటే.. 2018 డిసెంబరుకు ఈ సంఖ్య 39.07 కోట్లకు పడిపోయిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ ఆరోపించారు.

బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయంపై దాడి

ఢాకా, జనవరి 6: బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయంపై దాడి జరిగింది. తంగైల్ జిల్లా బాత్రా గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. చిత్తరంజన్ అనే వ్యక్తి 20 ఏళ్ల క్రితం సొంత డబ్బులతో స్థలం కొని, అందులో గుడిని నిర్మించాడు. ఈ స్థలంపై కన్నేసిన కొందరు కబ్జాకోరులు చిత్తరంజన్‌ను వేధించేవారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన తొమ్మిది మంది ఆలయంతో పాటు, ఆ పక్కనే ఉన్న చిత్తరంజన్ ఇంట్లోకి చొరబడి విధ్వంసానికి పాల్పడ్డారు.

చంద్రబాబుతో నటుడు అలీ భేటీ

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబుని సినీ నటుడు అలీ కలిశారు. ఇటీవల క్రియాశీల రాజకీయాల్లో పాల్గొనే దిశగా అలీ కార్యక్రమాలు ఉన్నాయి. కొన్నిరోజుల కిందట విశాఖ విమానాశ్రయంలో వైసీపీ అధినేత జగన్‌ని కలిశారు. దీంతో ఆయన వైసీపీలో చేరతారనే వార్తలు వచ్చాయి. మరోవైపు అలీ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కూ సన్నిహితుడే కావడంతో రకరకాల ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారమిక్కడ చంద్రబాబును ఉండవల్లి నివాసంలో కలిశారు. అరగంట సేపు చర్చలు జరిపారు. అనంతరం విజయవాడలోనే ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కూడా కలిశారు. పవన్‌తో దాదాపు గంటన్నరసేపు సమావేశమయ్యారు. వరుస భేటీలపై అలీ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'నూతన సంవత్సరం, ఎన్నికల ఏడాది కాబట్టి శుభాకాంక్షలు తెలియజేసేందుకు ఇద్దరినీ కలిశాను. రాజకీయ చర్చ జరిగిన మాట వాస్తవమే. నా రాజకీయ ప్రవేశం, పోటీ తదితర అంశాలపై సంక్రాంతి తర్వాత ఒక నిర్ణయానికి వచ్చే ఆలోచనతో ఉన్నా' అని చెప్పారు.

సెన్సిటివ్‌గా తీసుకుంటే ముందుకెళ్లలేం

» నందమూరి సుహాసిని ఓటమిపై బాలకృష్ణ

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): "మా ఇంటి అమ్మాయి బయటకు వచ్చి పోటీచేయడం ఇదే మొదటిసారి. దురదృష్టవశాత్తూ విజయం దక్కలేదు. ప్రతిదీ సెన్సిటివ్‌గా తీసుకుంటే ముందుకెళ్లలేం" అని సినీ హీరో నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించారు. దివంగత నేత నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని కూకట్‌పల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూసిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ బయోపిక్ తొలిభాగం ఎన్టీఆర్ కథానాయకుడు ప్రమోషన్స్‌లో ఉన్న బాలకృష్ణ, ఆదివారం, ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సుహాసిని ఓటమిపై తనదైనశైలిలో స్పందించారు. ఓటమికి కుంగిపోవడం ఉండదు.. గెలుపుతో విర్రవీగబోమని అన్నారు.



కస్టమ్స్ అధికారులు స్వాధీనపరచుకున్న బంగారం రేకులు

శంషాబాద్‌లో బంగారం రేకులు పట్టివేత

హైదరాబాద్, జనవరి 6: శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు బంగారం రేకులను స్వాధీనపరచుకున్నారు. అధికారుల సోదాల్లో ఓ ప్రయాణికుడి లగేజీలో కార్బన్ కాగితం చుట్టిన బంగారు రేకులు బయటపడ్డాయి. సుమారు 830 గ్రాముల బరువున్న ఆ రేకుల విలువ రూ. 27 లక్షల వరకూ ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు.. ఢిల్లీ విమానాశ్రయంలో 4కిలోల బంగారు కడ్డీలను అధికారులు స్వాధీనపరచుకున్నారు.

సీఎం గారూ.. 'బుల్లెట్ ప్రూఫ్' బిల్లు కట్టండి

- కేసీఆర్‌కు పోలీసు శాఖ విజ్ఞప్తి.. 32 మంది నేతలకు లేఖలు

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉపయోగించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాల బకాయిలు చెల్లించాలని కోరుతూ సీఎం కేసీఆర్ సహా 33 మంది నాయకులకు పోలీసుశాఖ లేఖలు రాసింది. ఈ మేరకు ఆదివారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేసింది. స్టార్ క్యాంపెయనర్‌లకు ఉపయోగించిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనాల బిల్లుల చెల్లింపులు కోరుతూ.. వివిధ రాజకీయ పార్టీలకు, నాయకులకు లేఖలు రాసినట్లు వివరించింది. కేంద్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు.. గత ఏడాది సెప్టెంబరు 6 నుంచి డిసెంబరు 7 వరకు సీఎం కేసీఆర్ సహా.. 33 మంది రాజకీయ నాయకులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలతో భద్రత కల్పించామని వివరించింది. డ్రైవర్లను కూడా కేటాయించామని పేర్కొంది. ఆ జాబితాలో సీఎం కేసీఆర్‌తో పాటు మాజీ స్పీకర్ మధుసుధనాచారి, మాజీ మంత్రులు, కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, షబ్బీర్‌అలీ, బీజేపీ నాయకుడు కిషన్‌రెడ్డి, మజ్లిస్ నేత అక్బరుద్దీన్ ఒవైసీలతో పాటు అన్ని పార్టీల స్టార్ క్యాంపెయనర్‌లు ఉన్నారని తెలిపింది. కిలోమీటర్ల ఆధారంగా ధరను నిర్ణయించామని, ఒక్కో నాయకుడు రూ.57 వేల నుంచి రూ.7.7 లక్షల వరకు బకాయి ఉన్నట్లు వెల్లడించింది.

● యూజీసీ నెట్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ, జనవరి 6 : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జాతీయ అర్హత పరీక్ష(నెట్) ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదివారం విడుదల చేసింది. మొత్తం 9,56,837 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవగా, 44,001 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత సాధించారు. మరో 3,883 మంది జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)తో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత పొందారు.

● గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2019-20 విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సాధారణ ఇంటర్ కాలేజీలతో పాటు పలు ప్రవేశ పరీక్షలకు శిక్షణ అందించే జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకూ ఒకేసారి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 9 నుంచి 23 వరకు www.tswreis.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 17న ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.

● దూరవిద్యలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూర విద్యా విభాగంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగల వారు ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తులు సమర్పించొచ్చు. ఫిబ్రవరి 6న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

● 'నీట్' దరఖాస్తుల్లో తప్పులు దిద్దుకోండి: ఎన్టీఏ

హైదరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలో ప్రవేశాలకు విద్యార్థులు సమర్పించిన 'నీట్' దరఖాస్తుల్లో పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) మరో అవకాశం ఇచ్చింది. ఈ నెల 14 నుంచి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా వాటిని సరిచేసుకునే వెసులుబాటు కల్పించింది. జనవరి 31 తరువాత ఎలాంటి అవకాశమివ్వబోమని స్పష్టం చేసింది.

● రెండు స్థానాల్లో సీపీఐ పోటీ!

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కనీసం రెండు స్థానాల్లో పోటీ చేయాలని సీపీఐ నిర్ణయించింది. పార్టీకి మంచి పట్టున్న ఖమ్మం, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో ఒకటి, నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల్లో మరో స్థానం నుంచి పోటీకి రాష్ట్ర కమిటీ ప్రతిపాదించింది. పంచాయతీ ఎన్నికల హడావుడి ప్రారంభం కావడంతో.. స్థానికంగా తమతో కలిసి వచ్చే బీజేపీయేతర రాజకీయ శక్తులు, సంసలతో కలిసి ముందుకెళ్లాల్సిందిగా ఆయా జిల్లా, మండల కమిటీలను ఆదేశించింది.

● విదేశీ పర్యటనకు ఉత్తమ్.. 11న స్వదేశానికి

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదివారం విదేశీ పర్యటనకు వెళ్లారు. 4 రోజులపాటు ఆయన యూరప్‌లో పర్యటిస్తారని టీపీసీసీ నేతలు తెలిపారు. తిరిగి 11న స్వదేశానికి చేరుకుంటారని, తమ బంధువులతో గడిపేందుకే విదేశాలకు వెళ్లారన్నా రు.

● 7 లక్షల రైతులకు 6,291 కోట్లిచ్చాం: అకున్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర చరిత్రలో ఈ ఏడాది అత్యధికంగా 7.25 లక్షల మంది రైతుల నుంచి 37 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, అందుకు సంబంధించి రూ.6291 కోట్ల రూపాయలను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేశామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సభర్వాల్ తెలిపారు. ఆదివారం పౌరసరఫరాల శాఖ భవన్‌లో సంస్థ జిల్లా మేనేజర్లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రానున్న రోజుల్లోనూ ధాన్యం దిగుబడి ఇదే విధంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు.

● కేటీఆర్ వ్యాఖ్యలు అహంకార పూరితం: దత్తాత్రేయ

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై కేంద్రం సవతి ప్రేమ చూపుతోందన్న కేటీఆర్ వ్యాఖ్యలు అబద్ధమని బీజేపీ నేత బండారు దత్తాత్రేయ అన్నారు. అహంకార ధోరణితో కేంద్రంపై విమర్శలు చేస్తున్నారని, తద్వారా ఓటర్లను తమవైపునకు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులకు కేంద్రం సత్వరం అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు.

● అల్లా దయతో 'ప్రొటెం స్పీకర్'గా చాన్స్: ముంతాజ్



హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రొటెం స్పీకర్‌గా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో శాసనసభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించే అవకాశం తనకు దక్కడం మజ్లిస్‌కు ఇచ్చిన గుర్తింపుగా చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అభివర్ణించారు. ఆదివారం మజ్లిస్ కార్యకర్తలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముంతాజ్ మాట్లాడుతూ.. 1986లో అప్పటి మజ్లిస్ అధినేత సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించారని, మళ్లీ తనకు అలాంటి అదృష్టం దక్కడం అల్లా దయే అని పేర్కొన్నారు.

● ఆయన ఉంటే ప్రమాణం చేయను: రాజాసింగ్



మంగళ్‌హాట్/హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ఆయన సమక్షంలో తాను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయబోనని, అసెంబ్లీకే వెళ్లబోనని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం వీడియో విడుదల చేశారు. హిందూ ధర్మానికి వ్యతిరేక పార్టీ అయిన మజ్లిస్ నేత సమక్షంలో తాను ఎమ్మెల్యేగా ప్రమాణం చేయబోనని చెప్పారు. హిందువులను అవమానించి, భారత్ మాతాకీ జై అనని, వందేమాతరం ఆలపించని మజ్లిస్ నుంచి ఒక నేతను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. న్యాయ నిపుణులతో చర్చించి తన తదుపరి నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. కాగా, స్పీకర్ సమక్షం లో రాజాసింగ్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు ఉండాల్సిందే

- టీడీపీ వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరగలేదు: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు ఉండాల్సిందేని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అభిప్రాయ పడ్డారు. టీడీపీతో పొత్తు కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎలాంటి నష్టం జరగలేదని పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ తన భార్య నిర్మలకు మెదక్ ఎంపీ టికెట్ ఇస్తే గెలిపించుకుంటానని స్పష్టం చేశారు. తనకు సీఎల్పీ నేతగా అవకాశం ఇవ్వాలని ఉత్తమ్‌ను కోరినట్లు చెప్పారు.

టీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టలేకపోయాం

- ఓటర్ల ఆలోచన మేరకు మారాలి: రాజనర్సింహ

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల ఆలోచన మారిందని, అందుకు అనుగుణంగా కాంగ్రెస్ విధానాలు కూడా మారాల్సిన అవసరం ఉందని మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయపడ్డారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంలోనూ కాంగ్రెస్ విఫలమైందని అంగీకరించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయలేకపోయామన్నారు.

కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై రమణ నో కామెంట్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో టీడీపీతో పొత్తు విషయంలో కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై తాము స్పందించబోమని టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ తెలిపారు. కాంగ్రెస్ ఓటమిపై సమీక్షల్లో కాంగ్రెస్ నాయకులు కొంతమంది టీడీపీతో పొత్తును వ్యతిరేకించామని తెలిపారు. ఆ పొత్తు వల్లే ఓడిపోయామని ఒకరిద్దరు నేతలు పేర్కొనగా, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు ఉండకపోవడమే మంచిదని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'తో రమణ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులపై నిర్ణయానికి ఇంకా సమయం ఉందని అన్నారు.



నన్ను సస్పెండ్ చేయడానికి

ఉత్తమ్ ఎవరు?

- ఆ అధికారం టీపీసీసీకి లేదు
- నేను ఏఐసీసీ నాయకుడిని
- ఖుంటియా, ఉత్తమ్ సారథ్యంలో ఒక్క ఎన్నికలోనైనా గెలవలేదు
- వారికి బాధ్యతలు ఇవ్వడమంటే దొంగల చేతికి తాళాలు ఇచ్చినట్లే
- ఉత్తమ్‌ను వెంటనే మార్చకపోతే పార్టీ మరింత నాశనమవుతుంది
- పార్టీని ఓడగొట్టినవారే సమీక్షిస్తారా?
- కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): "నేను ఏఐసీసీ నేతను. రెండుసార్లు ఎంపీగా గెలిచాను. నన్ను సస్పెండ్ చేసే అధికారం టీపీసీసీకి లేదు" అని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ స్పష్టం చేశారు. తానేమైనా పార్టీకి నష్టం కలిగే చర్యలకు పాల్పడ్డానా అని ప్రశ్నించారు. పార్టీ నాయకత్వం తప్పిదాలను అంతర్గత సమావేశంలో తెలియజేసి, నాయకత్వాన్ని ప్రక్షాళన చేయమని అడిగితే సస్పెండ్ చేస్తారా? అని నిలదీశారు. సస్పెన్షన్‌కు సంబంధించిన ఉత్తర్వు కానీ లెటర్ కానీ తనకు అందలేదని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఏఐసీసీ స్థాయి నేతను సస్పెండ్ చేసే అధికారం పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేదని స్పష్టం చేశారు. "నన్ను సస్పెండ్ చేయమని హై కమాండ్ ఆదేశాలు ఇచ్చిందా? ఇస్తే చూపెట్టాలి?' అని డిమాండ్ చేశారు. సమాధానం చెప్పే సమయమైనా ఇవ్వకుండాలోపాలు ఎత్తిచూపిన 15 నిమిషాల్లోనే సస్పెండ్ చేశారని విమర్శించారు. సర్వే సత్యనారాయణను చులకనగా చూస్తున్నారని, టీపీసీసీ నాయకత్వాన్ని వదలేది లేదని చెప్పారు. ఈ వ్యవహారాన్ని హైకమాండ్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఉత్తమ్, ఖుంటియాలను మార్చాల్సిందేనని, వారి నాయకత్వంలో నాలుగున్నరేళ్లలో పార్టీ ఏ ఎన్నికలోనూ గెలవలేదని, కనీసం ఒక్క కార్పోరేషన్‌ను కూడా గెలుచుకోలేదని అన్నారు. వారికి బాధ్యతలు అప్పగించడమంటే దొంగల చేతికి తాళంచెవులు ఇచ్చినట్లేనని విమర్శించారు. భార్య, పిల్లల ఓట్లు కూడా పడని అసమర్థులకు టీపీసీసీ పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. ఉత్తమ్ టీఆర్ఎస్‌కు అమ్ముడుపోయారని ఆరోపించారు. ఉత్తమ్‌పై చర్యలు తీసుకోకపోతే పార్టీ ఇంకా నాశనమవుతుందన్నారు. "టీపీసీసీ పదవుల్లో రౌడీ మూకలున్నాయి. దారినపోయే దానయ్యలకు ప్రధాన కార్యదర్శి స్థాయి పదవులు ఇచ్చారు. వారిని కొందరు ముఖ్యనేతలు పెంచిపోషిస్తున్నారు. సమీక్ష సమావేశంలో పార్టీ ఓటమిపై చర్చిస్తుంటే ఆ నేతలు ఆ రౌడీలను నా పైకి ఎగదోశారు. వారిలో ఒకడు నాపై దాడికి దిగాడు' అని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి కారకులైన నేతలే ఓటమిపై సమీక్ష నిర్వహించటం ఏమిటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ నేతల బాహాబాహీ

(మొదటి పేజీ తరువాయి)



గాంధీభవన్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో ఖుంటియా తదితరులు

పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ టీపీసీసీ నేతలు సంతకాలు సేకరించారు. వారి వినతిని పరిగణనలోకి తీసుకున్న టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సర్వేను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణాలు అన్వేషించడంతోపాటు స్థానిక, లోక్‌సభ ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై మూడు రోజులుగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా గాంధీ భవన్‌లో సమీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం హైదరాబాద్, సికింద్రాబాద్, మెదక్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి స్థానాల సమీక్ష జరిగింది. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంపై సమీక్ష సమయంలో సర్వే సత్యనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, నిజామాబాద్‌కు చెందిన నేత మహేశ్ గౌడ్ మధ్య ఈ ఘర్షణ చోటుచేసుకుంది.

అసలేం జరిగింది..?

ఖుంటియా, ఉత్తమ్‌పై సర్వే విమర్శలు గుప్పించారని, ఆయనను వారిస్తున్న సమయంలో చినికి చినికి గాలివానలా వివాదం పెద్దదైందని టీపీసీసీ నేతలు చెప్పారు. మల్కాజ్‌గిరి సమీక్షా సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ నేతలు చెప్పిన వివరాల ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి పూర్తి కారణం ఖుంటియాయేనని సర్వే స్పష్టమైన ఆరోపణలు చేశారు. "నువ్వు సీరియస్‌గా లేవు. కేంద్ర మాజీ మంత్రినైన నేను ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. టికెట్లను డబ్బులకు అమ్ముకున్నావు. ఇష్టం వచ్చిన నేతలకు ఇచ్చుకున్నావు. మీ (ఖుంటియా, ఉత్తమ్) కాంబినేషన్‌లో పార్టీ గెలవడం కల్ల. పార్టీని ఓడగొట్టిన మీరే ఓటమిపై సమీక్ష నిర్వహిస్తారా? పొత్తులు కుదుర్చుకోవడంలో మితిమీరిన జాప్యం జరిగింది. దీనికంతటికీ ఉత్తమ్ కుమార్ రెడ్డే కారణం. టీజేఎస్‌కు ఇచ్చే మూడు, నాలుగు సీట్లను కూడా నామినేషన్ల చివరి రోజు వరకు తేల్చరా?" అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఖుంటియానే ప్రధాన లక్ష్యంగా చేసుకుని సర్వే విమర్శలు గుప్పించారని పార్టీ నేతలు చెప్పారు. అయితే.. తన వాదనను వినిపిస్తున్న సమయంలో ఖుంటియా, ఉత్తమ్‌లను ఉద్దేశించి సర్వే నోరు జారి అసభ్య పదజాలాన్ని ఉపయోగించారని కొందరు నేతలు ధ్రువీకరించారు. ఈ సమయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొల్లు కిషన్, నగేష్ ముదిరాజ్ కలగజేసుకుని "పార్టీలో మీరు సీనియర్ నేత. అలాంటి అసభ్య పదజాలాన్ని ఉపయోగించడం సబబు కాదు" అని వారించారని తెలిపారు. దాంతో, సర్వే, బొల్లు కిషన్ మధ్య మాటా మాటా పెరిగిందని చెప్పారు. ఈ సమయంలో తన ముందున్న నీళ్ల బాటిల్‌ను తీసుకుని కిషన్‌పైకి సర్వే విసిరారని, దాంతో, కిషన్ కూడా ఆగ్రహంతో సర్వేపైకి దూసుకొచ్చారని వివరించారు. ఇద్దరు నేతలూ చొక్కాలు పట్టుకుని.. ఒకరిపై మరొకరు ముష్టిఘాతాలు కురిపించుకున్నారని ప్రత్యక్ష సాక్షులైన నేతలు తెలిపారు. అదే సమయంలో, మహేశ్ గౌడ్ జోక్యం చేసుకున్నారు. శాంతించి కూర్చోవాలని సర్వేకు నచ్చజెప్పబోయారు. "నిజామాబాద్‌కు చెందిన నువ్వు ఈ సమావేశంలో ఎందుకు ఉన్నావు!? నీకు ఏం సంబంధం..?" అని సర్వే ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం, వారివురి మధ్య కూడా ఘర్షణ చెలరేగి పరస్పరం కొట్టుకున్నారని కాంగ్రెస్ నేతలు చెప్పారు. ఘర్షణ తీవ్రమవడంతో సర్వే కోపంగా సమావేశం నుంచి బయటకు వచ్చారు.

సర్వే సస్పెన్షన్

కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణపై కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు గాంధీభవన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. మల్కాజ్‌గిరి ఎంపీ సెగ్మెంట్‌పై సమీక్ష సందర్భంగా ఖుంటియా, ఉత్తమ్‌పై సర్వే అనుచిత వ్యాఖ్యలు చేశారని, బొల్లు కిషన్‌పై దాడి చేశారని పేర్కొంది. సర్వే అనుచిత ప్రవర్తన నేపథ్యంలో అధిష్ఠానం ఆదేశాల మేరకే టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఆయనను సస్పెండ్ చేసిందని తెలిపింది.

కాంగ్రెస్ నుంచి బర్తరఫ్ చేయాలి: బొల్లు కిషన్

కాంగ్రెస్ నుంచి సర్వే సత్యనారాయణను బర్తరఫ్ చేయాలని బొల్లు కిషన్ డిమాండ్ చేశారు. "సమీక్షా సమావేశంలో సర్వే ఓ వీధిరౌడీలా వ్యవహరించాడు. మీ వల్లే పార్టీ ఓటమి పాలైందంటూ ఉత్తమ్, ఖుంటియా, బోసు రాజు, సలీం అహ్మద్, శ్రీనివాస కృష్ణన్‌లను దుర్భాషలాడాడు' అని చెప్పారు. ఆ సమయంలో అసభ్య పదజాలం ఉపయోగించడం తగదని, శాంతించాలని వారించానని, స్వీయ నియంత్రణ కోల్పోయిన సర్వే నీళ్ల బాటిల్‌తో ముందుగా తనపై దాడి చేశాడని, పరుష పదజాలంతో దూషించాడని చెప్పారు. చొక్కా పట్టుకుని లాగాడని, జేబు కూడా చిరిగిందని చూపించారు. ఎంత వారించినా వినకుండా చేయి చేసుకున్నారని ఆరోపించారు. శాంతించి కూర్చోవాలని నచ్చజెప్పబోయిన తనను కూడా అసభ్య పదజాలంతో దూషించాడని మహేశ్ గౌడ్ సర్వే తీరును తప్పుబట్టారు.

సబిత గైర్హాజరు

చేవెళ్ల ఎంపీ సెగ్మెంట్‌పై సమీక్ష సమావేశానికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గైర్హాజరయ్యారు. ఆమె పార్టీ మారతారని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో సమావేశానికి ఆమె రాకపోవడం చర్చనీయాంశమైంది. అయితే, నియోజకవర్గంలో కార్యకర్తలతో సమావేశం ఉన్నందునే ఆమె రాలేదని టీపీసీసీ నేతలు చెప్పారు. అలాగే, ఇదే లోక్‌సభ పరిధిలోని తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి కూడా గైర్హాజరయ్యారు. కాగా, లోక్‌సభ అభ్యర్థుల ప్రకటనలో జాప్యం చేయొద్దని, దాని కారణంగా ఓటర్లు అయోమయానికి గురయ్యే ప్రమాదముందని సమావేశంలో నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది. కాగా, మూడు రోజులపాటు నిర్వహించిన ఈ సమీక్షలు ఆదివారంతో ముగిశాయి.


అందరం కలిసేందుకే భేటీ!

- 'ప్రత్యేక' విందు సమావేశం కాదు: అరుణ.. పీసీసీ పదవి కోసమేనా?

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ నేతలంతా ఒకచోట చేరి తాజా రాజకీయ పరిణామాలపై చర్చించేందుకే సమావేశం ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ నేత డీకే అరుణ స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రయోజనాల కోసమో లేక ప్రత్యేకంగా విందు ఆరగించేందుకో ఈ సమావేశం ఏర్పాటు చేయలేదని చెప్పారు. పార్టీ నేతలంతా ఒకచోట కలవాలన్న ఉద్దేశంతోనే ఆదివారం గండిపేటలో విందు సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో పొత్తులతో అన్ని జిల్లాల్లో మేలు జరగబోదని పార్టీ అధినాయకత్వానికి సూచించాలని నిర్ణయించామన్నారు. తాను ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే అంశం ఈ సమావేశంలో ప్రస్తావనకు రాలేదని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం పొత్తుల వల్లే ఓడిపోలేదని, ఓటమికి చాలా కారణాలున్నాయని ఆమె తేల్చిచెప్పారు. పాలమూరు ప్రాంతం కాంగ్రెస్‌కు కంచుకోట అని, అక్కడ కూడా పార్టీ ఓడిందంటే ఏదో జరిగిందన్న అనుమానం కలుగుతోందని చెప్పారు. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో పీసీసీ నాయకత్వ మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతున్న తరుణంలో అరుణ విందు సమావేశం ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. పీసీసీ పదవిని ఆశిస్తున్న నేతల రేసులో అరుణ కూడా ఉన్నారు. పీసీసీ పదవి రేసులో తానున్నానని, తనకు పార్టీ మద్దతు కూడా ఉందని నిరూపించుకునేందుకే అరుణ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారని కొందరు నేతలు చర్చించుకున్నారు.



విందుకు హాజరైన మధు యాష్కీ, డీకే అరుణ తదితరులు



కేటీఆర్‌కు సమస్యలపై విన్నవిస్తున్న వీఆర్ఏలు

నా పేరుతో యువసేనలు వద్దు

- వాటికి గుర్తింపు లేదు.. రద్దు చేసుకోండి
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ యువసేన.. కేటీఆర్ అభిమాన సంఘం.. ఇలాంటివి ఏర్పాటు చేయొద్దని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు స్పష్టం చేశారు. తన పేరిట యువసేనలు, అభిమాన సంఘాలను అంగీకరించబోనని.. వాటికి ఎలాంటి గుర్తింపూ లేదని తెలిపారు. తనపై అభిమానం ఉంటే టీఆర్ఎస్ లేదా పార్టీ అనుబంధ సంఘాలతో కలిసి పనిచేయాలని సూచించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంఘాలను వెంటనే రద్దు చేసుకోవాలని కేటీఆర్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కేటీఆర్ యువసేన, కేటీఆర్ సేవాదళ్, కేటీఆర్ అభిమాన సంఘం.. ఇలా పలు పేర్లతో సంఘాలను ఏర్పాటు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వాటిని తాను ఏమాత్రం ఆమోదించబోనని స్పష్టం చేశారు. తనతోపాటు పార్టీపై అభిమానంతో ఏర్పాటు చేసే సంఘాలకూ ఆమోదం లేదన్నారు. ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల్లోనూ తన పేరిట కార్యక్రమాలను నిలిపివేయాలని కోరారు. కేటీఆర్ యువసేనను ఏర్పాటు చేసిన కార్యకర్తలు ఆదివారం ఆయన్ను కలవగా.. తక్షణమే సంఘాన్ని రద్దు చేసుకోవాలని, టీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కాగా.. తమ సమస్యలను పరిష్కరించాలని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్ఏల సంఘం ప్రతినిధులు కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

హార్వర్డ్ ఇండియా వార్షిక సదస్సుకు కేటీఆర్

హార్వర్డ్ ఇండియా వార్షిక సదస్సుకు హాజరు కావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 16, 17 తేదీల్లో అమెరికాలోని మసాచుసెట్స్‌లో ఈ సదస్సును నిర్వహించనున్నారు. 'ఇండియా ఎట్ ఇన్‌ఫ్లెక్షన్ పాయింట్' అనే అంశం ప్రధానంగా సాగనున్న ఈ సదస్సులో ప్రత్యేక వక్తగా పాల్గొనాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందినట్లు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రంలోని ఎంపీ సీట్లన్నీ

మనమే గెలవాలి!

- సొంత బలంతోనే నిధులు రాబట్టాలి
- 'వ్యవసాయాధికారుల' డైరీ ఆవిష్కరణలో హరీశ్
- త్వరలో వరి నాటు యంత్రాల పంపిణీ: గుత్తా



హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): "కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకే నిధులు ఇస్తున్నాయి. తెలంగాణకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఏం చేయలేదు. యూపీఏ వచ్చినా చేసేదేం లేదు. మన బలాన్ని జాతీయ స్థాయిలో కూడా పెంచుకోవాలి. రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాలను టీఆర్ఎస్ గెలవాలి. అప్పుడే రాష్ట్రానికి కావాల్సిన నిధులు, హక్కులను సాధించుకోవచ్చు" అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారమిక్కడ జరిగిన వ్యవసాయశాఖ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో హరీశ్ మాట్లాడుతూ.. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను సొంత బలంతోనే సాధించుకోవాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌ను కూడా తిట్టిపోసిన ఘనత కాంగ్రెస్ నేతలదని, అందుకే ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారుల పనితీరు దేశానికే ఆదర్శమని కొనియాడారు. రైతు బీమా చెక్కులు రైతుల కుటుంబాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయన్నారు. తెలంగాణ పథకాలను యావత్ దేశం కాపీ కొడుతోందని, ఇది రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. రైతుల్లో గుణాత్మక మార్పునకు కారణం సీఎం కేసీఆర్ అని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తున్నందునే కేసీఆర్ హయాంలో రైతు ఆత్మహత్యలు తగ్గిపోతున్నాయని చెప్పారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మరో 10, 15 ఏళ్ల వరకు కేసీఆర్‌కు పోటీ వచ్చే నాయకులే లేరన్నారు. బాగా పనిచేసే ఉద్యోగులను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలోని పథకాలు దేశానికే దిక్సూచిగా మారుతున్నాయన్నారు. మద్దతు ధరను పెంచడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తెలంగాణలో అమ్ముకుంటున్నారని చెప్పారు. వరి నాటు వేసే యంత్రాలను కూడా పంపిణీ చేయాలని యోచిస్తున్నామన్నారు.

బ్రాహ్మణ సదన్ త్వరలో ప్రారంభం

- సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు
- సీపీఆర్వో జ్వాలా నరసింహారావు
- పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి: దేవీప్రసాద్



చిక్కడపల్లి/హైదరాబాద్, జనవరి 6(ఆంధ్ర జ్యోతి): త్వరలోనే హైదరాబాద్ నగర శివారులోని గోపన్‌పల్లిలో ఆరు ఎకరాల్లో నిర్మిస్తున్న బ్రాహ్మణ సదన్‌ను ప్రారంభించబోతున్నట్లు సీఎం సీపీఆర్వో, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ వైస్‌చైర్మన్ జ్వాలా నరసింహారావు తెలిపారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని చెప్పారు. ఆదివారం చిక్కడపల్లిలో ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ముద్రించిన 2019 క్యాలెండర్, డైరీ, మొబైల్ యాప్‌లను ఆవిష్కరించారు. నరసింహారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఏదైనా సంఘటన జరిగితే దానికి బ్రాహ్మణులనే నిందించడం సరికాదన్నారు. నెహ్రూ మంత్రివర్గంలో 70 శాతం బ్రాహ్మణులేనని, దేశంలోని న్యాయమూర్తులు, సీనియర్ ఐఏఎస్ అధికారులుగా బ్రాహ్మణులు ఉండేవారని, ప్రస్తుతం అటువంటి స్థానాల్లో లేకపోవడానికి కారణాలపై చర్చించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన తప్పులేంటో ఆత్మవిమర్శ చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. టీఎన్జీవో కార్యాలయంలో 5వ బ్రాహ్మణ ఉద్యోగ సంఘాల డైరీ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలని కోరారు.



రోహిత్.. రితిక.. సమైరా!

ముంబై: భారత క్రికెటర్ రోహిత్ శర్మ తన కుమార్తెకు సమైరా అని నామకరణం చేశాడు. ఈ విషయాన్ని అతను ట్విటర్ ద్వారా వెల్లడించాడు. ఈ సందర్భంగా భార్య, కూతురితో కలిసి దిగిన ఫొటోను పోస్ట్ చేశాడు. గతవారం తన భార్య రితిక ఆడపిల్లకు జన్మనివ్వడంతో ఆస్ట్రేలియా పర్యటనలోనున్న రోహిత్ స్వదేశానికి చేరుకున్న సంగతి తెలిసిందే. భారత ఓపెనర్ రోహిత్ ఆసీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో పాల్గొనేందుకు 8న జట్టుతో చేరనున్నాడు. ఈనెల 12 నుంచి వన్డే సిరీస్ ప్రారంభం కానుంది.

రూ. 700 కోట్లతో.. 63 ఎకరాల్లో..

అహ్మదాబాద్ వేదికగా ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం!

అహ్మదాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం భారత్‌లో నిర్మితమవుతోంది. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని మొతెరాలో 63 ఎకరాల విస్తీర్ణంలో ఈ భారీ స్టేడియాన్ని నిర్మిస్తున్నారు. గుజరాత్ క్రికెట్ సంఘం (జీసీఏ) డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ స్టేడియానికయ్యే ఖర్చును దాదాపు రూ. 700 కోట్లుగా అంచనా వేశారు. లక్ష సీటింగ్ సామర్థ్యం గల ఈ స్టేడియాన్ని ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ పాపులస్ డిజైన్ చేస్తున్నారు. స్టేడియం నిర్మాణ చిత్రాలను జీసీఏ ఉపాధ్యక్షుడు పరిమల్ నత్వాణీ ఆదివారం ట్విటర్‌లో పోస్ట్ చేశారు. 3వేల కార్లు, 10వేల ద్విచక్రవాహనాలు పార్క్ చేసేందుకు వీలుగా పెద్ద పార్కింగ్ సముదాయమున్న ఈ స్టేడియంలో మూడు ప్రాక్టీస్ గ్రౌండ్స్, ఇండోర్ క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాదు.. ఇందులో 76 కార్పొరేట్ బాక్సులు, 55 గదులతో ఓ క్లబ్ హౌస్‌తో పాటు ఒలింపిక్ స్థాయి స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తున్నట్టు నత్వాణీ వెల్లడించారు.





నిఖత్ జరీన్‌కు ట్రోఫీ అందిస్తున్న మేరీకోమ్

నిఖత్ సిల్వర్ పంచ్

విజయ నగర (కర్ణాటక): జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ రజత పతకం సాధించింది. 51 కిలోల ఫ్లైవెయిట్ విభాగంలో ఫైనల్ చేరిన నిఖత్ టైటిల్ నెగ్గడంలో మాత్రం విఫలమైంది. ఆదివారం జరిగిన తుదిపోరులో పింకీ రాణి జాంగ్రా 3-2 స్కోరు తేడాతో నిఖత్‌ను ఓడించి చాంపియన్‌గా నిలిచింది. టైటిల్‌ఫైట్‌లో ఓడినా నిఖత్ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో రాణించడంతో బెస్ట్ చాలెంజింగ్ బాక్సర్ అవార్డును దక్కించుకుంది. స్టార్ బాక్సర్, ప్రపంచ చాంపియన్ మేరీ కోమ్ చేతుల మీదుగా నిఖత్ అవార్డు అందుకుంది.

దశాబ్దాల ఎదురు చూపులకు ముగింపు పలికేందుకు భారత క్రికెట్ జట్టు మరికొన్ని గంటలు ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగో రోజే కంగారూల ఖేల్ ఖతం చేద్దామనుకున్నా వరుణుడు అడ్డు తగిలాడు. దీంతో రెండు సెషన్ల ఆట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. అయితే ఈ మధ్యలో కేవలం 25.2 ఓవర్లపాటు జరిగిన ఆటలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మ్యాజిక్ చేశాడు. కెరీర్‌లో రెండోసారి ఐదు వికెట్ల ఫీట్ సాధించడంతో ఆతిథ్య జట్టు ఫాలో ఆన్ కోసం బరిలోకి దిగాల్సి వచ్చింది. భారత్ ఇంకా 316 పరుగుల ఆధిక్యంలో ఉండగా.. పిచ్ పరిస్థితిని బట్టి చూస్తే ఆసీస్ మూడు సెషన్ల పాటు బ్యాటింగ్ చేయడం కష్టమే.. అయితే చివరి రోజు ఆట సజావుగా సాగుతుందా? లేదా? అనేది ఆసక్తి కరంగా మారింది. ఒకవేళ మ్యాచ్ పూర్తిగా జరగకపోయినా భారత్ సిరీస్ సంబరాలకు వచ్చిన ఇబ్బందేమీ లేదు.

నేడే..

చూడండి సిరీస్ విజయం!

- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 300 ఆలౌట్
- కుల్దీప్‌కు ఐదు వికెట్లు
- ఫాలో ఆన్‌లో 6/0 ● నాలుగో టెస్టు

సిడ్నీ: ఆరంభంలో వర్షం.. ఆ తర్వాత వెలుతురులేమి.. భారత జట్టును తీవ్రంగా నిరాశపరుస్తూ నాలుగో రోజు ఆటలో కనిపించిన దృశ్యమిదే. అయితేనేం.. భారత బౌలర్ల ధాటికి మూడు దశాబ్దాల తర్వాత ఆస్ట్రేలియా తమ సొంతగడ్డపై ఫాలో ఆన్ ఆడాల్సిన పరిస్థితి ఎదురైంది. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (5/99) సూపర్ షోతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 104.5 ఓవర్లలో 300 పరుగులకు కుప్పకూలింది. అయితే ఆఖరి వికెట్‌కు స్టార్క్ (29 నాటౌట్), హాజెల్‌వుడ్ (21) కలిసి 42 పరుగులు జోడించి విసిగించారు. షమి, జడేజాకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 322 పరుగుల లోటుతో ఫాలో ఆన్ కోసం బరిలోకి దిగిన ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 6 రన్స్ చేసింది. క్రీజులో ఖవాజా (4), హ్యారిస్ (2) ఉన్నారు.

నాలుగు గంటలు ఆలస్యంగా..: ఆదివారం వరుణుడు ఆసీస్‌కు అండగా నిలబడ్డాడు. ఉదయమే ప్రారంభమైన భారీ వర్షం లంచ్ బ్రేక్ తర్వాత కానీ తెరిపినివ్వలేదు. దాదాపు నాలుగు గంటల తర్వాత ఆట మొదలైంది. మూడో రోజు మిగిలిన మూడు బంతులను వేసిన తర్వాత భారత్ రెండో కొత్త బంతి తీసుకుని లాభపడింది. ఏడు ఓవర్లలోనే 3 వికెట్లు తీసి ఆసీస్‌ను మరింత ఒత్తిడికి గురిచేసింది. ముందుగా సెషన్ ఆరంభమైన ఆరో బంతికే కమిన్స్‌ను షమి బౌల్డ్ చేశాడు. 89వ ఓవర్‌లో హ్యాండ్స్‌కోంబ్ రెండు ఫోర్లు బాదినా మరుసటి ఓవర్‌లోనే అతన్ని బుమ్రా బౌల్డ్ చేశాడు. 91వ ఓవర్‌లో లియాన్‌ను కుల్దీప్ ఎల్బీ చేయడంతో 258 రన్స్‌కు ఆసీస్ 9వికెట్లు కోల్పోయింది.

విసిగించిన ఆఖరి వికెట్: ఆసీస్ చివరి వికెట్ కోల్పోవడం ఎంతోసేపు పట్టదనుకున్నా స్టార్క్, హాజెల్‌వుడ్ మాత్రం పట్టువదలకుండా పోరాడారు. దీనికి విహారి పేలవ ఫీల్డింగ్ కూడా తోడయ్యింది. స్కోరు 264 పరుగుల వద్ద హాజెల్‌వుడ్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను మిడాఫ్‌లో వదిలేశాడు. దీంతో బౌలర్ కుల్దీప్, కోహ్లీ తీవ్ర అ సంతృప్తి వ్యక్తం చేయడం కనిపించింది. ఇదే అదనుగా ఆసీస్ జోడీ బౌండరీలతో పరుగులు రాబట్టారు. భారత్ సహనాన్ని పరీక్షించిన వీరు 14 ఓవర్ల పాటు క్రీజులో నిలబడ్డారు. చివరకు 105వ ఓవర్‌లో హాజెల్‌వుడ్‌ను కుల్దీప్ ఎల్బీ చేసి తన ఐదో వికెట్‌ను సాధించాడు.

వెలుతురులేమితో ఇబ్బంది..: వాతావరణ పరిస్థితుల కారణంగా ఆసీస్‌ను ఫాలో ఆన్ ఆడించడమే మేలని కోహ్లీ అనుకున్నాడు. దీంతో ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా 4ఓవర్ల తర్వాత వెలుతురులేమితో అంపైర్లు ఆటను నిలిపివేశారు. అసంతృప్తితో కనిపించిన కోహ్లీ కాసేపు అంపైర్‌తో మాట్లాడాడు. పరిస్థితి ఇలాగే కొనసాగడంతో ముందుగానే టీ బ్రేక్ ఇచ్చేశారు. కానీ రెండు గంటల తర్వాత ఆఖరిసెషన్ ఆడించకుండానే నాలుగోరోజు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

వాతావరణం

చివరి రోజు ఆకాశం మేఘావృతంగా ఉండనుంది. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం సిడ్నీలో ఉదయం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. భారతకాలమానం ప్రకారం ఉదయం 4.30 గంటలకే మ్యాచ్ ఆరంభం కానుండగా.. 98 ఓవర్లు ఆడించనున్నారు.



కమిన్స్‌ను అవుట్ చేసిన ఆనందంలో భారత ఆటగాళ్లు



కోహ్లీ

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హ్యారిస్ (బి) జడేజా 79; ఖవాజా (సి) పుజారా (బి) కుల్దీప్ 27; లబుషేన్ (సి) రహానె (బి) షమి 38; షాన్ మార్ష్ (సి) రహానె (బి) జడేజా 8; హెడ్ (సి అండ్ బి) కుల్దీప్ 20; హ్యాండ్స్‌కోంబ్ (బి) బుమ్రా 37; పెయిన్ (బి) కుల్దీప్ 5; కమిన్స్ (బి) షమి 25; స్టార్క్ (నాటౌట్) 29; లియాన్ (ఎల్బీ) కుల్దీప్ 0; హాజెల్‌వుడ్ (ఎల్బీ) కుల్దీప్ 21; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 104.5 ఓవర్లలో 300 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198, 7-236, 8-257, 9-258, 10-300. **బౌలింగ్:** షమి 19-2-58-2; బుమ్రా 21-5-62-1; జడేజా 32-11-73-2; కుల్దీప్ యాదవ్ 31.5-6-99-5, విహారి 1-0-2-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖవాజా (బ్యాటింగ్) 4; హ్యారిస్ (బ్యాటింగ్) 2; **ఎక్స్‌ట్రాలు:** 0; **మొత్తం:** 4 ఓవర్లలో 6/0. **బౌలింగ్:** షమి 2-1-4-0; బుమ్రా 2-1-2-0.


1

విదేశాల్లో కుల్దీప్ యాదవ్ ఐదు వికెట్లు తీయడం ఇదే తొలిసారి

31 ఏళ్లలో ఇదే తొలిసారి..

భారత్‌తో జరుగుతున్న నాలుగు టెస్టుల సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టుకిది ఇబ్బందికర పరిస్థితే.. ఎందుకంటే విజయాలకు చిరునామాగా నిలిచిన ఈ జట్టు తమ సొంత గడ్డపై 31 ఏళ్ల తర్వాత ఫాలో ఆన్ కోసం బరిలోకి దిగింది. చివరిసారిగా 1988, జనవరిలో ఇదే మైదానంలో ఇంగ్లండ్‌పై ఫాలో ఆన్ ఆడింది. ఆ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 425 పరుగులకు ఆలౌటవగా ఆసీస్ 214 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఫాలో ఆన్ ఆడాల్సి వచ్చింది. అయితే డేవిడ్ బూన్ అజేయ శతకం (184)తో జట్టును డ్రాతో గట్టెక్కించాడు. ఓవరాల్‌గా ఆసీస్ 150 టెస్టుల తర్వాత ఫాలో ఆన్ ఆడుతోంది. చివరిసారిగా 2005, నాటింగ్‌హామ్‌లో జరిగిన యాషెస్ టెస్టులో ఫాలో ఆన్ ఆడి మూడు వికెట్ల తేడాతో ఓడింది.

'వెలుతురులేమి'పై విమర్శలు



నాలుగో రోజు వెలుతురు సరిగా లేదనే కారణంతో ఆఖరి సెషన్‌ను ఆడించకపోవడాన్ని మాజీలు, విశ్లేషకులు తప్పుపడుతున్నారు. ఇలాంటి పరిస్థితి క్రికెట్‌కే అవమానకరమని ఆసీస్ మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ అన్నాడు. డే అండ్ నైట్ టెస్టులు, వన్డేలు, టీ20లు జరుగుతున్న కాలమిదని గుర్తుచేశాడు. నిజానికి మ్యాచ్‌ను కొనసాగించేందుకు అవసరమైన వెలుతురు మైదానంలో ఉందని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. అయితే ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాచ్‌ను జరిపితే ఎరుపు బంతి సరిగా కనిపించదనే ఉద్దేశంతో అంపైర్లు ఆట రద్దుకే మొగ్గుచూపినట్టు సమాచారం.

మెస్సీని దాటేసిన ఛెత్రి

ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ కొట్టిన ఛెత్రి అత్యధిక గోల్స్ చేసిన ప్రస్తుత తరం సాకర్ ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానంలో ఉన్న లియోనెల్ మెస్సీ(65)ని వెనక్కి నెట్టాడు. ఓవరాల్‌గా 67 గోల్స్‌తో ఛెత్రి.. క్రిస్టియానో రొనాల్డో (85 గోల్స్‌తో టాప్‌లో) తర్వాతి స్థానంలో నిలిచాడు.



సునీల్ ఛెత్రి

ఆరంభం అదిరింది

● ఏఎఫ్‌సీలో థాయ్‌లాండ్‌పై భారత్ గెలుపు


దుబాయ్: ఆసియా కప్‌లో భారత్ 1964 తర్వాత తొలిసారి విజయం సాధించి చరిత్ర సృష్టించింది. గత రికార్డులు భయపెడుతున్నా వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా బరిలోకి దిగిన భారత్.. అద్భుతమైన ప్రదర్శనతో విజయదుందుభి మోగించింది. ఆదివారం జరిగిన గ్రూప్-ఎలోని తన తొలి పోరులో భారత్ 4-1తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో భారత్ మూడు పాయింట్లు సాధించి గ్రూప్-ఎలో అగ్రస్థానంలో నిలిచింది. భారత్ తరపున కెప్టెన్ సునీల్ ఛెత్రి రెండు గోల్స్ (27, 48 నిమిషాల్లో) చేయగా అనిరుధ్ థాపా (68వ.నిం), జెజె లాల్‌పెఖ్‌లా (80వ నిం) చెరో గోల్ కొట్టారు. థాయ్‌లాండ్ నుంచి టీరాసిల్ దంగ్డా (33వ నిం) మాత్రమే గోల్ చేశాడు. ఆట తొలి అర్ధభాగంలో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. భారత్‌కు 27వ నిమిషంలో లభించిన పెనాల్టీ కిక్‌ను సునీల్ ఛెత్రి గోల్‌గా మలిచి ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత సరిగ్గా 6 నిమిషాలకే టీరాసిల్ దంగ్డా థాయ్‌లాండ్ తరపున గోల్ చేసి స్కోర్లు సమం చేశాడు. అక్కడ నుంచి ఇరు జట్లు ఎంత ప్రయత్నించినా ఆట తొలి అర్ధ భాగంలో గోల్ చేయలేకపోయాయి. రెండో అర్ధభాగంలో దూకుడు పెంచిన భారత్ ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై విరుచుకుపడింది. 32 నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్ నమోదు చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది. ఇక, గ్రూప్-బిలో జరిగిన మరో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాకు జోర్డాన్ 1-0తో షాక్ ఇచ్చింది.


ఆంధ్రకు గెలుపు దక్కేనా..?

నేటి నుంచి మధ్యప్రదేశ్‌తో రంజీ

ఇండోర్: ఇప్పటికే ఈ సీజన్‌లో నాకౌట్ రేస్ నుంచి నిష్క్రమించిన ఆంధ్ర జట్టు తమ ఆఖరి లీగ్ పోరుకు సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న ఈ గ్రూప్-బి మ్యాచ్‌లో ఆతిథ్య మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు దక్కించుకోవాలని పర్యాటక జట్టు పట్టుదలగా ఉంది. గత ఏడు మ్యాచ్‌ల్లో ఆంధ్ర రెండు ఓటములు, 5 డ్రాలతో 11 పాయింట్లతో అట్టడుగున తొమ్మిదో స్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు దూరమైంది. అయితే గత మ్యాచ్‌లో హైదరాబాద్‌పై మెరుగైన ప్రదర్శన చేసిన ఆత్మవిశ్వాసంతో తెలుగు జట్టు బరిలోకి దిగనుంది.

'బ్రిస్బేన్' విజేతలు నిషికోరి, ప్లిస్కోవా





బ్రిస్బేన్: ఆసియా నంబర్ వన్ టెన్నిస్ ఆటగాడు కీ నిషికోరి (జపాన్) బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో నిషికోరి 6-4, 3-6, 6-2తో మెద్వెదేవ్(రష్యా)పై గెలిచాడు. నిషికోరికి 2016లో మెంఫిస్ టోర్నీ తర్వాత ఇదే తొలి టైటిల్ కావడం విశేషం. మహిళల సింగిల్స్ టైటిల్‌ను చెక్ రిపబ్లిక్ స్టార్ కరోలినా ప్లిస్కోవా గెలుచుకుంది. ప్లిస్కోవా ఫైనల్లో 4-6, 7-5, 6-2తో అన్‌సీడెడ్ లెసియా సొరెన్‌కో (ఉక్రెయిన్)ను ఓడించింది.

సఫారీలదే సిరీస్

రెండో టెస్ట్‌లో పాక్ ఓటమి

కేప్‌టౌన్: పాకిస్థాన్‌తో రెండో టెస్ట్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా 9 వికెట్లతో ఘన విజయం సాధించింది. నాలుగోరోజైన ఆదివారం 41 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 9.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 43 రన్స్ చేసి అలవోకగా గెలిచింది. డీన్ ఎల్గర్ (24 నాటౌట్) రాణించాడు. దీంతో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను సఫారీలు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకున్నారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 177, దక్షిణాఫ్రికా 431 పరుగులు చేశాయి. తొలి టెస్ట్‌లో సఫారీలు 6 వికెట్లతో గెలిచిన సంగతి తెలిసిందే. సొంతగడ్డపై సౌతాఫ్రికాకు ఇది వరుసగా ఏడో టెస్ట్ సిరీస్ విజయం.

డుప్లెసిస్‌పై ఓ టెస్ట్ నిషేధం: స్లో ఓవర్‌రేట్ కారణంగా దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్‌పై ఓ టెస్ట్ నిషేధం పడింది. దీంతో అతను మూడోటెస్ట్‌కు దూరం కానున్నాడు. ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా వేశారు. గత జనవరిలో భారత్‌పై కూడా సౌతాఫ్రికా స్లోఓవర్‌రేట్ నమోదు చేసింది. 12 నెలల వ్యవధిలో ఈ తప్పు రెండుసార్లు చేసినందుకు కెప్టెన్‌పై వేటు పడింది.

సెమీస్‌కు హంటర్స్



సింధు

పీబీఎల్‌లో నేడు
అవధే X చెన్నై (రా. 7 గం.)
స్టార్ స్పోర్ట్స్-1లో


అహ్మదాబాద్: హోరాహోరీగా జరిగిన ట్రంప్ మ్యాచ్‌లో పీవీ సింధు గెలిచి స్కోరు సమం చేయగా.. నిర్ణయాత్మక పురుషుల డబుల్స్‌లో కిమ్ స రంగ్ జోడీ నెగ్గడంతో ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో హైదరాబాద్ హంటర్స్ సెమీస్ చేరింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 4-3తో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. హంటర్స్ ట్రంప్‌గా ఎంచుకున్న మహిళల సింగిల్స్‌లో సింధు 15-14, 12-15, 15-14తో క్రిస్టీ గిల్మోర్‌పై నెగ్గి 3-3తో స్కోరు సమం చేసింది. ఆఖరి మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో కిమ్ స రంగ్-ఇసారా జోడీ 15-10, 11-15, 15-14తో రెజినాల్డ్-సాత్విక్‌పై నెగ్గి హంటర్స్‌ను గెలిపించింది. తొలి మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇసారా-ఎమ్ ఒన్ జోడీ 15-14, 15-9తో సిక్కిరెడ్డి-సాత్విక్ ద్వయంపై నెగ్గి హంటర్స్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపింది. అయితే, అహ్మదాబాద్ ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల సింగిల్స్‌లో డారెన్ 15-13, 15-9తో రాహుల్‌పై గెలిచి తన టీమ్‌కు 2-1 ఆధిక్యాన్నందించాడు. కానీ, అక్సెల్‌సెన్ 15-11, 13-15, 15-8తో కలిరుఘాపై నెగ్గడంతో అహ్మదాబాద్ ఆధిక్యం 3-1కి పెరిగింది.

పుణె ఆశలు సజీవం: కరోలినా మారిన్, లక్ష్య సేన్ సత్తా చాటడంతో పుణె సెవెన్ ఏసెస్ 5-0తో ఢిల్లీ డాషర్స్‌ను ఓడించింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరుకున్న ఏసెస్.. సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. మహిళల సింగిల్స్‌లో మారిన్ 15-5, 15-6తో ఇవగినియా కోసెట్‌కయాను మట్టికరిపించింది. లక్ష్యసేన్ 15-12, 15-11తో తన సోదరుడు చిరాగ్ సేన్‌పై నెగ్గాడు. ఢిల్లీ ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల డబుల్స్‌లో మాథియాస్ బో-చిరాగ్ షెట్టి జోడీ 9-15, 15-10, 15-13తో మనోపోంగ్ జోంగ్‌జిట్-చియా బియావోపై నెగ్గారు. అంతకుముందు ఏసెస్ ట్రంప్‌గా ఎంచుకున్న మిక్స్‌డ్‌లో ఇవనోవ్-జేర్స్‌ఫెల్డ్ జోడీ 15-9, 14-15, 15-8తో జోంగ్‌జిట్-కోసెట్‌కయా జంటపై నెగ్గింది. చివరగా జరిగిన పురుషుల సింగిల్స్‌లో సుగియార్తో 15-7, 15-14తో లెవర్డెజ్‌పై నెగ్గి ఢిల్లీకి ఒక పాయింట్ అందించాడు. కానీ ట్రంప్ మ్యాచ్ ఓడిన కారణంగా ఢిల్లీకి ఒక్క పాయింట్ కూడా దక్కలేదు.



స్వాతంత్ర్యం అనేది కిందిస్థాయి నుంచి ప్రారంభం కావాలి. అందుకు ప్రతి పంచాయతీకీ పూర్తి అధికారాలుండాలి. దీనివల్ల ప్రతి గ్రామం స్వయం స్వావలంబన సాధించగలుగుతుంది. తన వ్యవహారాలను తానే సమర్థంగా నిర్వహించుకోగలుగుతుంది. అలాగని బయటి నుంచి సాయం పొందదని కాదు. స్వేచ్ఛగా, సమర్థంగా మనుగడ సాగించగలుగుతుందని అర్థం.

-మహాత్మాగాంధీ



దోషులు 'పంచాయతీ'కి అనర్హులు!

» ఐదేళ్లవరకు అనర్హత వర్తింపు.. శిక్షాకాలంలో పోటీకి వీల్లేదు

» సివిల్ కేసులకు మినహాయింపు

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): క్రిమినల్ కోర్టులు దోషులుగా తేల్చిన వ్యక్తులు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు. తీవ్రమైన కేసుల్లో దోషులుగా నిర్ధారించిన వారికి శిక్షాకాలం పూర్తయిన తర్వాత ఐదేళ్ల వరకు అనర్హత కొనసాగుతుంది. పంచాయతీ రాజ్ చట్టం-2018లోని సెక్షన్ 21(1) ప్రకారం శిక్షాకాలంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేదు. ఒకవేళ అభ్యర్థులు కింది కోర్టులిచ్చిన తీర్పులపై హైకోర్టులో అప్పీల్ చేసుకొని, స్టే తెచ్చుకుంటే ఎన్నికల్లో పోటీకి అర్హులవుతారు. బెయిల్‌పై బయటికి వచ్చి పోటీ చేయడానికి మాత్రం వీల్లేదు. అనర్హతకాలం ముగిసిన తర్వాత అభ్యర్థులు పోటీ చేయొచ్చు. ఆ శిక్షకు సంబంధించిన వివరాలను నామినేషన్ పత్రంలో పేర్కొనాలి. కాగా, గత పంచాయతీ ఎన్నికల్లో ఖర్చును సరిగా చూపించని అభ్యర్థులపై ప్రస్తుతం అనర్హత కొనసాగుతోంది.

- సివిల్ కేసుల్లో శిక్ష ఖరారైన, జరిమానా పడిన వ్యక్తులు పోటీకి అర్హులే.
- భారత శిక్షా స్మృతిలోని 153ఏ (మతవిద్వేషాలు రెచ్చగొట్టడం), 171ఈ (లంచం తీసుకోవడం), 171 ఎఫ్ (ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయడం), 376 ఏ,బీ,సీ,డీ (అత్యాచారం), 498ఏ (గృహహింస చట్టం), 505 (మతాలను కించపరిచేలా ప్రకటన చేయడం), తదితర కేసుల్లో దోషులుగా నిర్ధారిస్తే అనర్హులు.
- ఆహార పదార్థాలను కల్తీ చేయడం, వరకట్న నిషేధ చట్టం, సతీసహగమన నిరోధక చట్టం కేసుల్లో శిక్ష ఖరారైన వ్యక్తులు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేదు.
- నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి తన కార్యాలయ నోటీస్‌బోర్డులో ఉంచాలి. అందులో ఏమైనా తప్పుడు సమాచారముంటే పౌరులు అధికారి దృష్టికి తీసుకురావొచ్చు. కానీ, అభ్యర్థులు సమర్పించిన నామినేషన్‌లో తప్పుడు సమాచారముంటే దాన్ని తిరస్కరించే అధికారం రిటర్నింగ్ అధికారికి లేదు. ఒకవేళ అభ్యర్థి ఇచ్చిన సమాచారం తప్పని రిటర్నింగ్ అధికారి భావిస్తే.. ఐపీసీ 177, సీఆర్‌పీసీ 195 సెక్షన్ల ప్రకారం ఆ ప్రాంత పరిధిలోని కోర్టులో ఫిర్యాదు చేయాలి.
- నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థితో పాటు ముగ్గురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తారు.

● రిజర్వేషన్ల కుదింపుపై ఉద్యమించాలి

» బీసీ సంఘాలు ఏకమవ్వాలి: కృష్ణయ్య



కవాడిగూడ/హైదరాబాద్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ సంఘాలు ఏకం కాకపోతే భవిష్యత్తులో విద్య, ఉగ్యోగ రిజర్వేషన్లలోనూ కోత తప్పదని, బీసీ హాస్టళ్లనూ ఎత్తేస్తారని వ్యాఖ్యానించారు. బీసీలకు రాజ్యాధికారం దూరం చేయాలని టీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను పునరుద్ధరించాలంటూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు.

నేటి నుంచి నామినేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

పాడ్యమి, విదియ, తదియ గడియలు ఉన్నాయి. మంగళవారం నెగటివ్ సెంటిమెంటు ఉండేవారు సోమ లేదా బుధవారాల్లో నామినేషన్లు వేసే అవకాశం ఉంది.

2 వార్డులకు పోటీ చేయరాదు

పంచాయతీలో ఒకటి కన్నా ఎక్కువ వార్డులకు పోటీ చేయడం కుదరదు. రెండు చోట్ల నామినేషన్ వేసినా ఉప సంహరణ ముగిసే నాటికి ఒకటే ఎంచుకోవాలి. సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థి వార్డు పదవికి కూడా పోటీ చేయవచ్చు. రెండు పదవుల్లో విజయం సాధిస్తే నిర్దేశించిన గడువులోగా ఏదో ఒక పదవిని వదులుకోవాలి. జడ్పీటీసీ, ఎంపీటీసీలు కూడా సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేయవచ్చు. ఎన్నికయ్యాక ఏదో ఒక పదవికి గడువు లోగా రాజీనామా చేయొచ్చు.

పాత బ్యాంకు ఖాతాలకు ఒకే

కొత్త బ్యాంకు ఖాతాలను తెరవాలన్న నిబంధనను పంచాయతీకి మినహాయించారు. ఇప్పటికే ఉన్న బ్యాంకు ఖాతాలను కూడా ప్రస్తుత ఎన్నికలకు వినియోగించవచ్చని, ఎన్నికలు ముగిసే వరకు ఈ ఖాతా నుంచి ఇతర లావాదేవీలు జరపరాదని ఎస్ఈసీ ఆదేశించింది. ఖాతా నెంబరు వివరాలను నామినేషన్ పత్రంలో పేర్కొని రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.

ఖాతాల బాధ తీరింది

స్థానిక సంస్థల ఎన్నికల్లో వేల సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేస్తారు. వారందరికీ వెంటనే బ్యాంకు ఖాతాలు తెరవడం కూడా ఇబ్బందిగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు కూడా అందుబాటులో లేవు. కొన్ని సందర్భాల్లో పది రోజుల వరకు కూడా బ్యాంకు ఖాతాలు తెరిచే పరిస్థితి ఉండడం లేదని కూడా పలువురు క్షేత్ర స్థాయి అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో, బ్యాంకు ఖాతాలు కొత్తవి తెరవాలన్న నిబంధనను మినహాయించారు.

ఫిర్యాదుల విభాగం ఏర్పాటు

సందేహాల నివృత్తి, ఫిర్యాదుల నమోదు కోసం హైదరాబాద్ ఏసీ గార్డ్స్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) కార్యాలయంలో ప్రత్యేకంగా గ్రివెన్స్/ కంప్లయింట్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈసీ కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. కార్యాలయ వేళలతో పాటు అదనంగా రాత్రి 9 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు కూడా ఫిర్యాదులు స్వీకరిస్తుందన్నారు. ఫిర్యాదుల కోసం 040-29802895 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

తొలి విడత షెడ్యూల్

07 (సోమవారం):	నోటిఫికేషన్, ఓటర్ల జాబితా విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం (10.30-5.00 గం)
09 (బుధవారం):	నామినేషన్లకు చివరి రోజు
10 (గురువారం):	నామినేషన్ల పరిశీలన. సరైన దరఖాస్తుల వెల్లడి
11 (శుక్రవారం):	తిరస్కరించిన నామినేషన్లపై అప్పీలుకు అవకాశం(సాయంత్రం 5 వరకు)
12 (శనివారం):	అప్పీళ్లపై నిర్ణయం
13 (ఆదివారం):	ఉపసంహరణకు గడువు (మధ్యాహ్నం 3 వరకు) బరిలో అభ్యర్థుల ప్రకటన
21 (సోమవారం):	ఉ.7 నుంచి1 వరకు పోలింగ్. 2గం.లకు ఓట్ల లెక్కింపు. సాయంత్రం ఫలితాలు. వెంటనే ఉప సర్పంచి ఎన్నిక.

ఈ నెలలోనే సహకార ఎన్నికలు

» 17న పీఏసీఎస్‌ల ఎన్నికలకు నోటిఫికేషన్

» ఆ వెంటనే డీసీసీబీ, డీసీఎంఎస్, టెస్కాబ్‌కూ..

» బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు, ఫిబ్రవరిలో పూర్తి

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'సహకార' యుద్ధానికి రంగం సిద్ధమైంది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ఎన్నికలకు ఈ నెల 17న నోటిఫికేషన్ విడుదల కానుంది. పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే.. రాష్ట్రంలోని మొత్తం 906 పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోలింగ్ జరిగిన రోజే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాను ప్రకటించనున్నారు. ఆ వెంటనే తొమ్మిది ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లు, రాష్ట్ర సహకార బ్యాంకు (టెస్కాబ్) ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటినీ ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ జారీకి ముందుగానే సహకార ఎన్నికలను ముగించేలా రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ముమ్మరం చేసింది. పీఏసీఎస్‌ల ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ఖరారు తదితర ప్రక్రియలు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి.

ఏడాది కంటే ఎక్కువకాలం ఉంటేనే ఓటరు..

సహకార సంఘంలో ఏడాది కంటే ఎక్కువకాలం సభ్యులుగా ఉన్నవారిని మాత్రమే ఓటర్లుగా గుర్తించనున్నారు. అన్ని జిల్లాల నుంచి ఓటరు జాబితా వచ్చాక.. వాటిపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ నుంచి ఇవ్వనున్నారు. కాగా సహకార ఎన్నికలను బ్యాలెట్ విధానంలోనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 50 మంది కంటే తక్కువ సభ్యులు ఉన్న సంఘాలకు మాత్రం 'చేతులు ఎత్తే' పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నారు. పీఏసీఎస్ ఎన్నికల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 12 వేల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 40 వేల మందికి పైగా సిబ్బందిని ఈ ఎన్నికల కోసం నియమించనున్నారు. పంచాయతీ ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో తమ సిబ్బందిని ఆ ఎన్నికల విధుల నుంచి మినహాయించాల్సిందిగా సహకార శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.

అప్పట్లో సర్పంచులకు ఎనలేని ప్రాధాన్యం

» సమితులు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారే కీలకం

» క్యాంపులకు తరలించే విధానం ఉండేది

» ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ చేకూరి కాశయ్య



ఖమ్మం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైన మొదట్లో సర్పంచ్‌లకు ఎంతో ప్రాధాన్యం ఉండేదని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చేకూరి కాశయ్య తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ ప్రారంభమైందని, గుర్తులే ప్రామాణికంగా ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. సోషల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ.. 1964లో కొత్తగూడెం సమితి అధ్యక్షుడిగా ఎన్నికైన చేకూరి కాశయ్య... ఆ తర్వాత కొత్తగూడెం ఎమ్మెల్యేగా, ఖమ్మం జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థపై పట్టున్న వ్యక్తిగా కాశయ్యకు గుర్తింపు ఉంది. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ అప్పట్లో సర్పంచ్‌లే సమితి అధ్యక్షులను ఎన్నుకునేవారని తెలిపారు. సర్పంచ్‌లు, సమితి అధ్యక్షులు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు కలిసి ఎమ్మెల్సీలను ఎన్నుకునేవారని, అందుకే రాజకీయ పార్టీలన్నీ సర్పంచ్ ఎన్నికలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల పేరుతో ప్రత్యేకంగా బాక్సులు ఏర్పాటు చేసేవారని, ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థి బాక్సులో ఓటేసేవారని తెలిపారు. ఎడ్లబండ్లపై, కాలినడకన ప్రచారం సాగేదని, ఇప్పటిలా ఓటర్లను కలవడం కంటే గ్రామాల్లో కుల పెద్దలనే ఎక్కువగా కలిసేవారని పేర్కొన్నారు. 1981లో సీఎం టంగుటూరి అంజయ్య మూడంచెల వ్యవస్థను తీసుకొచ్చారని, సర్పంచ్‌లను నేరుగా ఎన్నుకునే ప్రక్రియ అప్పుడే ప్రారంభమైందని వివరించారు. సమితి అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సిన సర్పంచ్‌లను క్యాంపులకు తరలించే పద్ధతి అప్పుడే ఉండిందని పేర్కొన్నారు. గొడవలు మాత్రం గతంలోనే అధికంగా ఉండేవని, ఇప్పుడు అలాంటి పరిస్థితి చాలావరకు కనుమరుగైందని అన్నారు. ఖమ్మం చుట్టు పక్కల పంచాయతీల్లో దాడులు, ప్రతిదాడులు జరిగేవని, హత్యలు జరిగిన సందర్భాలూ ఉన్నాయని తెలిపారు. ఇప్పటి తరం మాత్రం ఘర్షణల ద్వారా కాకుండా లౌక్యంగా గెలుపు వ్యూహాలు రూపొందిస్తోందని అభిప్రాయపడ్డారు.

యాదాద్రిలో భక్తుల సందడి



యాదాద్రి టౌన్, జనవరి 6 : యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఇష్టదేవుడి దర్శనాలు, నిత్యపూజలతో ఆలయ మండపాలు కోలాహలంగా మారాయి. వేకువజామునే స్వయంభువులను అర్చించిన అర్చకులు బాలాలయ కవచమూర్తులను హారతితో కొలిచారు. ఉత్సవమూర్తులను అభిషేకించి, పూజలు నిర్వహించారు. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి, ఉపాలయంలో చరమూర్తులకు నిత్యపూజలు, వ్రతమండపంలో సత్యనారాయణస్వామికి వ్రత పూజలు శైవసంప్రదాయరీతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలోనూ భక్తుల రద్దీ నెలకొంది. స్వామిని సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, సినీ దర్శకుడు శంకర్ వేర్వేరుగా దర్శించుకున్నారు. కాగా, స్వామికి భక్తుల నుంచి రూ.14.62 లక్షల ఆదాయం సమకూరింది.

మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

» పోలీసుల వేధింపులే కారణం

సిరిసిల్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్నారని ఓ మహిళ ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది చందుర్తికి చెందిన లక్ష్మి (50)కి తన బంధువు తిరుపతితో కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. సోదరులైన లింగయ్య, భూమయ్యలు చనిపోయిన తరువాత లింగయ్య భార్య లక్ష్మి, భూమయ్య కొడుకు తిరుపతిల మధ్య భూ వివాదం ఏర్పడింది. భూమి తమదేనంటూ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరూ ఫిర్యాదు చేసుకున్నారు. తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుండడంతో తనను పిలిపించి ఇబ్బందికి గురి చేస్తున్నాడని లక్ష్మీ ఆరోపించింది. ఆదివారం కూడా లక్ష్మిని స్టేషన్‌కు రమ్మని పోలీసులు చెప్పడంతో మనస్థాపం చెందిన ఆమె కిరోసిన్ బాటిల్‌తో పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకునే యత్నం చేసింది. పోలీసులు అడ్డుకొని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.


లక్ష్మిని అడ్డుకుంటున్న పోలీసులు

వాహన తనిఖీల్లో 1.17కోట్లు లభ్యం

సత్తుపల్లి రూరల్, జనవరి 6 : ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు తరలిస్తున్న రూ.1.17 కోట్ల నగదును సత్తుపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం రాత్రి పట్టుకున్నారు. సత్తుపల్లి శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న ఈ నగదు పట్టుబడింది. 6 వాహనాల్లో నగదు రవాణా చేస్తుండగా.. రెండు మాత్రమే పోలీసులకు దొరికినట్టు సమాచారం.

రెండేళ్లలో జడ్చర్లకు 'పాలమూరు' నీళ్లు

» మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్లకు చెందిన 100 మంది లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ ఏకగ్రీవమైన పంచాయతీలకు రూ.10 లక్షల ప్రభుత్వ ప్రోత్సాహకంతో పాటు, తన నిధుల నుంచి మరో 10లక్షలు అందిస్తానని ప్రకటించారు.

ఏకగ్రీవానికి మరో 5లక్షలు

» ఎంపీ సీతారాం నాయక్



మణుగూరు, జనవరి 6: మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఏకగ్రీవం చేసుకున్న పంచాయతీలకు ఎంపీ సీతారాం నాయక్ ప్రత్యేక నజరానా ప్రకటించారు. ఆదివారం భద్రాద్రి జిల్లా మణుగూరులో మాట్లాడుతూ జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులతో పాటు సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం అందించే రూ.10లక్షల నజరానాతో పాటు పంచాయతీ అభివృద్ధికి తనవంతుగా ఎంపీ నిధుల నుంచి మరో రూ.5 లక్షలను బహుమతిగా అందజేస్తానని ఎంపీ ప్రకటించారు. ఏకగ్రీవ పంచాయతీల వల్ల గ్రామ అభివృద్ధితో పాటు ఐక్యత పెంపొందుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పంచాయతీల ఏకగ్రీవానికి కృషి చేయాలని కోరారు.

జూరాల వద్ద జల జగడం

» నీటి విడుదలకు అధికారుల యత్నం

» అడ్డుకున్న ఆయకట్టు రైతులు

» ఆత్మహత్యలు చేసుకుంటామంటూ ఆందోళన

అమరచింత, జనవరి 6: వనపర్తి జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదలను ఆదివారం ఆయకట్టు రైతులు అడ్డుకున్నారు. ప్రాజెక్టు దిగువనున్న గోపల్‌దిన్నె రిజర్వాయర్ కింద యాసంగి పంటలకు సాగునీరందించాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి శనివారం అధికారులను కోరారు. దీంతో వారు నీటి విడుదలకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఆయకట్టు రైతులు నీటి విడుదలను నిలిపి వేశారు. ఈ నేపథ్యం లో ఆదివారం తెల్లవారుజామున మరోసారి ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేయగా, మళ్లీ రైతులు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. సాయంగి సాగు వద్దు అని తేల్చి చెప్పిన అధికారు లు రాజకీయ ఒత్తిడికి తలొగ్గి నీటిని ఎలా విడుదల చేశారని ఆగ్రహించారు. నీటిని విడుదల చేస్తే పురు గు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిస్తూ ఆనకట్టపై ధర్నా చేపట్టారు. డీఎస్పీ సృజనా చౌదరి, ఆర్డీఓ చంద్రారెడ్డిలు రైతులతో మాట్లాడారు. ససేమిరా అన్న ఆయకట్టు రైతులు 3 గంటల వరకు ధర్నా చేశారు. అనంతరం వెళ్లిపోయారు. 4.30లకు డీఎస్పీ సృజనా చౌదరి, సీఐ బండారి శంకర్ ప్రాజెక్టు అధికారులను పిలిపించి నీటిని విడుదల చేయించారు. వారిని రైతులు అడ్డుకోవడంతో చెదరగొట్టారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. 0.6 టీఎంసీల నీటిని వదిలిన అనంతరం ఎడమ కాలువ గేట్లను మూసివేస్తామని అధికారులు ప్రకటించారు.



నీటి విడుదలను అడ్డుకుంటున్న రైతులు

సమన్వయంతో పనులు చేయండి

» గడువు లోపల పనులు పూర్తి కావాలి

» సీఎంవో కార్యదర్శి భూపాల్‌రెడ్డి

యాదాద్రిటౌన్, జనవరి 6: యాదాద్రి ఆలయ విస్తరణ పనులను అనుకున్న గడువు లోపే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి భూపాల్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన యాదాద్రి ఆలయ విస్తరణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని ఈఈ వసంత నాయక్ ఆయనకు వివరించారు. అనంతరం ఆయన దేవస్థాన, ఆర్అండ్‌బీ అధికారులు, శిల్పి, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణ సమయంలో తలెత్తిన సమస్యల కారణంగా పనుల్లో ఆటంకాలు కలుగుతున్నాయని శిల్పి, సివిల్ కాంట్రాక్టర్ల వివరణపై ఆయన అసహనం వ్యక్తంచేశారు. సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచించిన ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి లోపల పనులు పూర్తి చేయాల్సిందేనని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ అనితా రామచంద్రన్, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈఎన్‌సీ రవీందర్‌రావు, ఈవో గీతారెడ్డి, ఆర్కిటెక్ట్ ఆనంద సాయి, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న భూపాల్‌రెడ్డి

ఇసుక లారీల అడ్డగింత


ఇసుక లారీలను అడ్డుకుంటున్న కాలనీవాసులు

బీర్కూర్, జనవరి 6 : కామారెడ్డి జిల్లా బీర్కూర్ పోచారం కాలనీ గుండా లారీల్లో ఇసుక తరలిస్తుండటంతో కాలనీలో దుమ్ము, ధూళితో పాటు చిన్నపిల్లలు రోడ్డుపై ఆడుకుంటుండగా ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆదివారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరుకైన రహదారులతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు ఈ రహదారి గుండా ఇసుక రవాణా జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.